www.manatelangana.news

Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 70 | బుధవారం | 30 ఆగస్టు, 2017

...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00



హ్యూస్టన్

నావలైన నగరాలు

10లో

ఎడ,తెరిపిలేని వర్షాలకు అమెరికాలోని హ్యూస్టన్, మన ముంబయి నగరాలు నీటిలో తేలియాడుతున్నాయి. తుపానుకు హ్యూస్టన్ నగరం జలవలయంలో గడగడలాడుతున్నది. ముంబయిలో మంగళవారం నాడు మూడు గంటల్లోనే 65 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. లోయర్ పారెల్, దాదర్, కుర్లా, అంధేరీ మున్నగు ప్రాంతాల్లో ముఖ్యమైన రహదారుల్లో ట్రాఫిక్ స్తంభించిపోయింది. నడుంలోతు నీళ్లు చేరాయి.




ముంబయి

గోప్యత తీర్పు అధ్యయనం చేశాకే ఆధార్ కేసుపై విచారణ

- సుప్రీంకోర్టు స్పష్టీకరణ

న్యూఢిల్లీ : గోప్యతపై తొమ్మిది మంది న్యాయమూర్తులతో కూడిన విస్తృత రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును పూర్తిగా అధ్యయనం చేశాకే ఆధార్ అప్పీలుపై విచారణ చేపడుతామని సుప్రీంకోర్టు ధర్మాసనం మంగళవారం స్పష్టం చేసింది. ఆధార్ చట్ట సవరణకు ఉద్దేశించిన బిల్లును ద్రవ్య బిల్లుగా ధ్రువీకరించేందుకు లోక్‌సభ స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ కాంగ్రెస్ నేత జైరాం రమేష్ చేసిన అప్పీలుపై కోర్టు ఈ మేరకు పేర్కొనడం గమనార్హం. తమ అప్పీలుపై త్వరగా విచారణ చేపట్టాలని ప్రధాన న్యాయమూర్తి తరువాయి 6లో



కొత్త వెయ్యి నోటు యోచన లేదు

9

- ఆర్‌బిఐ కార్యాలయాలు, కొన్ని బ్యాంకుల్లోనే రూ.200 నోటు విడుదల
- కేంద్ర ఆర్థికశాఖ ప్రకటన

దేనికి ఎంత నీరు?

ప్రాజెక్టుల వారీగా ఆపరేషన్ మ్యాన్యువల్స్ సిద్ధం చేయాలని సిఎం ఆదేశాలు

- సాగుకు, మంచినీటికి, విద్యుత్ ఉత్పాదనకు, పరిశ్రమలకు ఏ ప్రాజెక్టు నుంచి ఎంతెంత నీరు సరఫరా చేయాలో వివరమైన పట్టికలు
- డ్రింకింగ్ వాటర్, పవర్ ఫ్రంట్లు
- మండలానికో రిజిస్ట్రార్ ఆఫీస్
- వచ్చే ఆర్థిక ఏడాది నుంచి ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్
- వ్యవసాయం, ఇరిగేషన్, భగీరథ, రెవెన్యూ శాఖల సమీక్షలో కెసిఆర్



మన తెలంగాణ/ హైదరాబాద్ : అన్ని సాగునీటి ప్రాజెక్టులకు కొత్త ఆపరేషన్ మ్యాన్యువల్స్ రూపొందించాలని సిఎం కెసిఆర్ అధికారులను ఆదేశించారు. ఏ ప్రాజెక్టు ద్వారా ఏ ప్రాంతం నుంచి ఎన్ని నీళ్లు మిషన్ భగీరథకు ఉపయోగిస్తారో మదింపు చేయాలని, రాష్ట్రం యూనిట్‌గా గుర్తించి యావత్ తెలంగాణ అవసరాలను తీర్చడం కోసం "డ్రింకింగ్ వాటర్ ఫ్రంట్ ఆఫ్ తెలంగాణ"ను ఏర్పాటు చేయాలని సూచించారు. సాగునీటి ప్రాజెక్టుల నుంచి ఏ తరువాయి 6లో

కృష్ణ వట్టిపోయిన కారణంగా మంచినీటికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

3

బాలల అక్రమ రవాణాపై వార్

- 11 నుంచి భారత్ యాత్ర : నోబెల్ అవార్డు గ్రహీత సత్యార్థి



మన తెలంగాణ/ హైదరాబాద్ : బాల, బాలికలపై లైంగిక వేధింపులు, పిల్లల అక్రమ రవాణాకు వ్యతిరేకంగా యుద్ధం చేయనున్నట్లు నోబెల్ బహుమతి గ్రహీత కైలాష్ సత్యార్థి తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం పలు స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ యుద్ధం సెప్టెంబర్ 11న కన్యాకుమారి నుండి భారత్ యాత్రతో ప్రారంభమౌతుందన్నారు. యాత్ర అక్టోబర్ 16న ఢిల్లీలో ముగుస్తుందని, అయితే యుద్ధం ఐదేళ్ల పాటు కొనసాగుతుందని ఆయన తరువాయి 6లో



మహారాష్ట్రలో రైలు బోల్తా

- పట్టాలు తప్పిన 9 దురంతో బోగీలు, ఇంజిన్
- పలువురికి గాయాలు
- కొండచరియ విరిగి పడడంతో నాగ్‌పూర్ – ముంబయి మధ్య ప్రమాదం
- సమయస్ఫూర్తితో అత్యవసర బ్రేకులు వేసిన డ్రైవర్

10లో

ఆశల వర్షం!

- మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తలలూపుతున్న పైర్లు
- రైతుల్లో చిగురిస్తున్న ఆశలు
- కొన్ని ప్రాంతాల్లో పంట ముంపు
- పెద్దపల్లి, కరీంనగర్, రాజన్న జిల్లాల్లో లోటు వర్షపాతం



మన తెలంగాణ/ హైదరాబాద్ : రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షాలు అన్నదాతకు సంతోషంతో పాటు ఆందోళనను కూడా కలిగిస్తున్నాయి. ఒకవైపు ఇన్ని రోజులుగా నిండని రిజర్వాయర్లు, చెరువులు, కుంటల్లోకి నీరు వచ్చి చేరుతుంది. పది రోజుల క్రితం సాధారణ జల్లులతోనే మురిపించిన వర్షాలు వారం రోజుల వరకే పంటలను కాపాడుతాయని, తరువాత పరిస్థితి ఏంటి అని అనుకున్నారు. అయితే గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పత్తి, మొక్కజొన్న పంటలకు డోకా లేదని చెబుతున్నారు. పంటల స్థితిపై ప్రత్యామ్నాయ దిశగా ఆలోచించిన వ్యవసాయ శాఖ వానలతో ఊపిరి పీల్చుకుంది. ఈ వర్షాలతో వరినాట్లు పడుతాయని ఆశిస్తోంది. అదే సమయంలో కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలతో వరి నారుతో పాటు పెసరు, కంది, మొక్కజొన్న వంటి పంటలు నీట మునుగుతుండటంతో దిగులు చెందుతున్నారు. ఇప్పటికే ఖమ్మం జిల్లాలో పెసరు పంటకు నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం కూడా ఉరుములతో కూడిన వర్షం పడుతుందని వాతావరణ శాఖ వెల్లడించింది. నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్, తరువాయి 6లో



జాతీయ రహదారిగా మంచిర్యాల – చంద్రాపూర్

మన తెలంగాణ/ మంచిర్యాల : మంచిర్యాల నుంచి చంద్రాపూర్ వరకు 90 కిలోమీటర్ల రాష్ట్ర రహదారిని జాతీయ రహదారిగా మారుస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని 21 మార్గాల్లో 2,915 కిలోమీటర్ల రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా మార్చేందుకు కేంద్రం ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అదేవిధంగా చెన్నూర్, కౌటాల, సిర్పూర్, కాళేశ్వరం, సారపాక మీదుగా ఏటూరు నాగారం వరకు 396 కిలోమీటర్లు పొడవు గల రాష్ట్ర రహదారిని సైతం జాతీయ రహదారిగా మార్చారు. నిర్మల్ నుంచి మామడ, ఖానాపూర్, మల్లాపురం, రాయికల్ వరకు 90 కిలోమీటర్ల పొడవు తరువాయి 6లో

జిఎస్‌టి వసూళ్లు రూ.92,283 కోట్లు : జైట్లీ

9



చైనాలో బ్రిక్స్ సదస్సుకు ప్రధాని మోడీ

11




డిన్నర్ వద్దన్న డేరా బాబా గుర్మీత్ సింగ్

6

ఉత్తర కొరియా మరో క్షిపణి పరీక్ష

11



కాళేశ్వరంపై గ్రీన్ ట్రిబ్యునల్ విచారణ

మన తెలంగాణ/ న్యూఢిల్లీ: పర్యావరణ అనుమతులు లేకుండా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం కొనసాగిస్తున్నారని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో వేసిన పిటిషన్ మంగళవారం విచారణకు వచ్చింది. ప్రాజెక్ట్‌ను ఎందుకు ఆపకూడదో తెలపాలంటూ మహారాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కూడా ఒక అఫిడవిట్ దాఖలు చేసింది. సెప్టెంబరు 4 లోపు కేసుకు సంబంధించి పూర్తి వివరాలు దాఖలు చేయాలని ఇరు పక్షాలను నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశించింది. ఎటువంటి అనుమతులు లేకుండా ప్రాజెక్ట్ నిర్మాణాలు కొనసాగిస్తున్నారని పిటిషనర్ హయత్ ఉద్దీన్ తరుపు న్యాయవాది అభ్యంతరాలు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణాలకు సంబంధించిన ఫొటోలు, సాక్ష్యాధారాలు సమర్పించామని పిటిషనర్ తరుపు న్యాయవాది గ్రీన్ ట్రిబ్యునల్‌కు చెప్పారు. అయితే దీనికి తరువాయి 6లో

కుంచెపోటు



అరె.. భయపడకు, మన ఇండియన్ రైళ్ల లాంటిది కాదిది

నామినేటెడ్ పోస్టుల భర్తీకి సన్నాహాలు

మన తెలంగాణ/ హైదరాబాద్ : రాష్ట్ర సమాచార హక్కు కమిషన్‌తో పాటు రాష్ట్ర మైనారిటీ కమిషన్, ఎస్‌సి, ఎస్‌టి కమిషన్లలో నామినేటెడ్ పదవులను భర్తీ చేసేందుకు సన్నాహాలు మొదలయ్యాయి. ఉమ్మడి రాష్ట్రంలో ఏర్పాటు చేసిన కమిషన్లను ఇప్పటివరకు కొనసాగించారు. తెలంగాణలో కమిషన్ల ఏర్పాటుతో పాటు ఖాళీల భర్తీపై ఆరు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని ఇటీవల హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీంతో ఉమ్మడి రాష్ట్రంలో ఎన్ని కమిషన్లు ఉన్నాయి, ప్రత్యేక రాష్ట్రంలో ఎన్ని ఏర్పాటు చేశారు, ఏర్పాటు కానివి ఎన్ని ఉన్నాయనే దానిపై ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. నిబంధనల ప్రకారం సమాచార కమిషన్‌లో చీఫ్ కమిషనర్‌తో పాటు ఆరుగురు కమిషనర్లు తరువాయి 6లో

డిగ్రీ చదువుకు చెదలు

- భారీగా మిగిలిపోతున్న సీట్లు
- మూడు విడతల ప్రవేశాల్లో సగం సీట్లయినా నిండలేదు
- గత ఏడాది కంటె తగ్గిన చేరికలు
- ప్రమాణాలు పెంచే విధానాలే కారణమా?

మన తెలంగాణ/ హైదరాబాద్ : రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో 50 శాతం సీట్లు కూడా భర్తీ కావడం లేదు. భర్తీ అయిన వాటి కంటే మిగిలిన సీట్లే అధికంగా ఉంటున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో మొత్తం 4,10,267 సీట్లు అందుబాటులో ఉండగా, మూడవ విడత ప్రవేశాలు ముగిసే నాటికి మొత్తం 1,87,368 మంది విద్యార్థులు కళాశాలల్లో ప్రవేశాలు పొందారు. 4వ విడతలో 5–10 వేలకు మించి ప్రవేశాలు జరిగే అవకాశాలు లేవని దోస్త్ అధికారులు చెబుతున్నారు. దాంతో ఈ ఏడాది డిగ్రీ ప్రవేశాలు 2 లక్షలకు మించే అవకాశం లేదు. గత ఏడాది మొత్తం



2.13 మంది విద్యార్థులు డిగ్రీలో ప్రవేశాలు పొందగా, సగానికిపైగా సీట్లు మిగిలాయి.

అప్పన్లిచ్చినా 6 వేల మందికి లభించని సీట్లు : ఒకపక్క ప్రతి ఏడాది 2 లక్షలకు పైగా సీట్లు మిగిలిపోతుండగా, మరోపక్క కొంతమంది విద్యార్థులకు సీట్లు లభించడం లేదు. గత విద్యాసంవత్సరం నుంచి డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ ఆన్‌లైన్‌లో చేపడుతున్నారు. ఆన్‌లైన్ విధానంపై సరైన అవగాహన లేక గ్రామీణ ప్రాంతాలకు చెందిన కొంతమంది విద్యార్థులు గందరగోళానికి గురై సకాలంలో రిజిస్ట్రేషన్ చేసుకోలేక గడువు ముగిసిన తర్వాత ఇబ్బందులు పడుతున్నారు. బిఎ, బికాం, బిఎస్‌సి వంటి సంప్రదాయ కోర్సుల్లో ఎక్కువగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులే చేరుతుంటారు. మారుమూల ప్రాంతాల వారికి ఇప్పటికీ ఇంటర్నెట్, ఆన్‌లైన్ విధానంపై సరైన అవగాహన లేదు. ఎక్కువగా మీ–సేవ, తరువాయి 6లో

అధికారికంగా విమోచన దినోత్సవం : కిషన్‌రెడ్డి

మన తెలంగాణ/హైదరాబాద్ : సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహిస్తామని ఉద్యమ సమయంలో ఇచ్చిన మాటను నిలుబెట్టుకోని ముఖ్యమంత్రి కెసిఆర్‌ను ప్రజలు అడుగడుగునా నిలదీసే రోజులు దగ్గర లోనే ఉన్నాయని బిజెఎల్‌పి నేత జి.కిషన్‌రెడ్డి అన్నారు. సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచనా దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని సెప్టెంబర్ 1 నుంచి 7 వ తేదీ వరకు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె. లక్ష్మ ణ్ తలపెట్టిన యాత్ర పోస్టర్, కరపత్రాన్ని బిజెపి నేతలు ఆవిష్కరించారు. బిజెపి రాష్ట్ర కార్యాల యంలో కిషన్‌రెడ్డితో పాటు ఎంఎల్‌సి ఎన్. రాంచందర్‌రావు, నేతలు శ్రీవర్ధన్‌రెడ్డి, జి. ప్రేమేందర్‌రెడ్డి, ఆచారి, ఎన్‌వి సుభాష్, స్వామిగౌడ్, కొల్లి మాధవి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కిషన్‌రెడ్డి మాట్లాడుతూ, ఉద్యమ సమయంలో కాంగ్రెస్ ఎంఎల్‌ఎలు చవటలు, దద్దమ్మలని, విమోచనా దినం నిర్వ హించని పార్టీకి రాజీనామా చేసి బయటకు రావాలని మాట్లాడిన కెసిఆర్ ఇప్పుడు ఎందుకు నిర్వహిం చడం లేదో ప్రజలకు చెప్పాలని నిలదీశారు. కాంగ్రెస్ తరహాలో విమోచనా దినం నిర్వహిస్తామని అంటున్న కెసిఆర్ తెలంగాణ చరిత్రను పాఠ్యపుస్తకాలలో ఎందుకు చేర్చరో వివరించాలన్నారు.తాము 2019లో అధికారంలోకి వచ్చాక అధికారికంగా నిర్వహించడం ఖాయమని స్పష్టం చేశారు.



జనగామ, వరంగల్‌కు రూ.40 కోట్లు



మన తెలంగాణ/హైదరాబాద్ : జనగామ, వరంగల్ (పట్టణ) జిల్లాల్లో సాంస్కృతిక, వారసత్వ పర్యాటక సర్క్యూట్ సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.40 కోట్లు విడుదల చేసింది. సంక్షేమం, అభివృద్ధి కార్య క్రమాల కొరకు ఉద్దేశించిన ప్రత్యేక అభివృద్ధి నిధి క్రింద వీటిని విడుదల చేస్తున్నట్లు ప్రణాళిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.పి.ఆచార్య మంగళవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జనగామ జిల్లాలోని పెంబర్తి, ఖిలాషాపూర్, జఫర్‌గఢ్, బమ్మెర, వల్మిడి, పాలకుర్తితో పటు వరంగల్ (అర్బన్)లో సర్క్యూట్‌ను అభివృద్ధి చేయనున్నారు. పెంబర్తిలో రూ.5 కోట్లు, జఫర్‌గఢ్‌లో రూ.6, బమ్మెరలో రూ.7.50, వల్మిడిలో రూ.5, పాలకుర్తిలో రూ.10 కోట్ల అంచనా వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఖిలాషాపూర్‌లో రూ.4.50 కోట్ల అంచనాతో అభివృద్ధి చేయనున్నారు. వరంగల్‌లో పోతన మెమోరియల్ అభివృద్ధి పనులతో పాటు పర్యాటక మౌలిక వసతులను కల్పించనున్నారు.

2017 – 18 విద్యా క్యాలెండర్ విడుదల

మనతెలంగాణ/హైదరాబాద్ : 2017 – 18 విద్యాసంవత్సరానికి విద్యా క్యాలెండర్ విడుదలైంది. ఏప్రిల్ 13 నుంచి మే 31 వరకు వేసవి సెలవులు ప్రకటిస్తూ విద్యాశాఖ స్పెషల్ సిఎస్ రంజీవ్ ఆర్ ఆచార్య ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాలలు జూన్ 1న పునః ప్రారంభించాలని పేర్కొన్నారు. జూలై 31న ఎఫ్ఎ 1, సెప్టెంబర్ 19న ఎఫ్ఎ 2 పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. అలాగే అక్టోబర్ 23 నుంచి 28 వరకు ఎస్ఎ1 పరీక్షలు, నవంబర్ 30న ఎఫ్ఎ 3, వచ్చే ఏడాది జనవరి 31న ఎస్ఎస్‌సి విద్యార్థులకు, 19 తరగతులకు ఫిబ్రవరి 28న ఎఫ్ఎ 4 పరీక్ష లు నిర్వహించాలని అన్నారు. ఏప్రిల్ 2 నుంచి 9 వరకు ఎస్ఎ 2 నిర్వ హించాలని, పదవ తరగతి విద్యార్థులకు ఫిబ్రవరి 28లోగా ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించాలని పేర్కొన్నారు. సెప్టెంబర్ 20 నుంచి అక్టోబర్ 4 వరకు 15 రోజులు దసరా సెలవులు, డిసెంబర్ 24 నుంచి 28 వరకు మిషనరీ స్కూళ్లకు 5 రోజులు క్రిస్మస్ సెలవులు, వచ్చే ఏడాది జనవరి 12 నుంచి 16 వరకు 5 రోజులు సంక్రాంతి సెలవులుగా నిర్ణయించారు

ముగిసిన వెబ్ ఆప్షన్ల ప్రక్రియ

- **31న సీట్ల కేటాయింపు**

మనతెలంగాణ/హైదరాబాద్ : డిగ్రీలో ప్రవేశాలకు నాలుగవ విడత వెబ్ ఆప్షన్ల ప్రక్రియ మంగళవారం ముగిసింది. డిగ్రీ కళాశాలల్లో మిగిలిన సీట్ల భర్తీకి దోస్త్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని సీట్లు లభించని విద్యార్థులకు చివరి అవకాశంగా ఈ నెల 26 నుంచి 29 వరకు వెబ్ ఆప్షన్ల నమోదుకు అవకాశం కల్పించారు. తుది విడతలో ఆప్షన్లు ఎంపిక చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 31న సీట్లు కేటాయించనున్నారు.

మరోసారి గడువు పొడిగింపు లేదు : పాపిరెడ్డి

డిగ్రీలో ప్రవేశాలకు మరోసారి గడువు పొడిగింపు లేదని రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ టి.పాపిరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం ఆయనను కొంతమంది విద్యార్థులు కలిసి దోస్త్‌లో కొత్త రిజిస్ట్రేషన్లకు, వెబ్ ఆప్షన్ల నమోదుకు మరో అవకాశం ఇవ్వాలని కోరారు. అందుకు పాపిరెడ్డి స్పందిస్తూ, జూలై 3వ తేదీ నుంచే డిగ్రీ తరగతులు ప్రారంభమైన నేపథ్యంలో మరో అవకాశం ఇవ్వలేమని స్పష్టం చేశారు. ప్రవేశాల ప్రక్రియ ఆలస్యమైనందున సెప్టెంబర్ 14–16 వరకు జరగాల్సిన ఇంటర్నల్ పరీక్షలను, అక్టోబర్ 5,6,7 తేదీలకు వాయిదా వేశామని అన్నారు. దోస్త్‌లో కొత్త రిజిస్ట్రేషన్లకుగానీ, స్లైడింగ్‌కుగానీ మరో అవకాశం కల్పించలేమని స్పష్టం చేశారు.


డిగ్రీ అడ్మిషన్లలో గందరగోళం : రాష్ట్రంలో డిగ్రీ విద్యార్థుల అడ్మిషన్ల ప్రక్రియ ప్రహసనంగా మారిందని రాష్ట్ర కాంగ్రెస్ అధి కార ప్రతినిధి కొనగాల మహేష్ ఆరోపించారు. ఉన్నత విద్యామండలి తప్పి దానికి విద్యార్థులను బలిపశువులను చేస్తే ఊరుకోమని హెచ్చరించారు.

విజయ డెయిరీ మెగా ప్లాంట్

మన తెలంగాణ/హైదరాబాద్ : తెలంగాణ విజయ డెయిరీలో పాల ప్లాంట్ కెపాసిటీని పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు ప్రస్తుతం ఉన్న 4.5 లక్షల లీటర్ల ప్యాకింగ్ ప్రాసెసింగ్ సామర్థ్యం ఉన్న మిషన్ స్థానంలో 8 లక్షల లీటర్ల నుంచి 10 లక్షల లీటర్లతో కూడా అత్యాధునిక మెగా డెయిరీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనుంది. దీనిని దశల వారీగా ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సురేష్ చందా మంగళవారం మన తెలంగాణకు తెలిపారు. ఇందుకు దాదాపు రూ. 180 కోట్లు వరకు ఖర్చు అవుతుందని అంచనా వేస్తున్నారు. నాబార్డు లేదా జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (ఎన్‌సిడిసి) నుంచి రుణం తీసుకోవాలనే యోచనలో ఉన్నారు. సాంకేతికతను అందిపుచ్చుకుని మరింత నాణ్యంగా పాలు పంపిణీ చేయాలని విజయ డెయిరీ భావిస్తోంది.

వాస్తవాలు తెలుసుకోండి

- **ఇక్ఫాకు దాసోజు లేఖ**



మన తెలంగాణ / హైదరాబాద్ : వ్యవసా యరంగంలో చేసిన కృషికి సిఎం కెసిఆర్‌కు అవార్డు ఇచ్చిన ఇండియన్ కౌన్సిల్ ఫర్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్(ఇక్ఫా) సంస్థ బృందాన్ని రాష్ట్రానికి వచ్చి వాస్తవాలు తెలు సుకోవాలని పిసిసి ముఖ్యఅధికార ప్రతినిధి దాసోజు శ్రావన్‌కుమార్ కోరారు. ఆ అవార్డుపై గతంలో చేసిన వ్యాఖ్య లపై శ్రావన్‌కు ఇక్ఫా సంస్థ లేఖ రాసింది. దానికి ఆయన మంగళవారం ఇక్ఫా సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎన్.ఎస్.రందావకు ప్రత్యుత్తరం ఇచ్చారు. ఇక్ఫా సంస్థపై తమకు ఎలాంటి వ్యతిరేకత లేదని, అయితే ఆ సంస్థ ఇచ్చిన అవార్డును కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన అవార్డుగా ప్రభుత్వం మోసపూరిత ప్రచారం చేసుకోవడంపైనే తాము అభ్యంతరం వ్యక్తం చేశా మన్నారు. సిఎం, గవర్నర్ కలిసి చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తాము వ్యతిరేకించామన్నారు. రాష్ట్రంలో పర్యటిస్తే వాస్తవాలు తెలుస్తాయన్నారు.

1500 కొత్త బస్సులు

- మెరుగైన ప్రజారవాణా వ్యవస్థకు కృషి
- ముంబయి తరహాలో మెట్రోతో ఆర్‌టిసి అనుసంధానం
- సమీక్షలో మంత్రి మహేందర్‌రెడ్డి



మన తెలంగాణ /హైదరాబాద్ : ఆర్‌టిసి బస్సు సేవలు లేని గ్రామాలు రాష్ట్రంలో ఉండకూడదనే లక్ష్యంతో పాటు మండల, జిల్లా, రాష్ట్ర రాజధానిని అనుసంధానం చేసే మెరుగైన ప్రజా రవాణా వ్యవస్థ ఏర్పాటుకు కృషి చేస్తున్నా మని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మహేందర్ రెడ్డి చెప్పారు. కాలం చెల్లిన 1100 పాత బస్సుల 'స్థానంలో, అవసరమైన మేరకు అదనపు సర్వీసుల కోసం మొత్తం 1500 కొత్త బస్సుల కొనుగోలు కోసం సిఎం కెసిఆర్‌కు నివేదించను న్నట్లు మంత్రి చెప్పారు. ముంబాయి తరహాలోనే ఆర్‌టిసిని మెట్రోరైల్‌తో అనుసంధానం చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తామని వెల్లడించారు. టిఎస్‌ఆర్‌టిసి పనితీరును మంత్రి మహేందర్ రెడ్డి సచివాలయంలో మంగళవారం సమీక్షించారు. సమావేశంలో రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్ర టరీ సునీల్ శర్మ, ఆర్‌టిసి ఛైర్మన్ సోమారపు సత్యనారా యణ, మేనేజింగ్ డైరెక్టర్ జి.వి.రమణారావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు డి.వేణు, ఎం.రవీందర్‌తో పాటు పలువురు ఉన్న తాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏపితో పాటు దేశంలోని ఇతర ప్రజా రవాణా వ్యవస్థలతో పోలిస్తే టిఎస్‌ఆర్‌టిసి స్థాయి మెరుగు గానే ఉందని అభిప్రాయం వ్యక్తంచేశారు. అయితే రాష్ట్రం లోని 96 డిపోల పరిధిలో ఏటా రూ.480 కోట్ల నష్టం వస్తు న్నదని, ఆర్‌టిసి సేవలను మరింత విస్తరిస్తూనే నష్టాలను తగ్గించి లాభాల్లో నడిపించేందుకు చర్యలు తీసుకోవాల న్నారు. జిహెచ్‌ఎంసి, ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు ఎప్పటికప్పుడు రాబట్టుకోవాలన్నారు. ఆర్‌టిసి బస్ స్టాండ్, డిపోలలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్న రూ.60 కోట్ల నిధుల సమీకరణకు ఎంపిలు, ఎంఎల్‌ఏల నిధులు రాబట్టు కోవాలన్నారు. సంస్థ నష్టాలను తగ్గించేందుకు శ్రమిస్తున్న కార్మికుల కృషి అభినందనీయమన్నారు. సమీక్ష అనం తరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ 'వజ్ర' సర్వీస్‌ల పనితీరు మెరుగుపడిందని, కరీంనగర్, రామగుండం ప్రాంతాలకు త్వరలో వజ్ర సేవలను విస్తరిస్తామని ప్రకటిం చారు. ఒకటి రెండు ఆస్తుల అంశాలు తప్పితే విభజన ప్రక్రియ దాదాపు పూర్తి కావచ్చిందని, ఏ రాష్ట్రంలోని ఆస్తులు ఆ రాష్ట్రానికి చెందుతాయని మంత్రి చెప్పారు.

త్వరలో కరీంనగర్, గోదావరిఖనికి 'వజ్ర' బస్సులు

మన తెలంగాణ / హైదరాబాద్ : 'వజ్ర' మినీ బస్సు సర్వీసులను కరీంనగర్, గోదావరిఖని ప్రాంతాలకు త్వర లో ప్రవేశపెట్టనున్నట్లు టిఎస్‌ఆర్‌టిసి మేనేజింగ్ డైరెక్టర్ జి.వి.రమణరావు ప్రకటించారు. హైదరాబాద్ లోని దిల్‌సుఖ్‌నగర్, కెపిహెచ్‌బి, మియాపూర్ నుంచి కరీంనగర్‌లోని మంకమ్మ తోట, జ్యోతినగర్, కోర్టు చౌర స్తాల మీదు గా ఒక రూట్లో, రాంనగర భగత్‌నగర్, గణే శ్‌నగర్‌ల మీదుగా రెండో రూట్‌లో బస్సులు నడుస్తా యని తెలిపారు. అదే విధంగా దిల్‌సుఖ్‌నగర్, మియా పూర్‌ల నుంచి గోదావరిఖనిలోని ఆర్‌సిఎఓ క్లబ్ చౌరస్తా, ఎన్‌టిపిసి టౌన్‌షిప్, బి.పవర్ హౌస్‌ల మీదుగా ఒక రూట్‌లో, మున్సిపల్ ఆఫీసు, చౌరస్తా, తిలక్‌నగర్, 8 ఇంక్లైన్ ద్వారా మరో రూట్‌లో వజ్ర బస్సులు నడుస్తా యనీ తెలిపారు. హైదరాబాద్ నుంచి కరీంనగర్‌కు రూ.310, గోదావరిఖనిలోని బి.పవర్‌హౌస్ ద్వారా వెళ్లే బస్సు చార్జీ రూ.425 లుగా, 8 ఇంక్లైన్ ద్వారా వెళ్లే బస్సుకు రూ.440 చార్జీని నిర్ణయించినట్లు ఎండి ఒక ప్రకటనలో వివరించారు.

వ్యయంతో కూడినది 'మిషన్ భగీరథ'

మన తెలంగాణ/హైదరాబాద్: ప్రజా ఆరోగ్యం నిమిత్తం ఎన్ని కోట్ల రూపాయలను ఖర్చు చేసినా తక్కువేనని మధ్యప్రదేశ్ తాగునీటి శాఖ చీఫ్ జన రల్ మేనేజర్ అశీష్‌కుమార్ శ్రీవాత్సవ అన్నారు. మిషన్ భగీరథ వ్యయంతో కూడుకున్న ప్రాజెక్ట్ కాదని, ప్రజలకు అవసరమైన ప్రాజెక్ట్ అని కొని యాడారు. మూడు రోజుల పర్యటన నిమిత్తం హైదరాబాద్‌కు వచ్చిన మధ్యప్రదేశ్ తాగునీటి అధికారుల బృందం హైదరాబాద్, ఎర్రమంజిల్ లోని ఆర్‌డబ్ల్యుఎస్ అండ్ ఎస్ కార్యాలయంలో మిషన్ భగీరథ అధికార బృందాన్ని కలిసింది. ఈ సందర్భంగా ఇఎన్‌సి సురేందర్ రెడ్డి మిషన్ భగీ రథ పనులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వా రా బృందానికి వివరించారు. ఈ సందర్భంగా అశీష్‌కుమార్ శ్రీవాత్సవ మాట్లాడుతూ మిషన్ భగీరథ కార్యక్రమాన్ని దేశం మొత్తం ఆసక్తిగా గమనిస్తుందన్నారు. త్వరలోనే తమ రాష్ట్రంలో కూడా భగీరథ ప్రాజెక్ట్‌ను ప్రారంభించాలనే యోచనలో తమ ప్రభుత్వం ఉన్నట్లు తెలిపారు. చీఫ్ ఇంజనీర్లు విజయపాల్ రెడ్డి, విజయప్రకాష్, ఒఎస్‌డి సత్యపాల్‌రెడ్డి, కన్సల్టెంట్లు నర్సింగ రావు, బాబురావు, పాల్గొన్నారు.



బిఆర్‌ఎఒయు యుజి, పిజి ప్రవేశాల గడువు పొడగింపు

మనతెలంగాణ/హైదరాబాద్ : డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం యుజి, పిజి కోర్సుల్లో ప్రవేశాల గడువును పొడిగించింది. ఎలాంటి అపరాధ రుసుం లేకుండా బి.ఎ,బి. కాం,బి.ఎస్సీ కోర్సుల్లో సెప్టెంబర్ 7 వరకు ప్రవేశాలు పొందవచ్చని, రూ.200 అపరాధ రుసుం తో అక్టోబర్ 5 వరకు ప్రవేశాల పొంద వచ్చని వర్సిటీ వర్గాలు ఒక ప్రకటన తెలిపాయి. అలాగే పిజి కోర్సులు(ఎం.ఎ, ఎం.కాం, ఎం. ఎస్‌సి, ఎంబిఎ, ఎంఎల్‌ఐఎస్‌సి, బిఎల్‌ఐఎస్‌సి, సర్టిఫికెట్ ప్రోగ్రాంలలో ఎలాంటి అపరాధ రుసుం లేకుండా సెప్టెంబర్ 7 వరకు, రూ.200 అప రాధ రుసుంతో అక్టోబర్ 5 వరకు ప్రవేశాలు పొందవచ్చని పేర్కొన్నారు. ఇతర వివరాలకు www.braouonline.in చూడాలని తెలిపారు.

త్వరితగతిన భూసేకరణ పూర్తి!

మన తెలంగాణ/హైదరాబాద్: కలెక్టరేట్లు, శాసనసభ్యుల వసతులు, జిల్లా అతిథి గృహాల నిర్మాణ పనుల వేగాన్ని పెంచాలని ఆర్‌అండ్‌బి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అధి కారులను ఆదేశించారు. భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నిర్మా ణాలు, భూసేకరణ పనులలో జరుగుతున్న జాప్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హైద రాబాద్‌లోని ఆర్ అండ్ బి ఇంజనీర్ ఇన్ చీఫ్ కార్యాలయంలో మంగళవారం మంత్రి తు మ్మల నాగేశ్వర్‌రావు సమీక్ష నిర్వహించారు. నూతన కలెక్టరేట్ల నిర్మాణం, అతిథి గృహాలు, శాసనసభ్యుల వసతి, ఇతర భవనాల నిర్మాణాలు, వాటికి సంబంధించిన భూసేకరణ పనులు, పనుల అంచనాలు తదితర అంశాలపై తుమ్మల నాగేశ్వర్‌రావు చర్చించారు. 104 శాసనసభ్యుల వసతి గృహాలలో కేవలం నాలుగు మాత్రమే పూర్తికాగా, 88 పురోగతిలో ఉన్నాయని అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. కొమురం భీం ఆసిఫాబాద్, పెద్ద పల్లి, జగిత్యాల, వరంగల్ (పట్టణం), సిద్దిపేట, జనగాం, వికారాబాద్, మేడ్చల్, వనపర్తి, జోగులాంబ గద్వాల, నిజామాబాద్, కామారెడ్డి, నాగర్‌కర్నూల్, భువనగిరి యాదాద్రి జిల్లాలో భూసేకరణ ముగిసి నిర్మాణాలకు సిద్దంగా ఉన్నాయని, అలాగే మంచిర్యాల, నిర్మల్, మహబూబ్‌నగర్, ఖమ్మం, సూర్యాపేటలో భూసేకరణ పూర్తైనప్పటికీ ఈ ప్రాం తాలు నిర్మాణాలకు అనువుగా లేవని అధికారులు వివరించారు. కాగా 16 జిల్లాలలో రూ. 36.20 కోట్లతో అతిథి గృహాల నిర్మాణాలకు ప్రభుత్వం అనుమతినిచ్చినా నిర్మాణ పనులు ఇంకా మొదలు కాకపోవడంపై తుమ్మల నాగేశ్వర్‌రావు అధికారుల సంజాయిషీ కోరారు. జాతీయ రహదారుల అభివృద్ధి పనులపై ప్రాజెక్ట్ రిపోర్టులు తయారీలో ఆలస్యంపై అస హనం వ్యక్తం చేశారు.

జాతీయ రహదారుల ప్రతిపాదనలకు ఆమోదం

జాతీయ రహదారుల అభివృద్ధి(ఎన్‌హెచ్‌డిపి) పథకం ద్వారా రూ.2,398 కోట్ల ప్రతి పాద నలకు, ఆరంఘర్ నుంచి శంషాబాద్ వరకు 6 వరుసల అభివృద్ధి నిమిత్తం రూ.290 కోట్ల ప్రతిపాదనలకు ఆమోదం లభించిందని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వివరిం చారు. హైదరాబాద్ , నర్సాపూర్, మెదక్ 765 డి జాతీయ రహదారిని 2/4 వరుసల అభి వృద్ధికి రూ.400 కోట్ల ప్రతిపాదనలకు ఆమోదం లభించినట్లు తెలిపారు. ఆర్‌అండ్‌బి ముఖ్యకా ర్యదర్శి సునీల్‌శర్మ, ఇఎన్‌సి గణపతిరెడ్డితో పాటు ఇతరులు పాల్గొన్నారు.

స్పష్టమైన విధానమేదీ?



మన తెలంగాణ/హైదరాబాద్ : రైతు సమన్వయ సమితుల పని తీరుపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని తెలం గాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ అన్నారు. నామి నేటెడ్ పద్ధతిలో సమితులకు బదులుగా గ్రామ సహకార రైతు సంఘా లను రిజిస్టర్ చేసి, వాటికి ప్రజాస్వామికంగా ఎన్నికలు నిర్వ హించా లని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని అమృతా ఎస్టేట్స్ లోని రైతు సంఘం కార్యాలయంలో అధ్యక్షులు టి. విశ్వేశ్వరరావు, ఉపాధ్యక్షులు ఎం. ప్రభాకర్ రెడ్డిలతో కలసి ఆమె మంగళవారం మీడియాతో మాట్లా డారు. రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు అఖిల భారత కిసాన్ సభ(ఎఐకెఎస్) పిలుపు మేరకు 'డిమాండ్స్ డే' కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా సెప్టెంబర్ 1వ తేదీన రైతు సంఘం జెండాలను గ్రామాల్లో ఎగురవేసి సమావేశాలు ఉంటాయని తెలిపారు. సెప్టెంబర్ 2వ తేదీ నుంచి 6వ తేదీ వరకు సద స్సులు, సభల నిర్వహణ, 7వ తేదీన ఎమ్‌ఆర్‌ఒ, ఆర్‌డిఒ, కలెక్టర్ కార్యాలయాల ముందు పికెటింగ్ నిర్వహించ నున్నట్లు చెప్పారు. ఎన్ డిఎ ప్రభుత్వం ఎన్నికల ప్రణాళికలో డాక్టర్ స్వామినాథన్ సిఫార్సులు అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిందని, అయితే ఇప్పటికీ ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదన్నారు. స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం మద్దతు ధర కల్పించేందుకు పార్లమెంట్‌లో చట్టం చేయాల న్నారు. మార్చి 31, 2016 వరకు దేశవ్యాప్తంగా వివిధ జాతీయ బ్యాంకులలో, ప్రైవేట్ బ్యాంకులు, వడ్డీ వ్యాపారస్తుల వద్ద ఉన్న రైతుల రుణాలను రద్దు చేయాలని విశ్వేశ్వరరావు డిమాండ్ చేశారు.

విదేశీ మద్యం పట్టివేత




మన తెలంగాణ/హైదరాబాద్ : మధ్యప్రదేశ్ నుంచి తెలంగాణకు విదేశీ మద్యం తీసుకువచ్చి విక్రయిస్తున్న వరంగల్‌కు చెందిన ముఠాను రాష్ట్ర ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆబ్కారీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎక్సైజ్ శాఖ ఎన్‌ఫోర్స్ మెంట్ విభాగం జాయింట్ కమిషనర్ అజయ్‌రావు, అసిస్టెంట్ కమిషనర్ హరికృష్ణలు ఈ వివరాలను వెల్లడించారు. నాంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో ఇద్దరు వ్యక్తులు విదేశీ మద్యంతో వెళ్తున్నారని సమాచారం అందింది. దీంతో సిబ్బంది వారిని పట్టుకుని సోదా చేయగా లక్షా 40 వేల రూపాయల విలువ చేసే 33 విదేశీ మద్యం సీసాలు పట్టుబడ్డాయి. పట్టుబడ్డ ఇద్దరూ వరంగల్‌కు చెందిన ఉదయాంజల్‌రెడ్డి, రమేష్‌లని తేలింది. వీరిలో ఉదయాంజల్‌రెడ్డి మే మాసంలో ఖాజీపేటలో తన తండ్రి ఆనంద్‌రెడ్డి, తల్లితో కలిసి విదేశీ మద్యం తీసుకు వెళ్తుండగా రైల్వే పోలీసులు పట్టుకుని వరంగల్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారని గుర్తించారు. నిందితులి ద్దరూ మధ్యప్రదేశ్‌లోని బేతలార్ జిల్లాలో మద్యం సీసాలను కొనుగోలు చేసి తీసుకువచ్చారని తేలింది. తెలంగాణలో కంటే మధ్యప్రదేశ్‌లో మద్యం సీసాల ధర తక్కువగా ఉండటంతో ఈ తరహా వ్యాపారం చేస్తున్నారని తేలిందన్నారు. పట్టుబడ్డ మద్యం విలువ లక్షా 3 వేల రూపాయలని, వీటిని విక్రయించడం ద్వారా నిందితులకు లక్షా 40 వేలు సమకూరుతాయని పేర్కొన్నారు. ఈ మేరకు కేసును నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

సందిగ్ధంలో నూతన ఎక్సైజ్ పాలసీ

మన తెలంగాణ/హైదరాబాద్ : ఎక్సైజ్ సంవత్సరం ముగింపు దశకు చేరు కుంటున్నప్పటికీ కొత్త పాలసీపై స్పష్టత లేకపోవడంతో మద్యం వ్యాపారులు, ఎక్సైజ్ అధికారులు అయోమయానికి గురవుతున్నారు. అక్టోబర్ 1 వ తేదీ నుంచి కొత్త పాలసీని అమలు చేయాల్సి ఉన్నప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టత ప్రభుత్వం నుంచి రాకపోవడంతో ఏం చేయాలో పోలుపోని స్థితిలో అధికారులున్నారు. కొత్త పాలసీ విధి విధానాలను ఖరారు చేసిన అధికారులు కొన్ని ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించారు. రెండేళ్ళకు వైన్ దుకాణాల లైసెన్సులు ఇస్తే బాగుంటుందని ప్రతిపాదించారు. పాలసీ రూపకల్పనకు ప్రధాన అడ్డంకి సుప్రీంకోర్టు తీర్పు కావడంతో ప్రభుత్వం కూడా కొంత ఆలో చన చేస్తున్నట్లు సమాచారం. జాతీయ, రాష్ట్ర రహదారులకు 500 మీటర్ల పరి ధిలో వైన్, బార్, కల్లు దుకాణాలు ఉండరాదని ఆదేశించింది. దీంతో హైదరా బాద్‌తో సహా పలు ప్రధాన పట్టణాలలో మద్యం దుకాణాల ఏర్పాటులో ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఏర్పడింది. రాష్ట్రంలో ప్రస్తుతం జాతీయ రహదా రుల వెంట 628 వైన్ షాపులు, 255 బార్‌లున్నాయి. అదే విధంగా రాష్ట్ర రహ దారుల వెంట 561 వైన్ షాపులు, 155 బార్‌లున్నాయి. సుప్రీం ఆదేశాలతో ఇవన్నీ మూత పడే ప్రమాదం ఉంది. వీటిని 500 మీటర్ల అవలకు తరలిస్తే 479 వైన్ షాపులు, 105 బార్లపై ప్రభావం చూపనుంది. ఫలితంగా ఖజానాకు భారీగా నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో సుప్రీం ఆదేశాలను పాటించాలంటే జాతీయ, రాష్ట్ర రహదారులను డీ నోటిఫై చేస్తే సరిపోతుం దన్న ప్రతిపాదనను ఎక్సైజ్ శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదించింది. ఇలా చేయడం వల్ల జాతీయ రహదారులకు కేంద్రం నుంచి వచ్చే నిధులు నిలిచిపో తాయన్న ఉద్దేశ్యంతో ఆర్ అండ్ బి అధికారులు ఎక్సైజ్ శాఖ ప్రతిపాదనను పక్కకు పెట్టారు. నూతన ఎక్సైజ్ పాలసీకి ఇదీ ఒక ప్రధాన అడ్డంకిగా మారింది. వాస్తవానికి ఎక్సైజ్ శాఖకు ప్రధానంగా జాతీయ, రాష్ట్ర రహదారు లపై ఉన్న బార్‌లు, వైన్‌షాపుల ద్వారానే కీలకమైన ఆదాయం సమకూరు తుంది. అయితే ఎక్సైజ్ ఆదాయాన్ని చూసుకుని రహదారులను డీనోటిఫై చేయడం వల్ల వచ్చే నష్టమే ఎక్కువని రహదారుల శాఖ ప్రభుత్వానికి తెలి పింది. ఈ విషయంలో స్పష్టత కొరవడటంతో పాలసీ రూపకల్పనలో జాప్యం ఏర్పడుతుందని తెలిసింది. ఈసారి వైన్‌షాపుల దరఖాస్తుల రుసుమును పెంచ కూడదని, దరఖాస్తులను ఆన్‌లైన్‌లోనే స్వీకరించి లాటరీ ద్వారా దుకాణాలను ఎంపిక చేసే విధానాన్ని అమలు చేయాలని అధికారులు ప్రభుత్వానికి పంపిం చిన ప్రతిపాదనలలో పేర్కొన్నారు. వాస్తవానికి లైసెన్సును మూడేళ్ళకు పెంచా లని తొలుత భావించినప్పటికీ 2019లో ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఈ ప్రతిపాదనను రెండేళ్ళకు పరిమితం చేశారు. జాతీయ, రాష్ట్ర రహదారుల డీనోటిఫైతో పాటు కాల పరిమితి తదితర విషయాలలో ప్రభుత్వమే తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

అన్ని రంగాల వారికి ప్రాతినిధ్యం

- కేంద్ర సమాచార కమిషనర్ మాడభూషి శ్రీధరాచార్యులు



మన తెలంగాణ/హైదరాబాద్ : తెలుగు రాష్ట్రాల్లో ఏర్పాటు చేయబోయే రాష్ట్ర సమాచార కమిషన్లలో నిర్దేశించిన అన్ని రంగాల నుండి కమిషనర్లను నియమించాలని కేంద్ర సమా చార కమిషనర్ మాడభూషి శ్రీధరాచార్యులు సూచిం చారు. పది రంగాల నుండి ప్రాతినిధ్యం ఉన్న కమిషన్ మెరుగ్గా ఉంటుందని ఆయన అన్నారు. సమాచార హక్కు చట్టం ప్రతినిధుల ఆధ్వర్యంలో సమాచార కమిషనర్ల నియామకం, పది మంది వరకు నియమించడం, నియామ కాల్లో పారదర్శకత పాటించడం అనే అంశంపై సోమాజీ గూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర సమాచార కమిషనర్లు పదవీ విరమణ పొందిన తర్వాత నూతన కమిషనర్ల నియామకాలకు మధ్య సమయం తీసు కోకుండా నిరంతరం కమిషనర్ ఉండేలా చూడాలన్నారు. రాష్ట్రపతి, గవర్నర్లు, ప్రధాన న్యాయమూర్తులు సమాచార హక్కు చట్టానికి సహకరిస్తే దేశం బాగు పడు తుందన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో పబ్లిక్ రికార్డ్ యాక్ట్ కోసం డిమాండ్ చేయాలని ఆయన ఆర్టీఐ కార్య కర్తలకు సూచిం చారు.రాజస్థాన్‌లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అత్యంత పార దర్శకంగా అమలౌతుంద న్నారు. కొంత మందిని వేధించ డానికి, పగ తీర్చుకోవ డానికి ఆర్టీఐ చట్టాన్ని వాడు కోవడాన్ని ఉద్యమకారులు అడ్డుకోవాలని, లేని పక్షంలో ఆ సాకుతో ఆర్టీఐ చట్టాన్ని వెనక్కి తీసుకునే ప్రమాద ముందన్నారు. న్యాయ, శాసన వ్యవస్థలు ఆర్టీఐ చట్టాన్ని కాపాడలేదని భావించిన చోట ప్రజలు దానిని కాపాడు కోవాలని అన్నారు. కమిషన్ న్యాయ సలహా దారు శ్రీనివాస్ మాధవ్, ఆర్టీఐ ఉద్యమ కారులు ఉప్పల గోపాల రావు, వి.వి.రావు, రామకృష్ణరాజు పాల్గొన్నారు.

ఆర్టీఐ వాడుకుంటే సంవత్సరం ముందే తెలంగాణ : సమాచార హక్కు చట్టాన్ని వాడుకుని ఉంటే ప్రత్యేక తెలం గాణ రాష్ట్రం ప్రస్తుతం వచ్చిన సమయం కంటే ఏడాది ముందే వచ్చేదని మాడభూషి శ్రీధరాచార్యులు అభిప్రాయ పడ్డారు. ఆర్టీఐ సీనియర్ ఉద్యమకారులు వి.వి. రావు మాట్లాడుతూ, 2010 వరకు ఉవ్వెత్తున సాగిన ఆర్టీఐ ఉద్యమం తెలంగాణ ఉద్యమం క్రమంలో వెనుకబడి పోయిందన్నారు.

తీర్మానాలు : తెలుగు రాష్ట్రాలు సమాచార హక్కు కమిష న్లను ఏర్పాటు చేయాలని, కమిషన్లలో నిర్దేశించిన పది రంగాల నుండి ప్రతినిధులను సకాలంలో నియమించా లని, నియామకంలో అర్హులైన వారిని నియమిస్తూ పారద ర్శకత పాటించాలని తీర్మానించారు.

చీరల పంపిణీపై విస్తృత అవగాహన

మన తెలంగాణ/హైదరాబాద్: బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమంపై తెల్లరేషన్‌కార్డు దారుల్లో విస్తృత అవగాహన కల్పించాలని స్థానిక పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా)ను మున్సిపల్ శాఖ ఆదేశించింది. ఈ కార్యక్రమానికి నోడల్ అధికారులుగా వ్యవహరించే స్థానిక మున్సిపల్ కమిషనర్లు చీరల పంపిణీపై నిరంతరం పర్యవే క్షించడంతో పాటు స్థానిక కమిటీలతో సమావేశా లను నిర్వహించాలని సూచించింది. చీరలను నిల్వ పెట్టిన గోడౌన్ల ప్రాంతాలను, పంపిణీ చేయా ల్సిన ప్రదేశాలను గుర్తించి తమకు నివేదికను అందజేయాలని మెప్మా ఆదేశించింది. స్థానిక రేష న్‌షాపు డీలర్‌తో మున్సిపల్ బిల్ కలెక్టర్లు సమన్వ యంగా వ్యవహరించి చీరల గోడౌన్లను పరిశీలిం చనున్నారు. క్షేత్ర స్థాయిలో అవగాహన సదస్సు లను ఏర్పాటు చేయాలని, దీనికి స్థానిక స్వయం సహాయక బృందాలు, స్లమ్ లేవల్ ఫెడరేషన్ (ఎ స్ఎల్ఎఫ్) బృందాల సహకారం తీసుకోవాలని మెప్మా ఆదేశించింది. సెప్టెంబర్ 18, 19న చేపట్ట నున్న చీరల పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేయాలని, ఒక వేళ లబ్ధిదారుల సంఖ్య ఎక్కువగా ఉంటే, ఇతర ప్రదేశాలను ఎంపిక చేసుకోవాలన్నారు.

సీతారామ ప్రాజెక్ట్ పనులపై మంత్రుల సమీక్ష




మన తెలంగాణ/హైదరాబాద్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని సీతారామ ప్రాజెక్ట్ పనుల వేగాన్ని పెంచాలని నీటిపారుదల శాఖ మంత్రి టి.హరీశ్‌రావు ఆదేశించారు. ఈ ప్రాజెక్ట్‌కు చెందిన భూసేకరణ, అటవీ పర్యావరణ అనుమతులు, పంప్‌హౌజ్, కెనాల్స్ ఇతర పనుల పురోగతిపై హైదరాబాద్‌లో మంగళవారం ఆర్‌అండ్‌బి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి హరీశ్‌రావు సమీక్షించారు. సీతారామ ప్రాజెక్ట్ పనులు మందకొడిగా సాగడంపై మంత్రులు అసంతృప్తి వ్యక్తం చేశారు. మరో 15 రోజుల్లో ప్రాజెక్ట్ పురోగతిపై సమీక్ష నిర్వహిస్తామని హరీశ్‌రావు, తుమ్మలనాగేశ్వర్‌రావు తెలిపారు. మొత్తం 8 ప్యాకేజీలలో ప్రస్తుతం 3 ప్యాకేజీ పనులను ప్రారంభిం చారు. మిగిలిన 5 పంప్ హౌజ్‌లో ఒక పంప్‌హౌజ్ పనులే గ్రౌండ్ కాగా మరో పంప్‌హౌజ్ ప్రారంభం కానుంది. మిగిలిన 3 పంప్‌హౌజ్ పనులను కూడా వెంటనే చేపట్టాలని, దీనిని ఎప్పటిలోగా పూర్తి చేస్తారో తేదీల వారిగా ప్ర ణాళికలను రూపొందించి తమకు 15 రోజుల్లో అందజేయాలని మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. అటవీ పర్యావ రణ అనుమతులను వెంటనే సాధించాలన్నారు. ప్రాజెక్ట్ కోసం అవసరమైన అటవీ భూములను సేకరిం చినప్పుడు, వాటికి ప్రత్యామ్నాయంగా భూములను సేకరించి అటవీ శాఖకు స్వాధీనం చేయాలని తుమ్మల నాగేశ్వర్‌రావు, హరీశ్‌రావు ఆదేశించారు.

సమస్యలు తీర్చడంలో ప్రభుత్వం విఫలం

మన తెలంగాణ/హైదరాబాద్: తెలంగాణ ప్రజలు ఏ హక్కుల కోసం పోరాటం చేశారో, వాటిని సమకూర్చడంలో కెసిఆర్ ప్రభుత్వం విఫలమైందని కాంగ్రెస్ ఎంఎల్‌సి పొంగులేటిసుధాకర్ రెడ్డి ఆరోపించారు. పోలవరం రీడిజైన్ చేయాలని చెప్పిన కెసిఆర్, ఇప్పుడు ఆ అంశాన్ని ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. అసెంబ్లీ మీడియాహాల్‌లో మంగళవారం ఆయన మాట్లాడారు. కృష్ణ,గోదావరి రివర్ అథారిటీలు చంద్రబాబు అథారిటీలుగా మారిపోయాయని, గోదావరి జలాలలో తెలంగాణ వాటాలను ఇంకా తేల్చడం లేదని ఆరోపించారు. కృష్ణాబోర్డులో పనిచేస్తున్న శ్రీవాస్తవ గోదావరి బోర్డుకు ఎలా పనిచేస్తారన్నారు. ఎపి సిఎం చంద్రబాబును కెసిఆర్ రహస్యంగా ఎందుకు కలిశారని ఆయన ప్రశ్నించారు. సిఎం కెసిఆర్ రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టి చంద్రబాబుతో మ్యాచ్‌ఫిక్సింగ్ చేసుకున్నారా అని ప్రశ్నించారు.

కెసిఆర్.. 'అర్జున్‌రెడ్డి'ని వీక్షించు



మన తెలంగాణ/ హైదరాబాద్ : యువతను తప్పుదోవ పట్టించే 'అర్జున్‌రెడ్డి' సినిమాను సిఎం కెసిఆర్ స్వయంగా వీక్షించి, దానిపై చర్య తీసుకోవాలని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు డిమాండ్ చేశారు. గాంధీ భవన్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అర్జున్ రెడ్డి సినిమాలో హీరో మద్యం, డ్రగ్స్ సేవించి 300 మంది రోగులకు శస్త్రచికిత్స చేస్తాడని, అలాగే అమ్మాయి పట్ల కూడా అసభ్యంగా ప్రవర్తిస్తారని అన్నారు. ఇటీవలనే డ్రగ్స్ వ్యవహారంలో నెల రోజుల పాటు సినీ పరిశ్రమకు చెందిన వ్యక్తులను పోలీసులు విచారించారని, ఆ వెంటనే వాటిని ప్రోత్సహించేలా ఈ సినిమా రావడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. తన బంధువు ఈ సినిమాలో హీరో అయినందునే సినిమా బాగుందని మంత్రి కెటిఆర్ చెబుతున్నారని, అందులో యువత ఏమి నేర్చుకోవాలో చెప్పాలని ప్రశ్నించారు. ఈ చిత్రాన్ని నిషేధించాలని సెన్సార్ బోర్డుకు లేఖ రాశానని, అలాగే ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్, పోలీస్ కమిషనర్‌కు కూడా లేఖ పంపినట్లు వి.హెచ్. తెలిపారు.

ప్రాథమిక కీపై అభ్యంతరాల స్వీకరణ

మన తెలంగాణ/హైదరాబాద్: పిజిటి, టిజిటి మెయిన్ పరీక్షల ప్రాథమిక కీపై అభ్యంతరాల స్వీకరణ గడువును ఈ నెల 31 వరకు పొడిగిస్తున్నట్లు టిఎస్‌పిఎస్‌సి కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు వారి అభ్యంతరాలకు కేవలం ఇంగ్లీష్‌లోనే సమర్పించాలని పేర్కొన్నారు.

సైనికుల నియామకం

మన తెలంగాణ/హైదరాబాద్ : టెరిటోరియల్ ఆర్మీ ఆధ్వర్యంలో మౌలాలిలోని కొకొకోలా ఫ్యాక్టరీ ఎదురుగా గల 1105 ఇంజనీర్స్ రెజిమెంట్ (టిఎ) ప్రధాన మైదానంలో సెప్టెంబర్ 21 నుండి 28వ తేదీ వరకు సోల్జర్స్ (జిడి), సోల్జర్స్ (హౌజ్‌కీపింగ్) నియామకాలను చేపట్టనున్నారు. జనరల్ డ్యూటీ అభ్యర్థులు పదవ తరగతిలో 45 శాతం మార్కులు, ఇంటర్మీడియట్, ఆపైన విద్యార్హతల్లో ప్రతి సబ్జెక్టులో కనీసం 33 శాతం మార్కులు పొంది ఉత్తీర్ణత సాధించి ఉండాలి. సోల్జర్ ట్రేడ్స్ మెన్ అభ్యర్థులు పదవ తరగతి ఉత్తీర్ణులై 18 సంవత్సరాల నుండి 42 సంవత్సరాల లోపు వారై ఉండాలి. ఎత్తు 160 సెంటిమీటర్లు. ఛాతి కొలత 77 నుంచి 82D సెంటిమీటర్లు ఉండాలి. కనీస బరువు 50 కిలోలుండాలి. 21న రాజస్థాన్, మహారాష్ట్ర, 22న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అభ్యర్థులకు ఫిజికల్ టెస్ట్ నిర్వహిస్తారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికేట్లు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోతో నిర్దేశించిన తేదీన ఉదయం 6 గంటల నుండి రావచ్చని ఒక ప్రకటనలో తెలిపారు.

శిక్షణ లేని టీచర్లకు ఎన్‌ఐఒఎస్ ద్వారా డి.ఇఎల్.ఇడి కోర్సు

మన తెలంగాణ/హైదరాబాద్ : శిక్షణ లేకుండా పనిచేస్తున్న ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ ఉపాధ్యాయులకు జాతీయ ఓపెన్ స్కూలింగ్(ఎన్‌ఐఒఎస్) సంస్థ, సార్వత్రిక దూర విద్యా విధానంలో డిప్లొమా పొందే అవకాశం కల్పించింది. రెండు సంవత్సరాల కాల వ్యవధి గల ఈ కోర్సులో ప్రవేశానికి 12వ తరగతిలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన ఉండాలని, అలా లేని టీచర్లు కూడా ఆన్ డిమాండ్ ఎగ్జిమినేషన్(ఒడిఇ) ద్వారా తమ 12వ తరగతి మార్కులు పెంపొందిచుకునేందుకు అదే సమయంలో దరఖాస్తు చేసుకోవచ్చని ఎన్‌ఐఒఎస్ ప్రాంతీయ సంచాలకులు అనిల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులో ప్రవేశానికి సెప్టెంబర్ 17 చివరి తేదీ అని పేర్కొన్నారు. శిక్షణ పొందని ఉపాధ్యాయులను మార్చి 31, 2019 తర్వాత అనుమతించరని, ఈ అవకాశాన్ని వినియోగించుకుని డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డి.ఇఎల్.ఇడి) కోర్సును విజయవంతంగా పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు సుల్తాన్ బజార్‌లోని శ్రీకృష్ణ దేవరాయ తెలుగు భాషా నిలయంలోని 4వ అంతస్తులో ఉన్న ఎన్‌ఐఒఎస్ ప్రాంతీయ కార్యాలయంలో లేదా 04024752859, 24750712 ఫోన్ నెంబర్లలో, www.nios.ac.in లో సంప్రదించాలని అన్నారు.

అంగన్‌వాడీలకు రూ.3 వేల పెన్షన్

మన తెలంగాణ/హైదరాబాద్ : రిటైర్డ్ అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు నెలకు రూ.3 వేలు పెన్షన్ ఇవ్వాలని తెలంగాణ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. వన్ టైం సెటిల్‌మెంట్ క్రింద టీచర్‌కు రూ.60 వేలు, ఆయాకు రూ.30 వేలు చెల్లిస్తామని ప్రకటనతో స్త్రీ, శిశు శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు డొల్లతనం బయట పడిందని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్.సీతామహాలక్ష్మి, నందూరి కరుణకుమారి ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. ప్రస్తుతం అమల్లో ఉన్న గ్రాట్యుటీ చట్టం ప్రకారం సర్వీసును బట్టి సంవత్సరానికి 15 రోజుల వేతనం లెక్కన చూసినా 30 సంవత్సరాల సర్వీసుకు 15 నెలల వేతనం లెక్కన టీచర్‌కు రూ.1.50 లక్షలు, కనీస వేతనం రూ.18 వేల లెక్కన గణిస్తే రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. మంత్రి వీటిని పరిగణలోకి తీసుకోలేదని వారు విమర్శించారు. దాదాపు 40 సంవత్సరాలు అతి తక్కువ వేతనంతో సమాజాభివృద్ధికి చాకిరి చేసిన అంగన్‌వాడి ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే గౌరవం ఇదేనా అని వారు ప్రశ్నించారు.

ఉచిత చేప పిల్లల పంపిణీ



మన తెలంగాణ/హైదరాబాద్ : ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని సంగారెడ్డి జిల్లాలోని సింగూరు ప్రాజెక్టులో పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రారంభించనున్నారు. ఈ ఏడాది 77 జలాశయాలు, 4647 మత్స్యశాఖ చెరువులు, 20,391 గ్రామ పంచాయితీ చెరువులలో 70 కోట్ల చేప పిల్లలను ఉచితం పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే చేప పిల్లల పంపిణీ కార్యక్రమంలో మంత్రులు, ఎంపిలు, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు, జడ్‌పి చైర్మన్‌లు పాల్గొనాలని కోరుతూ మంత్రి తలసాని మంగళవారం లేఖలను పంపారు.

ఉమ్మడి హైకోర్టు జడ్జీల నియామకంలో

అభిప్రాయభేదాలు

- ఒకే అభిప్రాయం వ్యక్తం చేసిన ఎపి సిఎం చంద్రబాబు, జస్టిస్ రమణ
- ఎత్తిచూపిన జస్టిస్ చలమేశ్వర్, వారి బంధం తెలిసిందేనని సుప్రీం చీఫ్ జస్టిస్‌కు లేఖ
- 'ఎకనామిక్ టైమ్స్' కథనం





న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తుల నియామకం విషయంలో సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు వ్యవహరించిన తీరుపై ఆంగ్ల పత్రిక 'ఎకనామిక్ టైమ్స్' మంగళవారం ప్రచురించిన వార్త జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారింది. హైకోర్టు న్యాయమూర్తులుగా కొలీజియం ప్రతిపాదించిన ఆరుగురిలో ఐదుగురి పట్ల వారిరువురు ఒకే రకమైన అభ్యంతరాలు వ్యక్తం చేయడంపై సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తికి మరో సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ లేఖ రాశారు.జస్టిస్ రమణ, చంద్రబాబుల మధ్య సాన్నిహిత్యం అందరికీ తెలిసిందేనని, ఇది కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థల మధ్య అభిలషణీయం కాని సాన్నిహిత్యం అని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు గత ఏడాది నాటి ఛీఫ్ జస్టిస్ ఖేహర్‌కు రాసిన లేఖలోని కొన్ని అంశాలను ఎకనామిక్ టైమ్స్ పత్రిక బైటపెట్టింది. సుప్రీం కోర్టు, హైకోర్టులకు న్యాయమూర్తులను ఎంపిక చేసే ముగ్గురు సభ్యుల కొలీజియంలో జస్టిస్ చలమేశ్వర్ సభ్యులుగా ఉన్నారు. సుప్రీం కోర్టులో ప్రధాన న్యాయమూర్తి తరువాతి స్థానం ఆయనదే. అలాంటి కీలక స్థానంలో ఉన్న న్యాయమూర్తి పేర్కొన్న అంశాలు రాజకీయ, న్యాయ వ్యవస్థలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఆ వార్తలో వివరాలు ఇలా ఉన్నాయి. గత ఏడాది హైదరాబాద్‌లోని ఉమ్మడి హైకోర్టులో న్యాయమూర్తులుగా నియామకం కోసం నాటి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిజ్ దిలిప్ భోసలే ఆరుగురు న్యాయవాదుల పేర్లను ప్రతిపాదించారు. వాటిపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రుల అభిప్రాయాన్ని కోరారు. ఈ విషయంపై అవగాహన ఉన్న వర్గాలు 'ఎకనామిక్ టైమ్స్'కు చెప్పిన వివరాల మేరకు 2016 ఏప్రిల్ 30న అభిప్రాయం కోరగా తెలంగాణ ముఖ్యమంత్రి నెల రోజులలోగా లేఖ రాశారు. అయితే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 11 నెలల తరువాత జాబితాలోని న్యాయవాదుల పేర్లపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ మార్చి 21న కేంద్ర న్యాయ శాఖ మంత్రి రవి శంకర్ ప్రసాద్‌కు లేఖ రాశారు. అదే సమయంలో మార్చి 24న జస్టిస్ రమణ కూడా ఆ పేర్లపై సందేహాలు వ్యక్తం చేస్తూ నాటి ఛీఫ్ జస్టిస్ ఖేహర్‌కు లేఖ రాశారు. ఈ నేపథ్యంలో కొలీజియం సభ్యుడైన జస్టిస్ చలమేశ్వర్ అసాధారణ రీతిలో జోక్యం చేసుకొని నాటి ఛీఫ్ జస్టిస్‌కు లేఖ రాశారని పత్రిక పేర్కొంది. అందులో జస్టిస్ రమణ, చంద్రబాబు అభిప్రాయాలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. వారిరువురు రాసిన లేఖల్లో "సిఫార్సు చేసిన ఆరుగురిలో ఐదుగురు ప్రస్తుత న్యాయమూర్తులకు వారసులో లేదా వారి జూనియర్‌లో లేదా వారికి దగ్గరి వారో..." అని దాదాపు ఒకే రకమైన పదాలతో ఉన్నాయన్నారు. వారిరువురి అభిప్రాయాలు ఒకే మాదిరిగా ఉండడం యాధృచ్ఛికం కావొచ్చునని, లేఖలు రాసిన తేదీలను పరిశీలిస్తే, వారిద్దరూ ప్రత్యక్షంగా సంబంధాలు నెరపుతున్నట్లు రూఢీ అవుతోందన్నారు. అంతే కాకుండా అభిప్రాయం కోరిన ఆరు వారాల లోగా లేఖ రాకపోతే, ప్రతిపాదనలు అంగీకరించినట్లుగానే భావించాలని, వారి అభ్యంతరాలు 11 నెలల తరువాత వచ్చాయన్నారు. సరైన నిర్ధారణ, పరిశీలన లేకుండా, ఆధారరహిత ఆరోపణల ఆధారంగా నిర్ణయం తీసుకుంటే కొలీజియం వ్యవస్థపై విమర్శలకు ఆస్కారమిచ్చినట్లు అవుతుందని పేర్కొన్నారు. చివరకు కొలీజియం జస్టిస్ చలమేశ్వర్‌తో ఏకీభవించి వారిరువురి అభ్యంతరాలను త్రోసిపుచ్చింది.

ఇదిలాఉండగా ప్రధాన న్యాయమూర్తి కోరిన మేరకే ఆరుగురు న్యాయవాదులపై తన అభిప్రాయాన్ని తెలియజేశానని తనకు ఆంధ్రపదేశ్, తెలంగాణ ముఖ్యమంత్రుల అభిప్రాయాల గురించి తెలియదని ఇంతకు మించి ఏమి చెప్పలేనని జస్టిస్ రమణ తమ ప్రతినిధికి తెలిపినట్టు ఎకనామిక్ టైమ్స్ వెల్లడించింది. అలాగే ఈ వ్యవహారంపై ఆంధ్రపదేశ్ ముఖ్యమంత్రి కార్యాలయానికి తాము పంపిన ప్రశ్నావళికి సమాధానం రాలేదని పేర్కొంది. అంతేకాకుండా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సతీష్ చంద్రను సంప్రదిం చేందుకు పలుమార్లు ఫోన్ చేసినప్పటికి స్పందన రాలేదని తెలియజేసింది.

తాగునీటి కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

- సింగూరు నుంచి హైదరాబాద్‌కు, అక్కం పల్లి నుంచి ఉదయ సముద్రానికి నీళ్లు వదలాలని సిఎం ఆదేశం

మన తెలంగాణ/హైదరాబాద్: కృష్ణానదిలో నీటి లభ్యత తక్కువగా ఉ న్నందున హైదరాబాద్, నల్లగొండ జిల్లాలకు మంచినీటి సరఫరా కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అధికారులను ఆదేశించారు. సింగూరు నుంచి హైదరాబాద్‌కు నీటిని వదలాలని, నాగార్జున సాగర్ నుంచి అక్కంపల్లి ద్వారా ఉదయ సముద్రానికి నీరు వదిలి నల్లగొండ జిల్లాకు మంచి నీరివ్వాలని నీటి పారుదల శాఖ మంత్రి టి.హరీష్‌రావు, ఇఎన్‌సి మురళీధర్ రావును ఆదేశించారు. సింగూరు నుంచి హైదరాబాద్‌కు, అక్కంపల్లి నుంచి ఉదయ సముద్రానికి మంగళవారం రాత్రి నుంచే నీటి విడుదల జరగాలని సిఎం ఆదేశించినట్లు సిఎం కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. కృష్ణానదిలో ఈ సారి వరద నీరు రాలేదని, నాగార్జున సాగర్లో నీరు డెడ్ స్టోరేజీ కంటే తక్కువగా ఉందని, ఈ నీటిని జాగ్రత్తగా వాడుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ పరిస్థితిలో కృష్ణానది నీళ్లపై ఆధారపడిన హైదరాబాద్, నల్లగొండ జిల్లాల్లో మంచినీటి సరఫరాకు ఇబ్బంది ఏర్పడే పరిస్థితి ఉన్నందున నిర్ణయం తీసుకున్నట్లు సిఎం వెల్లడించారు.

ఉద్యాన మహోత్సవంలో స్పీకర్

మన తెలంగాణ/హైదరాబాద్ : హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజాలో తొలి సారిగా నిర్వహిస్తున్న తెలంగాణ ఉద్యాన మహోత్సవాన్ని అసెంబ్లీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి మంగళ వారం సందర్శించారు. మహోత్సవంలో ఏర్పాటు చేసిన వివిధ రకాల స్టాళ్లను పరిశీలించారు. ఇక్కడకు మంగళవారం జగిత్యాల, సూర్యాపేట, కామారెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్, నిర్మల్ జిల్లాల నుంచి 600 మంది రైతులు వచ్చారు. వీరికి సేంద్రీయ పద్ధతిలో ఉద్యాన పంటల సాగు, అత్యధిక సాంద్రత పద్ధతిలో మామిడి సాగు, పట్టు పురుగుల పెంపకంపై శిక్షణను ఇచ్చారు.

బిజెపి 'క్విడ్ ప్రోకో'

కార్పొరేట్లకు రూ. 3 లక్షల కోట్ల లబ్ధి : సిపిఐ



మన తెలంగాణ/ హైదరాబాద్: బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు వివిధ రూపాల్లో రూ.2.65 లక్షల కోట్ల ప్రయోజనం చేకూర్చడం వెనుక 'క్విడ్ ప్రో కో' వ్యవహారం దాగి ఉందని సిపిఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి విమర్శించారు. గత ఎన్నికల సందర్భంగా కార్పోరేట్ సంస్థలు, పారిశ్రామికవేత్తల నుంచి బిజెపికి సుమారు రూ.లక్ష కోట్ల విరాళాలు అందాయని, అందుకే అధికారంలోకి వచ్చాక వారికి సుమారు మూడింతల మేరకు రూ.3 లక్షల కోట్ల లబ్ధి చేకూర్చిందన్నారు. మఖ్దుంభవన్‌లో రెండు రోజుల పాటు జరిగే సిపిఐ రాష్ట్ర సమితి సమావేశాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. సిపిఐ కార్యవర్గ సభ్యులు ఇ.టి.నరసింహా అధ్యక్షతన జరిగిన సమావేశంలో సురవరం సుధాకర్‌రెడ్డి జాతీయ, అంతర్జాతీయ రాజకీయ పరిణామాలను వివరించారు. ఇటీవల అసోసియేషన్ ఫర్ డెమాక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) వెల్లడించిన వివరాల ప్రకారం రాజకీయ పార్టీల్లో కార్పొరేట్ సంస్థల నుండి బిజెపికి అత్యధికంగా రూ.750 కోట్ల విరాళాలు అందాయని ఆయన చెప్పారు. అయితే, అంతకంటే ఎక్కువగా సుమారు రూ.లక్ష కోట్లు బిజెపికి అందాయనే ఆరోపణలు ఉన్నాయన్నారు. అందుకే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు సుమారు రూ.3 లక్షల కోట్ల వరకు బకాయిలు, అప్పులు, రద్దు చేసిందని, మరో వైపు పెట్టుబడిదారులకు ప్రోత్సాహకాలు, పన్ను రాయితీలివ్వడం ద్వారా దాదాపు రూ.20 లక్షల కోట్ల నుంచి రూ.30 లక్షల కోట్ల వరకు సంపాదించుకునే అవకాశాన్ని కల్పించిందన్నారు. రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి పదవులకు జరిగిన ఎన్నికల్లో బిజెపికి తగినంత బలం లేకపోయినప్పటికీ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌ను, సిబిఐని ఉపయోగించడం ద్వారా వివిధ రాజకీయ పార్టీల మద్దతును సాధించుకున్నదని ఆయన విమర్శించారు. బిజెపి ఎన్ని కుట్రలు చేస్తున్నా ప్రభుత్వంపై ప్రజల నిరసన, ఆగ్రహం వివిధ సమావేశాల సందర్భంగా ప్రతిబింబిస్తూనే ఉందన్నారు. బిజెపి ప్రభుత్వం మూర్ఖత్వపు ఆలోచనతో 370 ఆర్టికల్‌ను, 35ఎ ఆర్టికల్‌ను రద్దు చేసేందుకు ప్రయత్నాలు చేస్తుందన్నారు. కశ్మీర్ సమస్యను, చైనా, భారత్‌ల మధ్య ఏర్పడిన సమస్యలను చర్చల ద్వారా పరిష్కారం చేసుకోవాల్సిన అవసరముందన్నారు. బిజెపి మతోన్మాద, నోట్ల రద్దు మొదలు ఇటీవలి జిఎస్‌టి వరకు ప్రజా వ్యతిరేక విధానాలు, అసహనానికి వ్యతిరేకంగా వామపక్ష, ప్రజాతంత్ర శక్తులు ఐక్యమై ప్రత్యామ్నాయ పోరాటాలు చేపట్టడం మంచి పరిణా మమని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో టిఆర్‌ఎస్ కమ్యూనిస్టులపై దాడి చేస్తున్నదని, వాటిని కమ్యూనిస్టులు సమర్థవంతంగా ఎదుర్కొవాలన్నారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యులు అజీజ్‌పాషా ప్రసంగించారు. ఇటీవల మరణించిన ప్రముఖులు, సిపిఐ నాయకులకు సంతాపాన్ని తెలియజేస్తూ సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సమావేశం ఆమోదించింది.

రైతు సమితులపై కోర్టుకెళ్తాం : భట్టి

మన తెలంగాణ/ హైదరాబాద్: ప్రభుత్వం ప్రకటించిన రైతు సమన్వయ సమితులు చట్ట విరుద్ధమైనవని, వాటిపై న్యాయపరంగా సవాలు చేస్తామని పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టి విక్రమార్క అన్నారు. నామినేటెడ్ పద్ధతిలో ఏర్పాటయ్యే ఈ సమితుల ద్వారా టిఆర్‌ఎస్ కార్యకర్తలతో భూ మాఫియా సృష్టించబోతున్నారని, అందరి భూమి హక్కులను వారి చేతుల్లో పెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. సిఎం కెసిఆర్ వైఖరి చూస్తుంటే రాష్ట్రంలోని 119 అసెంబ్లీ స్థానాల్లో కూడా ఎంఎల్‌ఎలను నామినేట్ చేసి చిరకాలం ముఖ్యమంత్రిగా ఉండాలని భావిస్తున్నట్లుందని ఎద్దేవా చేశారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాజీ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, మాజీ ఛీఫ్ విప్ గండ్ర వెంకటరమణారెడ్డిలతో కలిసి మంగళవారం ఏర్పాటు చేసిన మీడియ సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామస్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు రైతు సమన్వయ సమితులకు సభ్యులను నామినేట్ చేసే అధికారాన్ని మంత్రులకు కట్టబెడుతూ జారీ చేసిన జిఒ 39 అప్రజాస్వామికమైనదని భట్టి విమర్శించారు. టిఆర్‌ఎస్ నాయకుల అడుగులకు మడుగులొత్తే కార్యకర్తలనే సమన్వయకర్తలుగా నియమించి, కోట్లాది రూపాయల ప్రభుత్వ నిధులను వారి చేతుల్లో పెట్టే కుట్ర దీని వెనుక దాగుందని చెప్పారు. భూ యజమానులు వారి దయాదాక్షిణ్యాలతో భయం భయంగా బతకాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. వారి చెబితేనే రైతులకు లబ్ధి అందేలా జిఒలో పేర్కొన్నారని, టిఆర్‌ఎస్ సభ్యులు చెప్పినట్లు వినకపోతే భూ వివాదం అనే సాకుతో లబ్ధి నిలిపివేయించే ప్రమాదం ఉందన్నారు. రైతు సమన్వయ సమితుల ద్వారా పాత భూస్వామ్య, పెత్తందారి వ్యవస్థను తీసుకువచ్చేందుకు సిఎం కెసిఆర్ కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఈ జిఒలో అత్యంత ప్రమాదకరమైన అంశాలు ఉన్నాయని, రెవెన్యూ శాఖ లేదా కోర్టు పరిధిలో పరిష్కారం కావాల్సిన భూ వివాదాలను గ్రామ సభల ద్వారా నామినేటెడ్ సభ్యులు సహకారంతో పరిష్కరిస్తారని పేర్కొనడాన్ని భట్టి తప్పుబట్టారు.తక్షణమే జిఒ 39ని ఉపసంహరించుకోవాలని, నిజంగా చిత్తశుద్ధి ఉంటే రైతు సమన్వయ సమితులకు ఎన్నికల ద్వారా సభ్యులు, సమన్వయకర్తలను ఎన్నుకోవాలన్నారు. రైతు సమితుల ద్వారా దశాబ్దాలుగా వ్యయప్రయాసాలతో నిర్మించబడిన రెవెన్యూ, వ్యవసాయ శాఖ వ్యవస్థలను కుప్పకూల్చే ప్రమాదం పొంచి ఉందన్నారు. ఇప్పటి వరకు ఈ శాఖల ద్వారా రుణమాఫీ వంటి పనులు జరగలేదా? అని ప్రశ్నించారు.



మంత్రులు, టిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలు టచ్‌లో ఉన్నారు


టిఆర్‌ఎస్, టిడిపిల నుండి కాంగ్రెస్ పార్టీలోకి పెద్ద ఎత్తున వలసలు ఉండబోతున్నాయని పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టి విక్రమార్క అన్నారు. త్వరలోనే రాష్ట్ర రాజకీయ ముఖచిత్రం మారబోతోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటికే టిఆర్‌ఎస్‌కు చెందిన పలువురు మంత్రులు, 15 మంది వరకు ఎంఎల్‌ఎలు టచ్‌లో ఉన్నారని చెప్పారు. మంగళవారం ఆయన జర్నలిస్టులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. సిఎం కెసిఆర్ వ్యవహార శైలితో విసిగి పోయిన వారంతా తమతో మాట్లాడుతున్నారని చెప్పారు. టిడిపి నుండి కూడా పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరబోతున్నారని అన్నారు. త్వరలోనే వరంగల్‌కు చెందిన టిడిపి మాజీ ఎంఎల్‌ఎ ఒకరు చేరుతారని, అదే బాటలో మరికొందరు ఉన్నారని తెలిపారు. ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, తదితర జిల్లాల నుండి పలువురు అధికార పార్టీ నాయకులు కూడా సంప్రదింపులు జరుపుతున్నారని వెల్లడించారు. తమ పార్టీ నుండి టిఆర్‌ఎస్‌లో చేరిన పలువురు తిరిగి తమతో టచ్‌లోకి వస్తున్నారని, వారు అక్కడ కోవర్టులుగా వ్యవహరిస్తున్నారని అన్నారు.

క్రీడా నైపుణ్యం విద్యార్థి భవితకు తొలిమెట్టు



మన తెలంగాణ/ హైదరాబాద్: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడల్లోనూ తమకంటూ ఓ ప్రత్యేకతను చాటుకోవడానికి లక్ష్యాన్ని నిర్దేశించుకుని ప్రయత్నిస్తే ఉత్తమ ఫలితాలు సిద్ధిస్తాయని జాతీయ మాజీ వాలీబాల్ క్రీడాకారులు, ట్రాన్స్‌పోర్ట్ అకాడమీ, జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జి.కిరణ్ రెడ్డి అన్నారు. కోకాపేటలోని పాయెనిక్స్ గ్రీన్స్ పాఠశాల నిర్వహణలో జరిగిన ఇంటర్ స్కూల్ టోర్నమెంట్ ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను చైతన్య పరిచేలా దిశా నిర్దేశం చేశారు. సామాజిక మాధ్యమాల పట్ల చూపించే శ్రద్ధ క్రీడల్లో కనబరుస్తే జీవితంలో ఎంతో పైకి ఎదుగొచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అంజుశర్మ, పరిపాలన అధికారులు రాజారెడ్డి, సుప్రియ, తదితరులు పాల్గొన్నారు.

"ఈ దేశపు సౌభాగ్యమంతా యువజనుల చేతిలోనే ఉంది.
– సర్దార్ వల్లభ భాయ్ పటేల్"



డోక్లాం: దౌత్యం గెలిచింది

సంపాదకీయం

సిక్కిం – టిబెట్ – భూటాన్ ముక్కోణ కూడలి ప్రదేశం డోక్లాంలో 10 వారాలుగా నెలకొన్న ఇరుదేశాల సైనిక తలపాటు ముగిసినట్లు భారత్–చైనాలు విడిగా ప్రకటనలు చేయటంతో తీవ్ర ఉద్రిక్తతకు హేతువైన దురదృష్టకర వివాదం సుఖాంతమైంది. ఎవరు ముందువెనకల తమ సైనిక పటాలాలను ఉపసంహరించుకున్నారనేదానికన్నా రెండు పెద్ద ఇరుగుపొరుగు దేశాలమధ్య శాంతి నెలకొనటం హర్షించదగింది. ఇరు దేశాల మధ్య సరిహద్దు వివాదం అపరిష్కృతంగా ఉన్న దృష్ట్యా, ఇటువంటి సైనిక మోహరింపు ఇదే ఆఖరు అనిగాని, ముమ్ముందు మరోచోట తలెత్తదనిగాని అనుకుంటే పొరపాటవుతుంది. అటువంటి పరిస్థితి ఉత్పన్నమైనప్పుడు కయ్యానికి కాలు దువ్వుకునే ప్రకటనలతో కవ్వింపులకు పాల్పడకుండా సంయమనంతో, చర్చల ద్వారా ఉద్రిక్తతను సడలించుకోవటమే ఇరు దేశాధినేతల రాజకీయ పరిణితికి నిదర్శనమవుతుంది. 3488 కిలోమీటర్ల సరిహద్దు వెంట ఎక్కడైనా అవాంఛనీయ పరిస్థితులు తలెత్తితే వాటి పరిష్కారానికి మార్గదర్శకాలు నిర్దేశించిన 2013 నాటి సరిహద్దు రక్షణ సహకార ఒప్పందం స్ఫూర్తితో ఇరు దేశాలు వ్యవహరించటమే ఉత్తమ మార్గం. ప్రస్తుత వివాదం సందర్భంలో చైనా ప్రభుత్వాధికారులు ఎన్నో రెచ్చగొట్టే హెచ్చరికలకు ఒడిగట్టినప్పటికీ, భారత ప్రభుత్వం ఎంతో విజ్ఞతతో, సంయమనంతో వ్యవహరించింది. చివరకు, ఆ సహనమే చైనా పక్షం దిగివచ్చేటట్లు చేసింది. భారత వ్యతిరేకతను రెచ్చగొట్టటానికి చైనా అధికార వ్యవస్థలోని కొన్ని శక్తులు, చైనా వ్యతిరేక ద్వేషాన్ని వెళ్లగక్కేందుకు భారత్‌లోని కొన్ని శక్తులు చేసిన ప్రయత్నాలు దౌత్యం చేతిలో ఓడిపోయాయి.

ఒక్కసారి జూన్ 16న డోక్లాం త్రికోణ కూడలి ప్రాంతంలో రహదారి నిర్మాణానికి దిగిన చైనా సైనికులను డోకాలా నుంచి వచ్చిన భారత సైనికులు భౌతికంగా అటకాయించిన సందర్భాన్ని గుర్తు చేసుకుందాం. వాస్తవానికది భూటాన్ భూభాగం. దానిపై చైనా– భూటాన్ మధ్య వివాదం ఉంది. అయితే ఆ రహదారి వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైంది. మన పశ్చిమ బెంగాల్‌లోని సిలిగురి సైనిక నడవ చైనా సైన్యం కనుచూపుల్లోకి వస్తుంది. కాబట్టి మన సైనికులు భూటాన్‌కు అండగా (దాని రక్షణ బాధ్యత మన ప్రభుత్వంపై ఉంది) చైనా సైనికులను అడ్డుకున్నారు. క్రమంగా ఇరుపక్షాల సైనిక సన్నద్ధత, సైన్యం మోహరింపు పెరిగింది. చైనా విదేశాంగ శాఖ మన సైనికులపై మానసిక ఒత్తిడి పెంచేందుకు రోజుకొక బెదిరింపు ప్రకటన చేయసాగింది. భారత్ సైనికులు ఉపసంహరించుకోకపోతే యుద్ధం తప్పదని, అదే జరిగితే 1962 నాటి యుద్ధంలో లాగా భారత్ తీవ్రంగా నష్టపోతుందనేది ఆ ప్రకటనల సారాంశం. భారత సైన్యాధిపతి కూడా దీటుగానే స్పందించారు.

భారత్, చైనాలు బ్రిక్స్, షాంఘై సహకార సంస్థ ఇతర అంతర్జాతీయ వేదికలపై కలిసి పనిచేస్తున్న నేపథ్యంలో, ఇరు దేశాధి నేతల మధ్య వ్యక్తిగత సంబంధాలు, వాణిజ్యం, భారత్‌లో చైనా పెట్టుబడులు గణనీయంగా వృద్ధి చెందుతున్న ఈ రోజుల్లో ఒక చిన్న ప్రాంతానికి చెందిన వివాదంతో ఆ మొత్తం క్రమానికి చిచ్చుపెట్టుకుంటారా? తమ ఇరుగుపొరుగు చిన్నచిన్న దేశాలకు ఒకవైపు ఆర్థిక సహాయం చేస్తూనే, రెండోవైపున భౌగోళిక విస్తరణకు ప్రయత్నిస్తున్నదన్న ఆరోపణలు, కొన్ని ప్రత్యక్ష వివాదాలు చైనా మీద ఉన్నప్పటికీ, శక్తిమంతమైన భారత్‌తో సైనికంగా తలపడాలని చైనా కోరుకుంటుందా? అయితే తమ అధికారుల నోటికి తాళం వేయటంలో చైనా నాయకత్వం విఫలం కావటం వల్లనే డోక్లాంలో ఉద్రిక్తత హెచ్చింది.

జర్మనీలోని హాంబర్గ్‌లో జి. 20 సమావేశాల సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ, చైనా అధ్యక్షుడు క్సి జిన్‌పింగ్ కొద్దిసేపు ముచ్చటించుకున్నప్పుడు, డోక్లాం వివాద పరిష్కారానికి దౌత్య ప్రయత్నం చేయాలని నిర్ణయించారు. అటు తర్వాత, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ జులైలో చైనా సందర్శించి చర్చలు జరిపారు. విదేశాంగ కార్యదర్శి ఎస్.జై శంకర్, భారత రాయబారి విజయ్ గోఖలే చర్చలు కొనసాగించారు. అంతిమ పరిష్కారం ప్రకారం భారత సైనికులు ముందుగా తమ భూభాగంలోకి తిరిగి వచ్చారు. అటు తర్వాత చైనా సైనికులు, రోడ్డు నిర్మాణ యంత్రాలు సహా ఉపసంహరించుకున్నారు. ఆ వివాద ప్రాంతంలోకి ఇంతకు క్రితం వలే చైనా గస్తీ సైనికులు వచ్చిపోతూ ఉంటారు. భూటాన్ ఊపిరి పీల్చుకుంది. 3–5 తేదీల్లో బీజింగ్‌లో బ్రిక్స్ సమావేశాలకు ప్రధాని మోడీ హాజరయ్యేందుకు మంచి వాతావరణం ఏర్పడింది. సరిహద్దు వివాదాలను తమంతటతామే పరిష్కరించుకోగలమని ఇరుదేశాలు చాటి చెప్పాయి.

చైనాతో ఏమి జరిగింది?

చూపు

భారత, చైనాల మధ్య డోక్లాం సరిహద్దు ప్రతిష్టంభన సమసిపోవడంతో ఇరుపక్షాల ఆట 'డ్రా' అయినట్టు భావించాలి. చాలా కాలంగా రగులుతున్న సరిహద్దు సమస్యపై ప్రస్తుత ఉపశమనాన్ని ఇరుపక్షాలకు విజయంగా మోడీ మలచగలరా? డోక్లాం విషయమై ప్రతిష్టంభనకు తెరదించుతూ 40 దళాల భారత సైన్యం, ఒక బుల్డోజర్ వివాదాస్పద ప్రాంతం నుంచి వెనక్కి మళ్లుతున్నట్లు వార్త వెలువడిన గంటకు బిజెపి శిబిరంలో కథలు అల్లే వారు బిజీ అయిపోయారు. అది 'తప్పనిసరిగా భారత్ తన పొరుగు వేధింపు దేశంపై సాధించిన విజయం' అని ప్రచారం ప్రారంభించారు. మూలాలు చెప్పకుండా ఒక ఆంగ్ల పత్రికలో ఇటువంటి వ్యాస కర్త ఒకరు 'భారత్‌ను బెదిరించడానికి చైనా చేయాల్సినది అంతా చేసింది. యుద్ధం బెదిరింపుతో సహా భారత్‌లోపల తిరుగుబాటును రెచ్చగొడతామని కూడా హెచ్చరించింది. ఈ బెదిరింపుల నేపథ్యంలో 'చైనా దిగిరావడం' మనకు చెప్పుకోదగ్గ విజయం' అని రాశారు.

అంటే చిన్న దేశాలకు చైనా బెదిరింపులను అంతగా పట్టించుకోనక్కరలేదని సందేశం ఇవ్వడమే. చైనా డోక్లాంలో వెనుకడుగు వేసిందని చెబితే చిన్న దేశాలు ఆ పెద్ద దేశం 'కళ్లలో కళ్లు పెట్టి' చూస్తాయి. అంతేకాకుండా అటువంటి పరిణామం భారత దేశం ప్రాంతీయంగా బలోపేతమైనదిగా కనపడడానికి ఉపయోగపడుతుంది కూడా. అంతేకాకుండా భారత్ దెబ్బకు తారెత్తి చైనా వెనక్కి మళ్లిందని వెన్ను చరుచుకోవచ్చునని బిజెపి ప్రచారకులు ఈ విషయంలో కథలు అల్లుతున్నారు.


సమర్థనీయం కాదని ఒప్పుకొన్న భారత్

అయితే డోక్లాం నుంచి ఉప సంహరణ జరుగుతోందని భారత ప్రభుత్వం ప్రకటన చేయడం డోక్లాంలోకి తన సైనిక బలగాలను పంపడానికి సమర్థనీయత లేదని ఒప్పుకోవడమే. చైనా దురాక్రమణ నుంచి రక్షించాలని భూటాన్ భారత్‌ను కోరినట్లు రికార్డులు ఏవీ లేవు. ఆ అంశం భూటాన్, చైనా మధ్య రగరాల్సినది. కానీ డోక్లాంలోకి భారత సైన్యాన్ని పంపడంతో అది భారత, చైనా సంబంధాల మధ్య సంక్షోభానికి దారి తీసింది. కొద్ది కాలంపాటు నేపాల్ సెక్టార్‌లోని డోక్లాం పీఠభూమి యాజమాన్యంపై వివాదం చెలరేగింది. డోక్లాంలో భారత బలగాల ఉనికిని తమ భూభాగం అతిక్రమించడంగా భావిస్తానని చైనా ప్రభుత్వం హెచ్చరించింది.

ఒక్కసారి కాదు, గత 6 వారాల్లో నాలుగు సార్లు. జూలైలో ఆ ప్రాంతం చట్టపరమైన పరిస్థితిని వివరిస్తూ 17 పేజీల ప్రకటనను చైనా చేసింది. చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి హువా చున్యింగ్ ఆగస్టు 22న తక్షణమే భారత సైన్యం వైదొలగాలని మళ్లీ డిమాండ్ చేశారు. 'డోక్లాంలోని 'వాటర్ షెడ్' వైపు నుంచి భారత్ వైదొలగితేనే శాంతి చర్చలు' అని కూడా పేర్కొన్నారు. ఢిల్లీలో చైనా రాయబారి రెండుసార్లు ఈ విషయంలో స్పష్టమైన ప్రకటనలు చేశారు.

ప్రగల్భాలకు చైనా తూట్లు

తాజాగా చైనా భారత ప్రగల్భాల బుడగకు తూట్లు పొడిచింది.



వివాదాస్పద ప్రాంతం నుంచి భారత సైనిక దళాలు ఈ సరికే వెనక్కి మళ్లినట్లు ప్రకటించింది. 'చర్చలకు చైనా పెట్టిన షరతు దీని వల్ల తీర్చినట్లు అయింది' అని చైనా పేర్కొంది. తన తాజా ప్రకటనలో మరో కీలక ప్రస్తావన చేసింది. అదేమిటంటే – చైనా బలగాలు తమ దేశ భూభాగాల సార్వభౌమ్యాధికార పరిరక్షణ కొనసాగిస్తాయని. సరిహద్దులకు సంబంధించి 1980 దశకం మొదట్లో కుదిరిన ఒప్పందం సూత్రాల ప్రకారం ఆ పని తమ సైన్యం సాగిస్తుందని కూడా చైనా స్పష్టం చేసింది.

ఈ నేపథ్యంలో ఇరు దేశాలు వెనక్కి తగ్గడానికి దోహదపడిన రాజీ సూత్రం ఏమిటి? డోక్లాంలో చైనా నిర్మిస్తున్న రోడ్డు అంశాన్ని ఇరు దేశాలు తమ ప్రకటనల్లో ప్రస్తావించకూడదు అని అంగీకారం కుదిరిందా? లేక ఆ అంశం మీద అసలు ఏ ఒప్పందం కుదరలేదా? కేవలం ఇరు పక్షాలు ప్రస్తుత ప్రతిష్టంభనకు స్వస్తి పలకాలని మాత్రమే నిర్ణయించాయా? ఇదే నిజమైతే సోమవారం నాటి సేనల మళ్లింపు ఏ దేశానికీ విజయంగాగాని, ఓటమిగాగాని పరిగణించలేము. సరిగా చెప్పాలంటే అది ఆట 'డ్రా' అవడంతో సమానం. అయితే ఈ అంచనా నిజమో కాదో కాలమే చెబుతుంది.

'చికెన్స్ నెక్'పై భారత్ అనవసరపు భయాలు

'చికెన్స్ నెక్' భూభాగంపై భారత దేశపు భయాందోళనలు సంపూర్ణంగా చైనా ఆకళింపులోకి వచ్చాయన్నది నిజం. అది భారత్ బంగ్లాదేశ్‌ల మధ్యగల భూభాగం. ఆ భూభాగం చైనా ఆక్రమణకు గురవుతుందని అర్థం లేని భయాలు భారత్ పెట్టుకోవడంతో భజన పరులైన వ్యూహకర్తలు ఆ భయాలను పెంచే ఉపాయాలతో పబ్బం గడుపుకుంటున్నారు. ఆ భూభాగం వద్దగల 'నాథూలా' రహదారి భారత్‌కు పెద్ద ఆస్తిగా రూపొందే అవకాశం ఉంది. భారత, చైనాల మధ్య స్థిరమైన మైత్రికి ఆ భూభాగాన్ని భారత్ వినియోగించుకుంటే మంచిది. నాథూలా సముద్ర మట్టం కంటే 4310 – 14,500 అడుగుల ఎత్తున వుంది. ఏడాదిలో నాలుగు నెలలు మంచుతో కప్పబడి ఉంటుంది. నాథూలా ద్వారా మాత్రమే చైనా 'చికెన్స్ నెక్' లోకి ప్రవేశించాలి. అంటే ఆ భూభాగంలో ప్రవేశించే చైనా బలగాలు నాలుగు నెలలు కరచరణాలు ఆడకుండా అక్కడే ఉండిపోవాలి. భారత దేశం ఏమి విసిరితే దానితో తృప్తిపడి జీవించాలి. వారికి చైనా సరఫరాలు అందే వీలు కూడా లేదు. చికెన్స్ నెక్‌లో నేపాల్, బంగ్లాదేశ్ మధ్యగల ప్రాంతం చాలా ఇరుకుగా ఉంటుంది. అది నాథూలా నుంచి కూతవేటు (200 కి.మీ.) దూరంలో ఉంది. అక్కడి నుంచి పశ్చిమ బెంగాల్‌లోని కలింపాంగ్ 136 కి.మీ. దూరంలో ఉన్నట్లు ఉంది. మధ్యలో అనేక వంతెనలు, కల్వర్టులు దాటి నాథూలా లోకి చైనా సేనలు రావడం కుదరదు. అందుచేత 'చికెన్ నెక్' ఆక్రమణ భయాలు భారత్ విడనాడి చైనాను విశ్వసిస్తే ఇరు దేశాలకు మంచిది. అందుకు వచ్చేవారం చైనాలో జరగనున్న 'బ్రిక్స్' సమావేశాన్ని మోడీ వినియోగించుకోవాలి.

✻ ప్రేమ్ శంకర్ ఝా

నంద్యాల నగ్న సత్యాలు!



డానీ
9010757776

నంద్యాల ఉపఎన్నికల్లో సెంటిమెంట్ బలంగా పనిచేసి తెలుగు దేశం అభ్యర్థికి ఘన విజయం చేకూర్చిందనే అభిప్రాయం బలంగా ప్రచారంలోనికి వచ్చింది. నిజానికి అక్కడ సెంటిమెంటుకన్నా అనేక ఇతర అంశాలే బలంగా పనిచేశాయి. వాటిని పరిశీలించకుంటే ఎన్నికల ఫలితాలని సరిగ్గా అంచనా వేయలేం. నంద్యాల ఉపఎన్నికల్లో సెంటిమెంటు టిడిపి, వైయస్సార్ సిపిలకు సమానంగా వుంది. టిడిపికి సిట్టింగ్ అభ్యర్థి చనిపోతే, వైయస్సార్ సిపికి గత ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థి ప్లేటు ఫిరాయించాడు. ఒకరికి అభ్యర్థి సెంటిమెంట్ అయితే మరొకరికి పార్టీ సెంటిమెంట్ వుంది. సెంటిమెంట్ ఇద్దరికీ సమానం అయినపుడు ఫలితాలని ఇతర అంశాలు నిర్ణయిస్తాయి.

రాజకీయ పార్టీ ఆధారిత పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో చోటు చేసుకుంటున్న వైపరీత్యాలకు తాజా ప్రతీక నంద్యాల ఉపఎన్నికలు. టిడిపి తో మొదలయ్యి ఆళ్లగడ్డ నుండి మూడు సార్లు గెలిచి, 2009లో ప్రజారాజ్యం పార్టీకి మారి, 2014 ఎన్నికల్లో వైయస్సార్ సిపి టిక్కెట్టుపై రెండుచోట్ల గెలిచి ఎన్నికల తరువాత గోడ దూకి తిరిగి తెలుగు దేశం పార్టీ లోనికి చేరిన చరిత్ర భూమా కుటుంబానిది. కాంగ్రెస్ లో మొదలయ్యి మంత్రి పదవిని కూడా పొంది, 2014 ఎన్నికల్లో టిడిపికి మారి, ఇప్పుడు మళ్ళీ వైయస్సార్ సిపి టిక్కెట్టుపై రంగంలో దిగిన చరిత్ర శిల్పా కుటుంబానిది. తడవకో పార్టీ మారే అభ్యర్థులు తలబడుతున్నప్పుడు వాటిని రాజకీయ సిద్ధాంతాల ఘర్షణ అనరు. ఇద్దరూ ఒకే సామాజిక వర్గానికి చెందినవారు గనుక అందులో సామాజిక సంఘర్షణ కూడా ఏమీ లేదు. అది కేవలం రెండు కుటుంబాల తగవు. చంద్రబాబు అభివృద్ధి విధానాలకు ఓట్లు పడ్డాయని ఇప్పుడు అధికారపార్టీ సాగిస్తున్న ప్రచారమూ సరైనదికాదు.

దాదాపు 80 వేల ఓట్లు టిడిపికి వ్యతిరేకంగా పడ్డాయి మరి!. వైయస్సార్ సిపీ నోటి దుర్వినియోగంకన్నా, టిడిపి అధికార దుర్వినియోగం ఈ ఎన్నికల్లో మంచి ఫలితాలను సాధించిందంటే కొంచెం సమంజసంగా వుంటుంది. డబ్బు పంపిణీలో నంద్యాల ఉప ఎన్నిక గత రికార్డులు అన్నింటినీ బద్దలు గొట్టేసింది. ఒక అనధికార అంచనా ప్రకారం అధికార పార్టీ ఎన్నికల వ్యయం 100 కోట్ల రూపాయలకు పైమాటే! 1500 కోట్ల రూపాయల నంద్యాల అభివృద్ధి ప్యాకేజీ వగయిరాలు దీనికి అదనం. 2019 అసెంబ్లీ ఎన్నికలకు నంద్యాల ఉపఎన్నిక సెమీ ఫైనల్ లాంటిదనే మాట ప్రచారంలో వుంది. అందువల్ల ఎవరు గెలిచారు? అనే దానికన్నా ఎందుకు గెలిచారు? ఎందుకు ఓడారు? అన్న అంశాల మీద భారీ చర్చలు జరుగుతున్నాయి. అధికార యంత్రాంగం సహకారం (దీనినే అధికార దుర్వినియోగం అని కూడా అంటారు.), డబ్బు ప్రవాహాన్ని ఎన్నికల సీసాలో పోసి దానిమీద అభివృద్ధి మంత్రం లేబిల్ ను అంటించేస్తే గెలుపు సులభమని టిడిపి వ్యూహకర్తలకు అర్థం అయిపోయి వుంటుంది. బహుశ ఈ ఫార్ములానే ఆ పార్టీ రేపు 2019 ఎన్నికల్లో కూడా ప్రయోగించవచ్చు!

గెలుపుకు కొన్ని కారణాలే వుంటాయి. ఓటమికి వంద కారణాలుంటాయి. ఇప్పుడు అవేమిటనేది అసలు చర్చ. ఈ ఎన్నికల్లో జగన్ ఒక పరిపక్వత చెందిన రాజకీయ నాయకునిగా వ్యవహరించ లేదు. సమీప భవిష్యత్తులో వారు అలాంటి పరిపక్వతను సాధించగల సూచనలూ కనిపించడం లేదు. రాజకీయాల్లో విధానాలే కీలకం అయినప్పటికీ నాయకుని వ్యక్తిత్వం, వ్యవహారశైలి నిర్ణయాత్మక పాత్రను పోషిస్తాయి. ఎవరయినా ముఖ్యమంత్రి అవ్వాలని ఆశించడం తప్పుకాదు. కానీ, ముఖ్యమంత్రి అయిపోయానని భ్రమించడం తప్పు! ఈపాటి చిన్న తేడాను జగన్ చాలా కాలంగా గుర్తించడంలేదు.

ప్రజాస్వామ్యం అంటేనే అంకెల ఆధిక్యత. ఎపిలో రాజకీయ నాయకత్వం వహిస్తున్న కమ్మ, రెడ్డి సామాజికవర్గాల్లో దేనికీ స్వంత ఓట్లతో మేజిక్ ఫిగర్ ను సాధించి అధికారాన్ని చేపట్టగల సంఖ్యాబలం లేదు. అందువల్ల, సామాజిక కూటమి రాజకీయాలు అనివార్యం అవుతున్నాయి. సోషల్ మీడియాలో కొందరు టిడిపిని కమ్మపార్టీగా, వైసిపిని రెడ్డి పార్టీగా ప్రచారం చేస్తున్నారుగానీ అది మరీ సంకుచిత దృక్పథం. ప్రస్తుతం కమ్మ సామాజికవర్గం చొరవతో వివిధ సామాజికవర్గాలతో ఏర్పడిన కూటమికి చంద్రబాబు నాయకత్వం వహిస్తుండగా, రెడ్డి సామాజికవర్గం చొరవతో వివిధ సామాజికవర్గాలతో ఏర్పడిన కూటమికి జగన్ నాయకత్వం వహిస్తున్నారు. అయితే, సోషల్ ఇంజినీరింగ్ (కుల సమీకరణలకు గౌరవనీయ పదం) చంద్రబాబు శిబిరంలో కనిపించినంత స్పష్టంగా జగన్ శిబిరంలో కనిపించదు.

అది టిడిపికి ఒక సానుకూల అంశం. అసలు తన ఓటు బ్యాంకు గురించి జగన్ కు లోతైన అవగాహన లేనట్టుంది. తన తండ్రి వైయస్ రాజశేఖర రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ కు 2004, 2009 ఎన్నికల్లో పడ్డ ఓట్లన్నీ తన పేరున ఎన్నికల కమీషన్ లాకర్ లో ఇప్పటికీ భద్రంగా వున్నాయనే భ్రమల్లో జగన్ వుంటున్నారు. 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ కనుమరుగైపోవడంతో ఆ ఓట్లన్నీ తనకు పడతాయని ఆయన నమ్మారు. అయితే, ఆ ఓటర్ల సామాజిక కూర్పు ఏమిటి? వాళ్లపై కొత్తగా రంగ ప్రవేశం చేసిన నరేంద్ర మోడీ ప్రభావం ఏమిటి? అనే అంశాలు ఆయనకు అర్థం కాలేదు.

వైయస్ హయాంలో కాంగ్రెస్ కు దగ్గరయిన ముస్లింలు కిరణ్ కుమార్ రెడ్డి అనుసరించిన విధానాలవల్ల ఆ పార్టీకి దూరం అవుతున్న సమయం అది. మరోవైపు, చంద్రబాబు ఎన్నికలకు ముందే మోదీతో జత కట్టడంతో ముస్లిం సమాజం జగన్ వైపు ఆశగా చూసింది. ఎన్నికల తరువాత ఎట్టి పరిస్థితుల్లోనూ మోదీతో జతకట్టను అని ఒక్క హామీ ఇస్తే చాలని ముస్లిం ప్రతినిధులు వైయస్సార్ సిపి పెద్దల్ని కోరారు. మోదీ రాకతో ముస్లిం, క్రైస్తవ, దళిత సామాజికవర్గాల్లో తలెత్తిన భయాందోళనల్ని జగన్ అస్సలు పట్టించుకోలేదు. ప్రచార ఘట్టం ముగిసే వరకూ ఆయన అలాంటి హామీ ఇవ్వలేదు. అయినప్పటికీ, మరోమార్గంలేక ఆ మూడు సామాజికవర్గాల్లో అత్యధిక భాగం జగన్ కు ఓటేయక తప్పలేదు. వాళ్ళలో కొంత భాగం మాత్రమే టిడిపికి ఓటేశారు. ఎన్నికల్లో గెలవడానికి రాజకీయ పార్టీలన్నీ రెండు ఎత్తుగడల్ని అనుసరిస్తుంటాయి.

మొదటిది, తమ ఓటు బ్యాంకును పటిష్టం చేసుకుంటాయి. రెండోది; తమ విధానాలతో కొత్తగా అదనపు ఓటు బ్యాంకును సృష్టించుకునే ప్రయత్నం చేస్తాయి. నంద్యాల ఉప ఎన్నికల్లో ప్రధాన ప్రత్యర్థులిద్దరూ రెడ్డి సామాజిక వర్గానికి చెందినవారు. వయో బేధం వున్నప్పటికీ, కుటుంబాల నేపథ్యం కారణంగా దాదాపు ఇద్దరూ సమవుజ్జీలు. అప్పుడు నియోజకవర్గంలోని రెడ్డి సామాజికవర్గం ఓట్లు సహజంగానే దాదాపు సమానంగా చీలిపోతాయని అందరికీ తెలుసు. ఈ నేపథ్యంలో నంద్యాలలో విజయానికి ముస్లిం ఓటర్లు అత్యంత కీలకంగా మారారు. ఈ అంశాన్ని ముందే గమనించిన చంద్రబాబు ముస్లింలను ఆకట్టుకోవడానికి ఎంఎల్‌సి పదవి, వక్ఫ్ బోర్డు తదితర కొన్ని రాయితీలను ప్రకటించారు. అవి ఎన్నికల కోసం ప్రకటించిన రాయితీలే కావచ్చు. ఎవరు ప్రకటించినా ఎప్పుడు ప్రకటించినా రాయితీలు రాయితీలే. జగన్ వెంటనే దానికి మించిన రాయితీలను ముస్లింలకు ప్రకటించి వుండాల్సింది. తెలంగాణలో కేసిఆర్ హామీ ఇచ్చినట్టు విద్యా, ఉపాధి రంగాల్లో ముస్లింలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ కల్పిస్తానని ప్రకటించి వుండాల్సింది. మా నాయిన వైయస్ రాజశేఖర రెడ్డిగారు 4 శాతం రిజర్వేషన్లు ఇచ్చారు. నేను దాన్ని పది శాతం చేస్తా అని ఒక్క మాట అనుంటే కనీసం 15 వేల ఓట్లు తారుమారయ్యేవి. అప్పుడు ఫలితాలు ఎలావుండేవో ఊహించుకోవచ్చు. జగన్ అలా చేయలేదు. 2014లో చేసిన తప్పునే ఆయన మరోసారి చేశారు. ఈసారి అంతకన్నా పెద్ద తప్పు చేశారు. తాను నరేంద్ర మోడీ, అమిత్ షాలకు దగ్గరవుతున్నట్టు బలమైన సంకేతాలు ఇచ్చారు. దానివల్ల చంద్రబాబు ఓటు బ్యాంకుకు చిల్లు పెట్టవచ్చని వారు ఆశించి వుండవచ్చుగానీ, తన ముస్లిం ఓటు బ్యాంకు పూర్తిగా మునిగి పోతుందని ఊహించి వుండరు. ఎన్నికల వ్యూహకర్తగా ఉత్తరాది నుండి జగన్ కోరి తెచ్చుకున్న ప్రశాంత్ కిషోర్ (పీకే) భారత రాజకీయాల్లో మోడీ అప్రతిహత శక్తి అని నమ్మే వ్యక్తి. 2014 ఎన్నికల్లో మోడీకి ఎన్నికల వ్యూహకర్తగా వున్నారు. బీహార్ లో నితీష్ కుమార్ నూ బుజ్జగించి పాత గొడవల్ని మరిచిపోయేలా చేసి మోడీకీ దగ్గర చేసింది వీరే. ఇప్పుడు జగన్ నూ పెరటి దారిలో మోడీఅమిత్ షాల దగ్గరికి చేరుస్తున్నదీ వీరే. ఇలాంటి వ్యూహాలు నంద్యాల వంటి చోట్ల ఓట్లు పీకలేవని పీకేగారికి తెలియకపోవచ్చు.2014లో మోడీతో జత జట్టినప్పటి నుండి ముస్లింలలో ఎక్కువ మంది టిడిపి మీద గుర్రుగా వున్నారనేది వాస్తవం. మోదీ ప్రభావంతోనే ఏపీ మంత్రివర్గంలో ముస్లింలకు ప్రాతినిధ్యం దక్కలేదనే భావం కూడా బలంగా వుంది. తాము నమ్ముకున్న జగన్ ఇప్పుడు మోడీకీ దగ్గర కావడం ద్రోహ చర్య అనే భావం ఆ సామాజికవర్గంలో బలపడింది. శత్రువుకన్నా ద్రోహి మరింత ప్రమాదకారి అనే సామెత ఎలానూ వుంది.

ముస్లింలు చంద్రబాబుకు ఓటేసినా ఏన్డీయేకు ఓటేసినట్టేగా?'' అని వైసిపి మేధావులు కొందరు ఇప్పుడు గడుసుగా అడుగుతున్నారు. నిజానికి ఇప్పుడున్న రాజకీయ సమీకరణల్లో జగన్ కు ఓటేసినా ఏన్డీయేకు ఓటేసినట్టే. ఇద్దరి మధ్య ఎవర్ని ఎంచుకోవాలనుకున్నప్పుడు మొరటుదేగానీ ఒక పాత సామెత వుంది ఫత్తర్ ఫోడు వీపు నాకడంకన్నా అత్తరు సాయిబు చంక నాకడం మేలు అని. విపక్షనేతకన్నా అధికారపక్షనేతే మేలని ముస్లింలు భావించారు. అదే నంద్యాల ఉపఎన్నికల ఫలితాలను నిర్ణయించింది. Nothing hurts more when whom you thought a friend betrays you.

'సీనియర్ల'కు రంపపు (వడ్డీ) కోత!



బి. నర్సన్
9440128169

ట్విట్టర్లు, ఇ మెయిల్, ఫేస్ బుక్‌ల ద్వారా వచ్చిన ప్రజా సమస్యలకు స్పందించి దాన్ని ప్రచారంలోకి తెచ్చుకోవడం ఈ మధ్య రాజకీయ నాయకులకు, ప్రత్యేకంగా పాలకులకు అదనపు ఆకర్షణగా మారిపోయింది. వేలాదిగా వచ్చే వాటిలో చిన్న చిన్న వాటిని ఏరుకొని పరిష్కరించి పత్రికల్లో చోటు సంపాదించే వాటి కన్నా మరెన్నో భారీ విషయాల్ని చూసీ చూడనట్లుంటారనడానికి వారి ఖాతాలే సాక్ష్యం. అమిటీ యూనివర్శిటీ, నొయిడాలో పని చేసిన ప్రొ. కవిత సుర్చికి గ్రాట్యుటీ ఈయడంలో యూనివర్శిటీ వారు ఆలస్యం చేశారు. ఆమె ఈ విషయాన్ని తెలుపుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి లేఖ రాసింది. ప్రధాన మంత్రి కార్యాలయం ప్రమేయంతో ఆమె సమస్య తక్షణమే పరిష్కరించబడింది. ఈ వార్తను ఓ ఇంగ్లీషు చానల్ ప్రసారం చేసింది.

ఇలా పరిష్కారం దొరికే విషయాలు కొన్నుంటే జవాబే రాని ఉత్తరాలు చాలా ఉంటాయి. అందులో ఒకటి ఓ సీనియర్ సిటిజన్ డిపాజిట్‌పై తగ్గుతున్న బ్యాంకు వడ్డీపై ప్రధాన మంత్రికి రాసిన లేఖ. ప్రధాన మంత్రి మోడీ ఫేస్‌బుక్‌కు, ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీకి ఇ మెయిల్ ద్వారా పంపిన ఈ లేఖ సంక్షిప్త రూపం ఇలా ఉంది. గౌరవనీయులైన ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ జీ, గౌరవనీయులైన ఆర్థిక మంత్రి శ్రీ అరుణ్ జైట్లీ జీ, నేనో సీనియర్ సిటిజన్‌ని. 1.8.2012 నాడు దేశంలోని ఓ జాతీయ బ్యాంకులో రూ. 40లక్షలు దాచినాను. అందుకు ప్రతిఫలంగా నెలనెలా రూ. 35350/ (ఆదాయపు పన్ను మినహాయించి) వడ్డీ రూపంలో నేను పొందుతున్నాను. దాని వల్ల ఆర్థికంగా ఏ బాదరబందీ లేని జీవితాన్ని గడుపుతున్నాను. అయిదేళ్ల గడువు తీరినందువల్ల తిరిగి 1.8.2017 నాడు అదే సొమ్మును అదే బ్యాంకులో వడ్డీ కోసం దాచి ఉంచినాను. ఇప్పుడు నెలకు రూ. 26,489/ మాత్రమే అందుతున్నాయి. రూ. 8863/ అనగా మొదట వచ్చిన సొమ్ము కన్నా దాదాపు 25 శాతం తక్కువ వస్తోంది. ఈ నా నష్టాన్ని, త్యాగాన్ని ఏ ఖర్చులో తగ్గించుకొని భరించాలి. నెలవారీ మందుల ఖర్చులోనా? బియ్యం పప్పులలోనా? కూరగాయలు, పళ్లు లేదా పాల ఖర్చులోనా?

నిజానికి 2014లో గద్దెనెక్కిన మీ ప్రభుత్వం సీనియర్ సిటిజన్ల కోసం ఏమీ చేయలేదు. అదనపు ప్రయోజనాలను కల్పించకపోగా 2014 వరకున్న వాటినే తొలగించారు. ఏ దినుసు, వినిమయ వస్తువు 2014 ధరలకు లభించడం లేదు. మీరు ద్రవ్యోల్బణం తగ్గించడంలోనో, సెన్సెక్స్‌ను పరుగులు పెట్టించడంలోనో సమర్థులనిపించుకోవచ్చు. కానీ ధరలకు మాత్రం కళ్లెం వేయడం లేదు. రోజూ వాడుకునే పప్పు, ఉప్పు, ఉల్లిగడ్డల ధరలు రాకెట్ వేగంతో పెరిగిపోతున్నాయి. క్రితం కాలంలో కనీసం వాటిని చూసే ధైర్యమైనా చేసే వాళ్లం.నాకు తెలుసు, మీరు రాజకీయంగా, సిద్ధాంతపరంగా జవాబు ఈయడంలో సిద్ధహస్తులే. బ్యాంకు వడ్డీ రేట్లు వాటి వ్యాపారాలపై ఆధారపడి ఉంటాయని సునాయానంగా చెప్పగలరు. మరి నిత్యావసర వస్తువులు వ్యవసాయ దిగుబడులపై ఆధారపడి ఉంటాయి కదా.. దిగుబడులున్నా వాటి ధరలు మాత్రం ఆకాశాన్ని ఎందుకు చేరుకుంటున్నాయో చెప్పగలరా!

ప్రభుత్వం వ్యాపారులకు, పారిశ్రామిక వేత్తలకు తక్కువ వడ్డీకి రుణ సదుపాయం కల్పించాలనుకుంటే అది డిపాజిటర్లను బలి చేసి కాదు. బ్యాంకుల నిరర్థక ఆస్తుల అగ్ని పర్వతంపై కూర్చున్నాయి. స్వచ్ఛమైన సొమ్ము, అప్పుగా వెళ్లగానే చెడ్డదిగా మారిపోతుంది. ఇలా ఎందుకు చెడుతుందో లోతుగా ఆలోచించి సొమ్ము స్వచ్ఛతను కాపాడవలసిన బాధ్యత మీదే కదా! తమ విలువైన జీవితాల్ని వివిధ సంస్థలలో విధులు నిర్వహించి జాతి కోసం వెచ్చించిన సీనియర్ సిటిజన్లకు గౌరవ ప్రదమైన జీవితం అందించే బాధ్యతను విస్మరిస్తున్నారు. అవసరాలను దాటి ప్రభుత్వాలు మరోలా ఆలోచిస్తున్నాయి. నాకు జరుగుతున్న 25 శాతం నష్టాన్ని ఎలా పూరించుకోను? మీలో ఏ మంత్రి, ఎంఎల్‌ఎ, ఎంపి అయినా ఈ స్థాయిలో తమ జీతభత్యాల కోతను విధించుకోవడానికి సిద్ధంగా ఉన్నారా? లేనిచో ఈ వేదన శారీరకంగా బలహీనులైన సీనియర్ సిటిజన్లకే ఎందుకు?ఎందుకంటే, మీలాగా మేము మా జీతభత్యాలను నిర్ణయించుకోలేము. ఆ శక్తి, అధికారం మాకు లేదు. ఏడాది పొడుగునా మీరు అసెంబ్లీ, పార్లమెంట్ సమావేశాలకు హాజరైనా, కాకున్నా అంతా మీ ఇష్ట ప్రకారమే జరుగుతుంది.

మీ జీతభత్యాల పెంపుదల విషయానికొస్తే ఎలాంటి చర్చ లేకుండా స్వపక్ష, ప్రతిపక్షాల పూర్తి సభ మద్దతుతో రెండు నిమిషాల్లో జరిగిపోతుంది. మీకు సంబంధించిన పెంపుకు ఖజానా, బడ్జెట్ లోటు, ఆర్థిక ఇబ్బందులు ఏమీ అడ్డురావు, గుర్తుకు రావు.ప్రభుత్వం సీనియర్ సిటిజన్ కోసం 9.20 శాతం వడ్డీ ఇచ్చే ఓ పథకాన్ని బడ్జెట్‌లో ప్రకటించింది. కాని జులై 2017 నుండి అది 8.30 శాతానికి తగ్గించబడింది. పొదుపును కూడా రూ. 15 లక్షలకే పరిమితం చేశారు. ఇది పూర్తిగా ద్రోహ పూరితమైన చర్య. పదవీ విరమణ సమయంలో వచ్చిన మొత్తానికి ఆ ప్రత్యేక వడ్డీ లభించేలా నిర్ణయం తీసుకోవలసిన అవసరం ఉంది. సీనియర్ సిటిజన్లకు అప్పుడైనా కాస్తా సమాజంలో ఆర్థిక గౌరవం దక్కుతుంది. శేష జీవితాన్ని తమ ఖర్చులను వడ్డీ ద్వారా తీర్చుకునే వారి బాధలను అర్థం చేసుకుంటారనే నమ్మకం నాకుంది. ఏ విధంగానైనా మిమ్ముల్ని బాధించితే మన్నింపులు కోరుతున్నాను. కృతజ్ఞతాభివందనములతో ఉత్తరం ముగుస్తుంది.

ఉద్యోగపరంగా, ఆరోగ్యపరంగా వస్తున్న వ్యక్తిగత సమస్యలను పరిష్కరించడం కన్నా కోట్ల సంఖ్యలో ఉన్న విశ్రాంత ఉద్యోగులకు, వయో వృద్ధులకు ఆర్థిక భద్రత కల్పించడం ప్రభుత్వ కనీస ధర్మం. అయితే పై ఉత్తరానికి జవాబును ఆశించడం అత్యాశే అవుతుంది. కాని ఎవరి సొమ్ము ఎవరి చేతిలోకి చేరి భస్మీపటలమవుతుంది? సొమ్ములు చేతిలో పెట్టిన వారి చేతుల్లో బ్యాంకులు ఇంత దుమ్ము కొట్టి సాగనంపే దుర్మార్గం వెనుక ప్రభుత్వం, దాని అనుంగ వర్గాలతో ప్రయోజనం దాగి ఉంది. ఈ ఒక్క ఉత్తరం ఏమి సాధించిందీ అనుకోవచ్చు. కానీ ఎంతో మంది సీనియర్ సిటిజన్ల వ్యధను ప్రతిబింబించింది. అవును నిజమే, వీరికి ఆర్థిక స్వావలంబన కల్పించాలి అనే ఆలోచనను మాత్రం మొలకెత్తించింది.

పల్స్

జీర్ణాశయ క్యాన్సర్‌ను ముందే గుర్తించండి

మన శరీరంలో జీర్ణక్రియ సక్రమంగా జరిగితేనే మనం ఆరోగ్యంగా జీవించగలుగుతాం. జీర్ణవ్యవస్థలో లోపం ఉంటే జీవక్రియలు, సక్రమంగా జరగవు. శరీర పెరుగుదల, వ్యాధినిరోధక శక్తి తక్కువ అవుతుంది. జీర్ణక్రియ యువకులలో, మధ్య వయసు వారిలో ఎక్కువ ఇబ్బంది పెట్టనప్పటికీ, 50 ఏళ్ల వయసు వచ్చిన వారు జీర్ణక్రియ సంబంధిత సమస్యలు ఎదుర్కొంటున్నారు. అందులో ప్రధానంగా జీర్ణాశయ క్యాన్సర్‌ను చెప్పవచ్చు.

సాధారణంగా మన శరీర జీర్ణ వ్యవస్థలో ఇబ్బంది ఎదురయితే, తీసుకున్న ఆహారపదార్థాలు జీర్ణం అవటం లేదని, గ్యాస్‌తో నిండిపోతుందని అనుకుని, ఆ దిశగా ఆలోచించి తాత్కాలిక ఉపశమనం కోసం డైజిన్ లాంటి మాత్రలు, గ్యాస్టిక్ ట్రబుల్ కోసం వివిధ రకాల పొడర్లు నీటిలో కలుపుకుని తాగుతాం. కానీ అసలు సమస్య ఏంటంటే, తరుచుగా కడుపులో ఇబ్బంది ఎదురవుతుందంటే అది క్యాన్సర్‌కు సూచకమని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

ఇన్‌ఫెక్షన్లు : చాలా వరకు జీర్ణ సంబంధిత సమస్యలు బ్యాక్టీరియా వల్ల ఇన్‌ఫెక్షన్లకు కారణం అవుతుంటాయి. ఒక్కోసారి జీర్ణాశయంలోని, పై పొరలు ఇన్‌ఫెక్షన్ల బారిన పడి క్యాన్సర్‌కు కారకమవుతాయని వైద్యులంటున్నారు. కానీ, ఇది ఇప్పటి వరకు శాస్త్రీయంగా రుజువు కాలేదు. హెచ్‌పైలోరీ ఇన్‌ఫెక్షన్లు ఉన్నవారిలో జీర్ణాశయంలో లింఫోమాలు వచ్చే అవకాశం ఉంటుంది. ఒక్కసారిగా జీర్ణాశయ క్యాన్సర్ రాదు. ఇది నెమ్మదిగా మొదలవుతుంది. జీర్ణాశయంలోని వివిధ ప్రాంతాల్లో వివిధ రకాలుగా క్యాన్సర్ లక్షణాలు కనిపిస్తాయి. క్యాన్సర్ కణాలు ఏ భాగంలో ఉన్నాయో, దాకి తగ్గట్టుగా ట్రీట్‌మెంట్ ఉంటుంది. జీర్ణాశయంలో క్యాన్సర్ కణాలు కార్డియా అనే భాగంలో ప్రారంభమవుతుంది. అవి జిఇ జంక్షన్ అనే ప్రాంతంలో అభివృద్ధి చెందుతాయి. ఒక్క జీర్ణాశయంలోనే కాకుండా దాని పక్కనున్న అవయవాలకూ వివిధ రకాలుగా క్యాన్సర్ విస్తరించే అవకాశం ఉంటుంది.

జీర్ణాశయ క్యాన్సర్లలో రకాలు

అడినోకార్సినోమా

జీర్ణాశయానికి వచ్చే క్యాన్సర్లలో 90 నుంచి 95 శాతం వరకు అడినోకార్సినోమా రకానికి చెందినవే. ఇలాంటి క్యాన్సర్ కణాలు జీర్ణాశయం లోపల అభివృద్ధి చెందుతాయి.

లింపోమా : జీర్ణాశయం గోడల్లో ఈ రకానికి చెందిన క్యాన్సర్ కణాలు కనిపిస్తాయి. జీర్ణాశయ క్యాన్సర్లలో 4 శాతం లింఫోమా రకానికి చెందినవి. అయితే వీటికి చికిత్స ఎలాంటి రకం లింఫోమా అనే దాన్ని బట్టి ఆధారపడి ఉంటుంది.

గ్యాస్ట్రో ఇన్‌టెస్టినల్ స్ట్రోమల్ ట్యూమర్

ఈ రకమైన కణతులు చాలా అరుదుగా వస్తుంటాయి. ఇవి కూడా ప్రాథమిక దశలో జీర్ణాశయ గోడలకు వచ్చే క్యాన్సర్ కణతులుగా చెప్పవచ్చు. ఆ తరువాత ఇవి జీర్ణాశయంలో ఇతర భాగాలకు వ్యాపిస్తాయి.

కార్సినోయిడ్ ట్యూమర్

జీర్ణాశయంలోని హార్మోన్లను తయారు చేసే కణాల వల్ల ఇలాంటి ట్యూమర్లు ఏర్పడతాయి. ఇవి జీర్ణాశయ క్యాన్సర్లలో 3 శాతం కార్సినోయిడ్ రకానికి చెందినవి ఉంటాయి. ఇవి ఇతర శరీర అవయవాలకు వ్యాపించవు.

లక్షణాలు

- ఆకలి లేకపోవటం
- బరువు తగ్గిపోవటం
- పొత్తికడుపులో నొప్పిరావటం
- కడుపు నిండిన భావన కలగటం
- తిన్న ఆహారపదార్థాలు రుచి అనిపించక పోవటం
- ఛాతీలో మంట రావటం
- వికారం, వాంతులు, కొన్ని సార్లు రక్తస్రావం
- కడుపుపై తడిమితే గడ్డల్లాంటివి తగులు తుంటాయి

చాలా మంది జీర్ణాశయంలో సమస్య అనగానే అజీర్ణం, కడుపు ఉబ్బరం లాంటివే గుర్తుకు వస్తాయి. కానీ ఇలాంటి లక్షణాలతోనే క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంటుందని చాలా మంది గుర్తించరు. ఒక్కోసారి క్యాన్సర్ కణతుల్లో రక్తస్రావం జరిగి రక్తం కూడా పేగుల్లోకి వెళ్లి జీర్ణం అవుతుంది. అందుకే మలం నల్లగా వస్తుంది. దీన్నే మెలీనా అంటారు. క్యాన్సర్ ముదిరితే పొట్టుబ్బటం, పొట్టలోకి నీరు చేరటం లాంటివి జరుగుతుంటాయి.



నిర్ధారణ : జీర్ణాశయంలో క్యాన్సర్‌ను నిర్ధారించాలంటే కొన్ని పరీక్షలు చేస్తే తెలుస్తుంది. ఎండోస్కోపి ద్వారా కూడా తెలుసుకోవచ్చు. తద్వారా జీర్ణాశయంలో ఉంది క్యాన్సరా, అల్సరా అనే విషయాన్ని నిర్ధారించుకోవచ్చు. క్యాన్సర్ అయితే ఏభాగంలో ఉందో, ఏభాగానికి పాకిందో తెలిసిపోతుంది. బయాప్సి పరీక్షల్లో కూడా క్యాన్సర్‌ను కనిపెట్టవచ్చు. సిటీస్కాన్‌గానీ, పెట్ సిటీస్కాన్ గానీ అవసరం అవుతుంది. వీటి ద్వారా క్యాన్సర్ కణతి జీర్ణాశయంలోనే ఉందా, అందులో నుంచి బయటకు వచ్చి ఇతర భాగాలకు పాకిందా అనేది తెలుసుకోవచ్చు. వీటన్నింటితో పాటు సిఇఎ పరీక్ష కూడా చేయించుకోవాలి.

నివారణ : జీర్ణాశయ క్యాన్సర్ రాకుండా నివారించుకోవాలంటే, మంచి ఆహార పదార్థాలతోనే సాధ్యం అవుతుంది. విటమినులు, ఖనిజ లవణాలు కలిగిన ఆహార పదార్థాలను తీసుకుంటే మంచిది. వీటితో పాటు పండ్లు, అన్ని రకాల ఆకు కూరలు, కాయ కూరలు తీసుకుంటే జీర్ణాశయ క్యాన్సర్ రాకుండా ఉంటుంది. అంతేకాదు మత్తుపానీయాలు, ధూమపానం లాంటి చెడు అలవాట్లను మానుకోవాలి. ఆహారాన్ని విడతల వారీగా తింటే జీర్ణాశయం ఆహారాన్ని జీర్ణం చేయటం సులువు అవుతుంది.

చికిత్స : ఒకప్పుడు జీర్ణాశయానికి క్యాన్సర్ వస్తే సర్జరీలు నొప్పితో కూడుకుని ఉండేవి. కానీ, వైద్య రంగంలో ఇప్పుడు టెక్నాలజీని విరివిగా వినియోగిస్తున్నారు. ప్రధానంగా జీర్ణాశయ క్యాన్సర్లకి సర్జరీ, కీమోథెరపీ, టార్గెటెడ్ థెరపీ, రెడియేషన్ థెరపీ లాంటి చికిత్స విధానాలు అవలంబిస్తున్నారు. జీర్ణాశయ క్యాన్సర్‌ను మొదటి దశలో గుర్తిస్తే చికిత్స సులభమవుతుంది. ఎండో స్కోపీ ద్వారా కూడ సర్జరీ చేయవచ్చు. దీన్ని ఎండోస్కోపీ ముంకోజిల్ డిసెక్షన్స్ అంటారు. కణతులు జీర్ణాశయంలో బాగా విస్తరించి ఉంటే జీర్ణాశయాన్ని మొత్తం తీసేయాల్సి ఉంటుంది.

దీన్ని టోటల్ గ్యాస్ట్రెక్టమీ అంటారు. జీర్ణాశయాన్ని మొత్తం తీసివేస్తే ఎలా ? అనే సందేహం అందరిలో వస్తుంది. జీర్ణక్రియ అంతా చిన్నప్రేగులోనే జరుగుతంది.

కాబట్టి ఇబ్బంది ఉండదు. సర్జరీల తరువాత కీమో థెరపీ, కీమో రేడియో థెరపీగానీ, ఇవ్వాల్సి వస్తుంది. కీమోథెరపీతో పాటు హరిసెప్టిన్ కూడా ఇవ్వటం జరగుతుంది. దీన్ని టార్గెటెడ్ థెరపీ అంటారు.

యాపిల్ సైడర్ వెనిగర్‌తో సైనస్‌కు చెక్

సైనస్ ఇన్ఫెక్షన్ లేదా సైనసైటిస్ అనేది ముక్కు పక్కన ఉండే సైనస్‌లలో వాపు, నొప్పి వల్ల ఏర్పడుతుంది. బాక్టీరియా కారక ఫ్లూయిడ్లు ఈ సైనస్‌లను మూసివేయడం వల్ల ముక్కు దిబ్బడ, నొప్పి కలుగుతుంది. దీనివల్ల ముఖం చుట్టూతా, ముక్కు, కండ్ల ప్రాంతంలో నొప్పి ఉండి తలనొప్పి వస్తుంది. ముక్కు దిబ్బడతో పాటు ముదురు పసుపురంగులో ఉండే తెమడ ముక్కునుంచి కారుతుంది. ఒక్కోసారి ఇది పెరిగిపోయి జ్వరం, దగ్గుకు దారితీస్తుంది. నేడు అనేక రకాల మందులు అందుబాటులోకి వచ్చినా అవి సరిగా పనిచేయకపోవడం, ఇతరత్రా సమస్యలు తలెత్తడం వంటివి వీటివల్ల ఏర్పడతాయి. అందుకే ఇంట్లోనే వంటింటి వస్తువులతో మందును తయారుచేసుకుంటే బాధే లేదు. దీనికి కావాల్సిందల్లా యాపిల్ సైడర్ వెనిగర్.



యాపిల్ సైడర్ వెనిగర్ అధికమొత్తంలో ఉండే విటమిన్లైన ఇ, ఎ, బి1, బి2, క్యాల్షియం, మెగ్నీషియం వంటివి సైనస్ ఇన్ఫెక్షన్‌ను దూరం చేస్తాయి. మ్యూకస్‌ను పల్చగా చేసి ముక్కురంధ్రాలు మూసుకుపోకుండా చేస్తుంది. దీన్లో అధికమొత్తంలో ఉండే ph స్థాయిలు మ్యూకస్‌ను విడగొట్టి శ్వాసనాళాలు తెరుచుకునేలా చేస్తాయి. యాసిడ్ లక్షణాలున్న యాపిల్ సైడర్ వెనిగర్ బ్యాక్టీరియా పెరుగుదలను అరికడుతుంది. యాంటీ ఫంగల్, యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు పుష్క లంగా ఉన్నందున బ్యాక్టీరి యాపై దాడి చేసి నశింపజేస్తుంది. ఇన్ఫెక్షన్ తిరగబెట్టే బ్యాక్టీరియాను పూర్తిగా నిర్మూలిస్తుంది.

ఎలా వాడాలి : ప్రతిరోజూ ఒక టేబుల్ స్పూన్ యాపిల్ సైడర్ వెనిగర్‌ను మూడుపూటలా తీసుకున్నట్లైతే సైనస్‌తో పాటు ఎలాంటి ఇన్ఫెక్షన్లు దరిచేరవు.

* పాలిచ్చే తల్లులు దీన్ని నేరుగా తీసుకోకపోవడం మంచిది.

స్టీమ్(ఆవిరి) : యాపిల్ సైడర్ వెనిగర్‌తో ఆవిరి పట్టడం వల్ల సైనస్‌తో బాధపడేవారు త్వరగా రిలీఫ్ పొందొచ్చు. అరకప్పు నీళ్లల్లో అరకప్పు యాపిల్‌సైడర్ వెనిగర్ వేసి ఆవిరిపట్టాలి. ఈ ఆవిరి శ్వాసనాళాలను శుభ్రపరిచి అక్కడ ఏర్పడిన బ్యాక్టీరియాను నాశనం చేస్తుంది. సైనస్‌నుంచి ఉపశమనం పొందడానికి సహజసిద్ధమైన ఈ పద్ధతి ప్రభావవంతంగా పనిచేస్తుంది.

రెండు టేబుల్‌స్పూన్ల యాపిల్ సైడర్ వెనిగర్, ఒక టేబుల్‌స్పూన్ తేనె, గోరువెచ్చటి నీళ్లలో కలిపి ప్రతిరోజూ తీసుకుంటే ఉపశమనంగా ఉంటుంది. సహజసిద్ధ యాంటీ బ్యాక్టీరియల్ అయిన తేనె రోగనిరోధక శక్తిని పెంచుతుంది. యాపిల్ సైడర్ వెనిగర్‌తో నాజల్ స్ప్రే తయారు చేసు కొని వాడవచ్చు. ఒక టేబుల్ స్పూన్ డిస్టిల్డ్ వాటర్‌లో ఐదు నుంచి ఆరు చుక్కల యాపిల్ సైడర్ వెనిగర్ వేసి స్ప్రేయర్‌లో పోసి వాడుకోవచ్చు. సైన స్‌తో ఇబ్బందిప డేవారు ఈ చిట్కాలు పాటించొచ్చు

* మంచినీళ్లు తరచూ తాగడం వల్ల గొంతులో పేరుకుపోయిన మ్యూక స్ తొలిగిపోతుంది.
* విటమిన్ ఎ అధికంగా ఉన్న ఆహారం తీసుకోవడం వల్ల రోగనిరోధకశక్తి పెరుగుతుంది, ఇది సైనస్‌తో పోరాడేందుకు ఉపయోగ పడుతుంది.
* సైనస్ వేధిస్తుంటే ఆల్కహాల్ తీసుకోవడం మానేయాలి.
* ముక్కురంధ్రాలు పొడిబారకుండా చూసుకోవాలి.
* త్వరగా కోలుకోవాలంటే విశ్రాంతి తీసుకోవడం మరవొద్దు.

కొత్తిమీర జ్యూస్‌తో రక్తపోటు నియంత్రణ

కొత్తిమీరలో ఔషధ గుణాలకు కొదువే లేదు. వంటింట్లో దీని ప్రాముఖ్యత అంతా ఇంతా కాదు. దీన్ని వంటకాల్లో వేస్తే కొత్త రుచి వచ్చి తీరాల్సిందే. కేవలం మన దేశంలోనే కాక చైనా, రోమన్ ఇంకా పలు దేశాల్లో కొత్తిమీర విరివిగా ఉపయోగిస్తారు. ఇది క్యారెట్ కుటుంబానికి చెందింది. దీనిలో ప్రోటీన్లు, మినరల్స్, కార్బోహైడ్రేట్లు, పీచు పదార్థాలు ఉంటాయి. దీన్ని వంటకాల్లోనే కాక చర్మ సౌందర్యానికి కూడా వాడుతుంటారు. కొత్తిమీరనే కాక ధనియా గింజలల్లో కూడా పుష్కలంగా ఔషధ గుణాలున్నాయి. చాలా కూరల్లో ధనియాల పొడిని సువాసన, రుచి కోసం వినియోగిస్తుంటారు. కొత్తిమీర జీర్ణశక్తిని వృద్ధి చేస్తుంది. కొత్తిమీర రసం, అల్లం రసం సమపాళ్లలో కలిపి తీసుకుంటే రక్తహీనత తగ్గుతుంది. కడుపులో ఉబ్బరంగా ఉన్నప్పుడు కొత్తిమీర, అల్లం రసం గ్లాసు నీళ్లలో కలిపి తాగితే కుడపు ఉబ్బరం తగ్గుతుంది. అలాగే కొత్తిమీరలో వొలాటైన్ ఆయిల్ కడుపునొప్పి, తలనొప్పి, మానసిక అలసటను, ఒత్తిడిని తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఎముకలు బలంగా ఉంచే విటమిన్ 'కె' దీనిలో పుష్కలంగా ఉంటుంది.కొత్తిమీరలోని యాంటీ ఆక్సిడెంట్లు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి.హై కొలెస్ట్రాల్‌ను తగ్గిసాయి. శరీరంలోని కొవ్వు పదార్థాలను సమన్వయం చేస్తుంది. కొత్తిమీర ఆకులు హానికరమైన కొవ్వు పదార్థాలను తగ్గించి, ఆరోగ్యకరమైన కొవ్వు పదార్థాల స్థాయిని పెంచుతుంది. హై బి.పి కూడా కొత్తిమీర నియంత్రిస్తుంది. కొత్తిమీర జ్యూస్‌ను రోజుకు ఒకసారి తాగితే బి.పి కంట్రోల్‌లో ఉంటుంది. అలాగే ఎక్కువగా యాంటీ ఆక్సిడెంట్స్‌లను కలిగి ఉండటము వల్ల కంటికి సంబంధించిన వ్యాధులు రాకుండా కొత్తిమీర ఆపుతుంది.





గ్యాస్‌ను నివారిస్తుంది

వివిధ రకాల రుచుల కోసం కొందరు ఇష్టం వచ్చినట్టు తింటుంటారు. దీని వల్ల దాదాపు 40 శాతం మంది ఇరిటబుల్ బొవెల్ సింద్రోమ్‌తో బాధపడుతున్నారని అంచనా. ఇది విపరీతమైన కడుపునొప్పికి దారితీస్తుంది. ప్రతి రోజూ కప్పుకు తగ్గకుండా పెరుగు తినడం వల్ల ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుంది. పెరుగులో శరీరానికి మేలు చేసే లాక్టోబాసిల్లస్ అడిడోఫిలస్, లాక్టో కోకస్ లాక్టిస్ అనే బాక్టీరియా ఉందని నిపుణులు చెబుతున్నారు. పొట్ట ఉబ్బరాన్ని, కడుపు నొప్పిని తగ్గించేందుకు ఈ బాక్టీరియా కీలక పాత్ర పోషిస్తుంది.

అతిసారకు హోమియో చికిత్స

వర్షాకాలంలో సాధారణంగా అతిసార కలుషిత నీరు ద్వారా ఎక్కువగా ప్రబలుతుంది. ఈ వ్యాధికి గురైన వారికి ఉన్నట్లుండి వాంతులు, విరేచనాలు అవుతాయి. కొందరిలో జ్వరం రావడం, విపరీతమైన కడుపు నొప్పి, నోరు ఎండిపోవడం, కాళ్లు లాగడం వంటి లక్షణాలు ఉంటాయి. ఈ వ్యాధిలో ముందుగా వాంతులు, విరేచనాలు త్వరగా తగ్గించడానికి మందులు వాడాలి.

వ్యాధి లక్షణాలు :

- విరేచనాలు, వాంతులు ఉన్నట్లుండి ఒకేసారి పెద్ద మొత్తంలో అవుతాయి.
- తద్వారా శరీరంలోని నీటి శాతం తగ్గిపోయి డీహైడ్రేషన్ స్థితి ఏర్పడుతుంది.
- ఇలాంటి స్థితిలో చర్మాన్ని పైకి లాగి వదిలితే అలాగే ఉండిపోతుంది.
- వృద్ధుల్లో చర్మం ముడతలు పడి ఉంటుంది.
- కళ్లు గుంటల్లాగా ఉండటంతోపాటు చాలా నీరసంగా ఉంటుంది.
- అతిసార వ్యాధి తీవ్రత బాగా ఎక్కువగా ఉన్నప్పుడు నాడి వేగంగా ఉంటుంది.
- కొన్ని సందర్భాల్లో నాడి తెలియకుండా ఉంటుంది.
- రక్తపోటు తగ్గిపోతుంది. రక్తపోటు నమోదు చేయలేని స్థితికి కూడా జారిపోతుంది.
- శరీరం చల్లబడి రోగి అపస్మారక స్థితిలో ఉండి, కోమాలోకి వెళ్లిపోయి మరణం సంభవిస్తుంది.

నివారణ :

- అతిసార వ్యాధి వల్ల శరీరం నీటిని, లవణాలను అత్యధికంగా కోల్పోతుంది. కనుక ఈ వ్యాధికి గురైన రోగికి వెంటనే ద్రవపదార్థాలు ఇవ్వాలి.
- కొబ్బరి నీరు, మంచినీరు, మజ్జిగ మొదలైనవి ప్రారంభం నుంచి ఇవ్వాలి.
- డీహైడ్రేషన్ నివారణకు కాచి చల్లార్చిన ఒక గ్లాసు నీటిలో రెండు స్పూన్ల పంచదార, చిటికెడు ఉప్పు కలిపి ఇవ్వాలి. లేదా ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్ ఇవ్వాలి.



- అతిసార వ్యాధికి గురైన వ్యక్తి నోటితో ద్రవ పదార్థాలు తీసుకోగలిగినంత వరకు సెలైన్ అవసరం రాదు.
- నోటితో ఏమీ తీసుకోలేని స్థితిలో ఇంట్రావీనస్ ద్వారా సెలైన్‌ను డాక్టర్ల సమక్షంలో ఇవ్వవలసి ఉంటుంది.

మందుల రకాలు

హోమియో మందులను లక్షణాల ఆధారంగా వాడాల్సి ఉంటుంది.

పోడోఫైలం: నీళ్ల విరోచనాలు అధికంగా అవుతాయి, విరేచనం కడుపు నొప్పి లేకుండా ఉంటుంది. కొద్దిపాటి ఆహారం తీసుకొన్నా విరేచనం మాత్రం పెద్దగా అవుతుంది

ఆర్సినిక్ ఆల్బ్: విరేచనం వాంతులతో పాటు పొట్టలో నొప్పి ఉండును. విరేచనం నలుపు రంగు లేదా ముదురు ఆకుపచ్చ రంగులో ఉండును విరేచనం, వాంతులు అనంతరం రోగి తీవ్రమైన నిస్త్రానకు గురికావటం ఈ మందులో ముఖ్య లక్షణం

కాంఫర్: అతిసార తీవ్రత వలన రోగి శరీరం చల్లబడి పోతుంది. మలవిసర్జన తెలియకుండ ఆకస్మికంగా అవుతుంది విరేచనం గంజి నీళ్లలాగా ఉంటుంది.

వెరాట్రం ఆల్బం: విరేచనం ఆకుపచ్చగా నల్లగా, బియ్యం కడిగిన నీళ్లలాగా ఉంటుంది. డీ హైడ్రేషన్ వలన రోగి శరీరం ముడుతలు పడి చల్లగా అవుతుంది.

చైనా: తిన్న పదార్థాలు జీర్ణం కాకుండా విరేచనంలో కనిపించును. దుర్వాసనతో పెద్ద పెద్ద నీళ్ళ విరేచనాలు అవుతుంటాయి

ఇపికాక్: విరోచనాలు, వాంతులు ఎక్కువగా ఉండును. వాంతి వచ్చినట్లుగా ఉండి రోగి ఏమి తాగటానికి తినడానికి ఇష్ట పడడు. ఈ మందులతో పాటుమరికొన్ని మందులు నక్స్‌వామిక; మెర్క్ సాల్. నైట్రంసల్ఫ్; పాస్ప రస్ వంటి మందు లను లక్షణ ముదాయాననుసరించి వాడిన చో అతి సార వ్యాధి నివారణ జరుగును.



డాక్టర్ పావుశెట్టి శ్రీధర్
హోమియోఫిజీషియన్
హన్మకొండ, వరంగల్ జిల్లా

'రెండాకుల'గుర్తు పై నా వాదన వినండి : దినకరన్



న్యూఢిల్లీ : తమ పార్టీ ఎన్నికల గుర్తు 'రెండాకుల'పై నిర్ణయం తీసుకునే ముందు తన వాదన వినాలని తమిళనాడులోని అన్నాడిఎంకె ఉప ప్రధాన కార్యదర్శి టిటివి దినకరన్ మంగళవారం ఎన్నికల సంఘాన్ని (ఇసి) కోరారు. సిఎం పళనిస్వామి, మాజీ సిఎం పన్నీర్ సెల్వం సారధులుగా వ్యవహరించిన పార్టీలోని రెండు వైరి వర్గాలు ఒక్కటైన కొద్ది రోజులకే ఆయన ఇసిని ఆశ్రయించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. మరోవైపు ప్రస్తుతం బెంగళూరు జైలులో ఉన్న పార్టీ ప్రధాన కార్యదర్శి శశికళతో పాటు దినకరన్‌కు పార్టీ వ్యవహారాలతో ఎలాంటి సంబంధం లేదని పళని, పన్నీర్ స్పష్టం చేస్తున్నారు. దినకరన్‌కు మద్దతిస్తున్న పార్టీ కర్నాటక రాష్ట్ర అధ్యక్షుడు పుగళెంధి మాట్లాడుతూ...ఎన్నికల గుర్తు విషయమై ఇసికి ఒక మెమొరాండమ్‌ను సమర్పించామని ఆయన చెప్పారు. ఈ కేసులో శశికళ ప్రధాన ప్రతివాది అయినందు వల్ల గుర్తుపై తుది నిర్ణయం తీసుకునే ముందు ఆమెతో పాటు దినకరన్ వాదనను కూడా పరిగణనలోకి తీసుకోవావాలని కోరినట్లు ఆయన చెప్పారు. కాగా, మాజీ సిఎం, పార్టీ అధినేత్రి జయలలిత మరణం తర్వాత ఆమె ప్రాతినిధ్యం వహించిన ఆర్‌కె నగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలో అన్నాడిఎంకె రెండు వైరి వర్గాలు రెండాకుల గుర్తును వినియోగించకుండా ఈ ఏడాది మార్చిలో ఇసి మధ్యంతర ఉత్తర్వును జారీ చేసిన సంగతి తెలిసిందే



ఫ్లయింగ్ ట్రైనింగ్ ప్రారంభం

మన తెలంగాణ/హైదరాబాద్ : ఎయిర్‌వింగ్ కేడెట్స్ కోసం ఫ్లయింగ్ ట్రైనింగ్ ఐదు సంవత్సరాల తర్వాత వరంగల్‌లో నేషనల్ కేడెట్స్ కార్ప్స్ (ఎన్‌సిసి) గ్రూప్ హెడ్ క్వార్టర్స్ తిరిగి ప్రారంభించింది. మంగళవారం ఉదయం హైదరాబాద్‌లోని నాదర్‌గుల్ ఎయిర్‌ఫీల్డ్ నుండి బయలుదేరిన రెండు సీట్ల మైక్రోలైట్ ఎయిర్‌క్రాఫ్ట్ జెన్ ఎయిర్ సిహెచ్ 701 వరంగల్ మామునూరులో ల్యాండ్ అయింది. ఫ్లయింగ్ ట్రైనింగ్‌ను తిరిగి ప్రారంభించడంలో వరంగల్ గ్రూప్ కమాండర్ నేతృత్వంలో కమాండింగ్ ఆఫీసర్ 4 (టి) ఎయిర్ స్క్వార్డాన్ అతని బృందం ప్రధాన పాత్ర పోషించారు. మొత్తం 700 మంది ఎయిర్ వింగ్ కేడెట్స్‌లలో ఎక్కువ మంది జూనియర్ డివిజన్‌కు చెందిన వారుండగా, 200 మంది సీనియర్ డివిజన్‌కు చెందినవారున్నారు. ప్రారంభోత్సవం సందర్భంగా గ్రూప్ కమాండర్ మాట్లాడుతూ, శిక్షణలో అభ్యర్థులు ఇంజిన్, ఏవియానిక్స్, ఎయిర్‌ఫ్రేమ్, చెక్స్, ప్రొసీజర్ వంటి ప్రాథమిక అంశాల్లో థియరీతో పాటు ప్రయోగాత్మకంగా నేర్చుకుంటారని తెలిపారు. వీరి శిక్షణ కోసం ప్రభుత్వం 2015లో స్లోవేనియన్ లైట్ ఎయిర్‌క్రాఫ్ట్‌ల తయారీ సంస్థ పిపిస్ట్రెల్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు 2018లో వరంగల్ ఎయిర్ యూనిట్ కేటాయించబడుతుంది. ఫ్లయింగ్ శిక్షణలో పాఠ్య ప్రణాళికలో భాగంగా సెప్టెంబర్ 12 నుంచి సెప్టెంబర్ 21వ తేదీ వరకు వరంగల్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఇంటర్ గ్రూప్ ఎయిర్ వింగ్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో డ్రిల్, స్కీట్ షూటింగ 22 (పాయింట్ 22) రైఫిల్ షూటింగ్, లైన్ అండ్ టెంట్ ఏరియా, ఎయిరో మోడలింగ్, ఆరోగ్యం, పారిశుధ్యం, ఫ్లయింగ్ విభాగాల్లో పోటీలను నిర్వహిస్తారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ డైరెక్టరేట్ ఎయిర్ కమాండర్ పి.మహేశ్వర్ మాట్లాడుతూ, ఎన్‌సిసి కేవలం పట్టణాల్లోనే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లోనూ శిక్షణ ఇవ్వనుందన్నారు. ఇందుకోసం వరంగల్ గ్రూప్ ఎన్‌సిసి కేడెట్ల్ కోసం శిక్షణ కేంద్రం నిర్వహించేందుకు మామునూరు ఎయిర్‌ఫీల్డ్‌లో 10 ఎకరాలను సేకరించిందన్నారు.

మచ్చపడుతుందని మౌనంగా వున్నాం

15 ఏళ్ల న్యాయపోరాటానికి ఫలితం

కురుక్షేత్ర: డేరా సచ్చా సౌదా చీఫ్ గుర్మీత్ రామ్ రహీం సింగ్ తన మహిళా శిష్య గణంపై అత్యాచారాలు చేసినప్పటికీ అది తమ సముదాయంలో మచ్చ తెస్తుందని చాలా మంది మౌనంగా ఉండిపోయారని బాధితురాలు తెలిపింది. దైవ సమానుడిగా కోట్లాది జన నీరాజనాలందుకునే గుర్మీత్ అత్యాచారాలను బాధితురాలు సాధ్వి వెలుగులోకి తెచ్చింది. కానీ బాధితురాలు, ఆమె కుటుంబం 12 ఏండ్లుగా ఎన్నో బెదిరింపులు, మానసిక వేదనలు, ఒత్తిడులకు గురయ్యారు. ఆమె సోదరుడిని కూడా గుర్మీత్ అనుచరగణం చంపేసింది. ఇప్పుడు డేరా బాబా గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ కటకటాల వెనుకున్నాడు. అతడికి కోర్టు 20 ఏళ్ల కారాగార శిక్ష విధించింది. దీంతో కురుక్షేత్రకు 10 కిమీ. దూరంలో జిటి రోడ్డులో నివసిస్తున్న బాధితురాలి కుటుంబం ఆనందాన్ని వ్యక్తం చేసింది. సాధ్వి సోదరుడి హత్య కేసులో కూడా తీర్పు కోసం వారు ఎదురుచూస్తున్నారు. బాబా సత్నాం సింగ్ కాలం నుంచి బాధితురాలి కుటుంబం డేరాతో 40 ఏళ్లుగా అనుబంధాన్ని కలిగి ఉంది. డేరా నడిపే పాఠశాలలో సాధ్వి ఉపాధ్యాయురాలిగా పనిచేస్తుండేది. కానీ డేరా బాబా అసలు రంగు ఆమెకు 1999లో తెలిసొచ్చింది. మహిళా శిష్యురాళ్లను గుఫా(గుహ) వద్ద కాపలాగా నియుక్తించి డేరా బాబా వారిపై అత్యాచారం చేసేవాడని సాధ్వి వెల్లడించింది. ఒకసారి గుఫా నుంచి కొందరు బాలికలు ఏడుస్తూ రావడాన్ని ఆమె గుర్తించింది. తర్వాత ఆమెపై కూడా కన్నేసిన బాబా సాధ్విపై కూడా అత్యాచారం చేశాడు. ఈ విషయాన్ని ఆమె తన కుటుంబ సభ్యులకు తెలుపగా వారంతా 2001లో డేరాను వదిలేసి తమ ఊరికి వెళ్లారు. అయితే సాధ్వి2002లో ఆకాశరామన్న ఉత్తరం ద్వారా వివరాలను వెలుగులోకి తెచ్చింది. ఆమె లేఖను తీవ్రంగా పరగణించిన ఉన్నత న్యాయస్థానం సిర్సా జిల్లా సెషన్స్ జడ్జి ద్వారా ప్రాథమిక విచారణ జరిపించి, ఆయన సూచన మేరకు కేసు దర్యాప్తు బాధ్యతను కేంద్ర దర్యాప్తు సంఘం(సిబిఐ)కు అప్పగించింది. బాధితురాలి వాంగ్మూలాన్ని సిబిఐ రికార్డు చేసింది. కేసు దర్యాప్తు ఓ కొలిక్కి రావడంతో గుర్మీత్‌కు 20 ఏళ్ల శిక్ష పడింది. దీంతో యావద్దేశం విస్తుపోయింది.

సోదరుడి హత్య కేసులో తీర్పుకై నిరీక్షణ

డేరా బాబా మనుషులు బాధితురాలు సాధ్వి సోదరుడిని 2002లో కాల్చి చంపేశారు. ప్రధానికి, పంజాబ్–హర్యానా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి అత్యాచారాలపై రాసిన ఆకాశరామన్న లేఖలు ఆమె రాసి ఉంటుందన్న అనుమానంతో ఆమె సోదరుడిని కాల్చి చంపేశారు. ఎంతో శక్తిమంతుడైన డేరా బాబాపై కోర్టు ఇచ్చిన తీర్పుపై బాధితురాలి కుటుంబ సభ్యులు సంతృప్తిని వ్యక్తం చేశారు. అయితే బాధితురాలి సోదరుడి కేసు తీర్పు కోసం వారు ఎదురుచూస్తున్నారు. అంతేకాక ఆమె ఆకాశరామన్న ఉత్తరాన్ని ప్రచురించిన సిర్సాకు చెందిన పాత్రికేయుడు రామ్ చందర్ ఛత్రపతి హత్య కేసు తీర్పు కోసం కూడా ఎదురుచూస్తున్నట్లు వారు తెలిపారు. 2002 నుంచి ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా అడ్డంకులే సృష్టించింది. దాంతో బాబా అన్నింటినీ తనకనుకూలంగా మార్చుకునే సమర్థుడని బాధితురాలి కుటుంబం ఓ నిర్ణయానికి వచ్చేసింది. కానీ భారత న్యాయస్థానంపై వారికి ఉన్న నమ్మకం సడలలేదు. చివరికి న్యాయమే గెలుస్తుందన్న వారి విశ్వాసం కార్యరూపం దాల్చింది. ప్రస్తుతం బాధితురాలి కుటుంబానికి ఆమె గ్రామంలోనే పోలీసులు రక్షణ కల్పించారు.



అన్నం ముట్టని డేరా బాబా

పాలు, నీళ్లతో సరి

రోహ్‌తక్ : 2002 నాటి రెండు అత్యాచార కేసుల్లో 20 ఏళ్ల జైలుశిక్షకు గురై ప్రస్తుతమిక్కడ సునారియా జైలులో ఉన్న డేరా సచ్చా సౌదా చీఫ్ గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ సోమవారం రాత్రి ఆహారం ముట్టలేదని, నీళ్లతో సరిపెట్టుకున్నారని, మంగళవారం ఉదయం కూడా పాలు మాత్రమే సేవించారని జైలు అధికారి ఒకరు తెలిపారు. బాబా జైలులో ఎవరితోనూ మాట్లాడకుండా అటూ ఇటూ తిరుగుతూ కన్పించారని ఆయన చెప్పారు. జైలులో మంజూరు చేసిన గది (అప్రూవల్ సెల్)లో ఆయన్ను ఉంచినట్లు సదరు అధికారి తెలిపారు. కాగా, తన ఇద్దరి శిష్యురాళ్ల (సాధ్విలు)పై అత్యాచారం చేసినందుకు డేరా బాబాకి సిబిఐ ప్రత్యేక న్యాయమూర్తి జగ్‌దీప్ సింగ్ సోమవారం 20 ఏళ్ల కఠిన కారాగారశిక్షతో పాటు రూ.30 లక్షల జరిమానా కూడా విధిస్తూ 9 పేజీల తీర్పును వెలువరిచిన సంగతి తెలిసిందే. తీర్పు సందర్భంగా బాబా వన్య మృగం లాగా ప్రవర్తించారని ఆయన వ్యాఖ్యానించారు. తీర్పు వెలువడగానే బాబా కుప్పకూలిపోయారని న్యాయవాది చెప్పారు.

ఖాళీ అవుతున్న డేరా

భద్రతా కారణాల రీత్యా డేరా సచ్ఛా సౌధా పాత ప్రధాన కార్యాలయ ప్రాంగణం నుంచి బాబా అనుచరులను భద్రతా బలగాలు, సైనికులు ఖాళీ చేయిస్తున్నారు. సిర్సాలోని కొత్త ప్రధాన కార్యాలయంలో దాదాపు 200 మంది అనుచరులను కూడా ఖాళీ చేయించే పనిలో ఉన్నారు. గత రెండు రోజులుగా సిర్సాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదని అధికారులు పేర్కొన్నారు. బాబాకు శిక్ష ఖరారు చేయడానికి ముందు ఇంటర్నెట్ సర్వీసులను రద్దు చేయగా, ప్రస్తుతం పునరుద్ధరించినట్టు వారు తెలిపారు.

ఆశల వర్షం!

(మొదటిపేజీ తరువాయి)

కామారెడ్డిలోని పోచారం, సింగితం, కళ్యాణి ప్రాజెక్టులలోకి నీరు వచ్చి చేరుతోంది. ఈ రెండు జిల్లాలకు ముఖ్యమైన నిజాంసాగర్‌లో మాత్రం ఆశించిన స్థాయిలో నీరు చేరడం లేదు. ఎస్‌ఆర్‌ఎస్‌పి ప్రాజెక్టు లక్ష్మీ కెనల్‌కు నీటిని విడుదల చేయాలని ఆ ప్రాంత రైతులు కోరుతున్నారు. మంచిర్యాల జిల్లాలో వాగులు, వంకలు పొంగి పోర్లుతున్నాయి. బెజ్జూరు మండలంలోని కుశ్నపల్లి వాగు ఉప్పొంగడంతో కొన్ని గ్రామలకు రాకపోకలు నిలిచిపోయాయి. భారీ వర్షాలతో వందలాది ఎకరాల్లో వరినారు మళ్ల నీట మునిగాయి. మహబూబ్‌నగర్‌లో అత్యధికంగా సాగవుతనన మొక్కజొన్న, జొన్న పంటలకు ఈ వర్షాలు ఊపిరి పోసాయి. కర్నాటకలో కురుస్తున్న వర్షాల కారణంగా సంగారెడ్డి జిల్లాలోని సింగూరు ప్రాజెక్టు వరద నీటితో నిండుతోంది. సిద్దిపేట, మెదక్ జిల్లాలోనూ చెరువులు జలకళను సంతరించుకుంటున్నాయి. ఘన్‌పూర్ ప్రాజెక్టుకు నీరు వచ్చి చేరుతోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తాలిపేరు, కిన్నెరసాని ప్రాజెక్టులలో నీటిమట్టం పెరిగింది. మిగతా జిల్లాలతో చూస్తే ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో వర్షాలు తగిన స్థాయిలో పడటం లేదు. కేవలం జగిత్యాల్ జిల్లాలోనే సాధారణ వర్షపాతం నమోదైంది. పెద్దపల్లి, కరీంనగర్, రాజన్న జిల్లాలలో ఇంకా లోటు వర్షపాతమే ఉండటం గమనార్హం. యాదాద్రి జిల్లాలోనూ సాధారణ వర్షం కురిసింది. సూర్యాపేట జిల్లాలో 4 మండలాల్లో, నల్లగొండ జిల్లాలో 6మండలాల్లో జల్లులు పడ్డాయి. నాగర్జున్ సాగర్‌లో నీరు లేకపోవడంతో అక్కడి ఆయకట్టు ప్రాంత రైతులు భారీ వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు.

అధిక వర్షపాతం నమోదైన ప్రాంతాలివే : దామరగిద్ద 7 సెం.మీ, మహబూబ్ నగర్ 6 సెం.మీ, జడ్చర్ల 6 సెం.మీ, ఖమ్మం కోహెడ 6 సెం.మీ,మక్తల్ 5 సెం.మీ, కామారెడ్డి జిల్లా రుద్రూర్‌లో 5 సెం.మీ, ఉమ్మడి మహబూబ్ నగర్ మాగనూర్, నారాయణపేటలలో 5 సెం.మీ, ఉట్నూర్, ఎల్లారెడ్డిలలో 4 సెం.మీలు, ఉమ్మడి వరంగల్ జిల్లా మోగులపల్లెలో 4 సెం.మీ, రంగారెడ్డి గండీడ్ 4 సెం.మీల వర్షపాతం నమోదైంది. మిగతా చోట్ల 3 సెం.మీల నుంచి 1 సెం.మీ వరకు వర్షపాతం నమోదైంది.

పోస్టుల భర్తీకి సన్నాహాలు

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నారు. అదే విధంగా మైనారిటీ కమిషన్‌లో చైర్మన్, ఒక వైస్ చైర్మన్, ఐదుగురు సభ్యుల నియామకం చేయనున్నారు. ఎస్‌సి, ఎస్‌టి కమిషన్‌లో చైర్మన్‌తో పాటు ఐదుగురు సభ్యులను నియమించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. సమాచార హక్కు కమిషన్ చీఫ్ కమిషనర్‌తో పాటు కమిషనర్లను నియమించేందుకు ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించాల్సి ఉంటుంది. ఈ సమావేశంలో సిఎంతో పాటు ప్రధాన ప్రతిపక్ష నేత, సిఎం నామినేట్ చేసిన మంత్రి పాల్గొని ఏకాభిప్రాయంతో నిర్ణయం తీసుకుని రాష్ట్ర గవర్నర్‌కు పేర్లను సిఫారసు చేస్తారు. గతానుభవాలను పరిగణనలోకి తీసుకుని రాజకీయాలతో సంబంధం లేని వ్యక్తులనే నియమించాలనే యోచనలో ఉన్నారు. సమాచార హక్కు కమిషన్‌లో కమిషనర్ల సంఖ్యను ఆరు నుంచి 9కి పెంచే అవకాశాలున్నట్లు తెలిసింది. ఎస్‌సి, ఎస్‌టి అభివృద్ధి నిధి చట్టం తెచ్చినందున ఎస్‌సి, ఎస్‌టి కమిషన్‌లో సభ్యులను నిర్ణయించాలని సిఎం నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. ఉమ్మడి రాష్ట్రంలో ఏర్పాటు చేసిన మైనారిటీ కమిషన్ రెండు రాష్ట్రాలలో కొనసాగుతున్నది. ఈ కమిషన్‌లో కూడా ఖాళీలను భర్తీ చేయనున్నారు. రాష్ట్ర మహిళా కమిషన్, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌లో ఖాళీల భర్తీపై స్పష్టత రావాల్సి ఉంది.నేడో రేపో ఎస్‌సి, ఎస్‌టి అభివృద్ధి నిధి చట్టానికి మార్గదర్శకాలు : ఎస్‌సి, ఎస్‌టి వర్గాలను ఆర్థికంగా పురోభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం సబ్‌ప్లాన్ స్థానంలో అభివృద్ధి నిధి చట్టాన్ని తీసుకువచ్చిన విషయం తెలిసిందే. నిధుల వ్యయంపై అధికారులను బాధ్యులను చేయడంతో పాటు సక్రమంగా పంపిణీ అయ్యేందుకు చట్టాన్ని తెచ్చారు. దీన్ని పటిష్టంగా అమలుపరిచేందుకు రూపొందించిన మార్గదర్శకాలకు సిఎం కెసిఆర్ ఆమోదం తెలిపారు. నేడో రేపో మార్గదర్శకాలపై ఉత్తర్వులు జారీ చేయనున్నారు.

గ్రీన్ ట్రిబ్యునల్ విచారణ

(మొదటిపేజీ తరువాయి)

అభ్యంతరం తెలిపిన తెలంగాణ ప్రభుత్వం న్యాయవారి ఈ ఫోటోలు ఎప్పుడు, ఎక్కడ తీసారన్నది పరిశీలించాల్సి ఉందని ట్రిబ్యునల్ కు తెలిపారు.ఇందుకోసం కొంత సమయం కావాలని ట్రిబ్యునల్ ని తెలంగాణ తరుపు న్యాయవాది కోరారు. దీనికి అంగీకరించిన నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్, తదుపరి విచారణ సెప్టెంబరు 6కు వాయిదా వేసింది. తదుపరి విచారణ కు పూర్తి సమాచారంతో రావాలని ఇరుపక్షాలకు గ్రీన్ ట్రిబ్యునల్ అదేశాలు జారీ చేసింది.మంగళవారం జరిగిన విచారణకు తెలంగాణ ఏఏజి రామ్ చందర్ రావు, తెలంగాణ ప్రభుత్వ తరుపు న్యాయవాది వెంకట్ రెడ్డిలు హాజరయ్యారు.

దేనికి ఎంత నీరు?

(మొదటిపేజీ తరువాయి)

విద్యుత్ ఉత్పత్తి కేంద్రానికి ఎన్ని నీళ్లు కావాలో లెక్కలు వేసి, వాటి వినియోగానికి సంబంధించి పవర్ ఫ్రంట్ ఆఫ్ తెలంగాణను ఏర్పాటు చేయాలని కోరారు. వ్యవసాయ భూముల రికార్డుల ప్రక్షాళన కార్యక్రమాన్ని ఉన్నత స్థాయిలో పర్యవేక్షించేందుకు ప్రత్యేక విభాగాన్ని నెలకొల్పాలని సిఎం నిర్ణయించారు. మండలానికో రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడానికి, రెవెన్యూ కార్యాలయాల్లో ఐటి అధికారుల నియామకానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వ్యవసాయం, నీటి పారుదల, మిషన్ భగీరథ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సంయుక్త సమావేశాన్ని సిఎం కెసిఆర్ మంగళవారం ప్రగతి భవన్‌లో నిర్వహించారు. వ్యవసాయ శాఖకు వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ప్రత్యేకమైన బడ్జెట్ రూపొందిస్తున్నాం. దీనికి సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇతర అధికారులతో సమావేశం నిర్వహించి విధి విధానాలను ఖరారు చేయాలని చెప్పారు.

ఈ సమీక్షలో గోదావరి, కృష్ణా నదుల ద్వారా అందుబాటులోకి వచ్చే జలాలను మంచినీరు, సాగునీరు, విద్యుత్, పారిశ్రామిక అవసరాల కోసం వాడుకునే అంశంపై సిఎం చర్చించారు.

ఆపరేషన్ మాన్యువల్స్ రూపొందించాలి : గోదావరి, కృష్ణ నదులపై అనేక ప్రాజెక్టులు కడుతున్నాం. ఈ రెండు నదుల నీటితో రైతులకు సాగునీరు అందించడంతో పాటు మంచినీరు, పరిశ్రమలకు నీరు, విద్యుత్ ఉత్పత్తికి నీరు సరఫరా చేస్తున్నాం. ఈ నేపథ్యంలో తెలంగాణలోని ప్రాజెక్టుల వారీగా కొత్త ఆపరేషన్ మ్యాన్యువల్స్ తయారు చేయాలి. ప్రాజెక్టు నుంచి సాగునీరు ఎంతివ్వాలి? మంచినీరు ఎంతివ్వాలి? విద్యుత్ కేంద్రాలకు ఎంత నీరు ఇవ్వాలి?, పరిశ్రమలకు ఎంతివ్వాలి? అనే విషయాలపై స్పష్టత ఉండాలి. ప్రాజెక్టుల్లో నీరు చేరిన దాన్ని బట్టి కూడా ప్రాధాన్యతలను నిర్ణయించి నీటి విడదల జరపాలి.

దీనికోసం ప్రత్యేక విధానం అమలు చేయాలి. మిషన్ భగీరథ అధికారులు కూడా ఏ ప్రాజెక్టు నుంచి ఎన్ని నీళ్లు తీసుకుంటున్నాము? ఏ ఏ ప్రాంతాలకు ఎక్కడి నుంచి నీరు సరఫరా చేస్తున్నాము? అనే విషయాలను పరిగణలోకి తీసుకోవాలి. సాగునీటి ప్రాజెక్టుల నుంచి వాడుకునే నీటికి సంబంధించి ఎప్పటికప్పుడు పరిస్థితిని బట్టి వ్యవహరించేందుకు డ్రింకింగ్ వాటర్ ఫ్రంట్ ఫర్ తెలంగాణ, పవర్ ఫ్రంట్ ఆఫ్ తెలంగాణను కూడా ఏర్పాటు చేయాలి. ఏ ప్రాజెక్టు నుంచి ఏ విద్యుత్ కేంద్రానికి ఎన్ని నీళ్లు కావాలి? అవి ఎలా పొందాలనే దానిపై స్పష్టమైన అంచనాకు రావాలి. పరిశ్రమలకు కూడా ఇదే విధమైన ఏర్పాటుండాలి అని సిఎం చెప్పారు.

నీటి పారుదల, మిషన్ భగీరథ, విద్యుత్ పరిశ్రమల శాఖల అధికారులు సంయుక్త సమావేశం ఏర్పాటు చేసుకొనిఅవగాహనకు రావాలని సిఎం ఆదేశించారు. ప్రాజెక్టుల నీటిలో 10 శాతం నీటిని మంచినీటికి రిజర్వు చేశాం. వచ్చే ఏడాది నాటికి కాళేశ్వరం ప్రాజెక్టు నీళ్లు అందుబాటులోకి వస్తాయి. కాళేశ్వరం ద్వారా పాత వరంగల్, కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, నల్గొండ, ఖమ్మం, రంగారెడ్డి జిల్లాలతో పాటు హైదరాబాద్ నగరానికి తాగునీరు అందుతుంది. కాబట్టి మిషన్ భగీరథ అధికారులు రెండు రకాల ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలి. ఈ సమీక్షలో ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, మంత్రులు టి. హరీశ్ రావు, పోచారం శ్రీనివాస్ రెడ్డి, మిషన్ భగీరథ చైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి, విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

31న కలెక్టర్ల సమావేశం : భూ రికార్డుల ప్రక్షాళనకు సంబంధించి క్షేత్ర స్థాయిలో జరగాల్సిన కార్యక్రమాలపై మార్గనిర్దేశనం చేసేందుకు ఈ నెల 31న జిల్లా కలెక్టర్ల సమావేశం నిర్వహించాలని సిఎం నిర్ణయించారు. సెప్టెంబర్ 1 నుంచి రైతు సమన్వయ కమిటీల నియామకం జరగాలని, సెప్టెంబర్ 15 నుంచి రికార్డుల పరిశీలన ప్రారంభించాలని చెప్పారు.

భూ రికార్డుల ప్రక్షాళన, రికార్డుల నిర్వహణ, పట్టాదారు పాస్ పుస్తకాల్లో మార్పులు, పహాణీ పత్రాల్లో మార్పులు, రిజిస్ట్రేషన్ విషయంలో సంస్కరణలు తదితర అంశాలపై విధి విధానాలకు తుది రూపం ఇచ్చి కలెక్టర్ల సమావేశంలో వెల్లడించాలని సిఎం చెప్పారు. అలాగే ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయంలో ఆగస్టు 31న జరిగే వ్యవసాయాధికారుల సమావేశంలో సిఎం కెసిఆర్ ప్రారంభోపన్యాసం ఇవ్వనున్నారు.

మండలానికో రిజిస్ట్రార్ కార్యాలయం : ప్రతి మండలానికో రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని కెసిఆర్ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. ఇప్పటికే ఉన్న రిజిస్ట్రార్ కార్యాలయాలు, రిజిస్ట్రార్లను యధావిధిగా కొనసాగిస్తూ రిజిస్ట్రార్ కార్యాలయాలు లేని మండలాల్లో కొత్తవి నెలకొల్పాలని చెప్పారు. కొత్తగా ఏర్పాటు చేసే రిజిస్ట్రార్ కార్యాలయాలకు రిజిస్ట్రార్లుగా మండల రెవెన్యూ అధికారికే అదనపు బాధ్యతలు అప్పగించాలని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని రెవెన్యూ కార్యాలయాల్లో భూ రికార్డుల నిర్వహణ కోసం ఒక వెయ్యి మంది ఐటి అధికారులను నియమించాలని సిఎం ఆదేశించారు.

గతంలో భూమి శిస్తు వసూలు కోసం పహాణీలు తయారు చేశారు. ఇప్పుడు భూమి శిస్తు లేనందున పహాణిలో ఉన్న 31 కాలమ్స్ అవసరం ఉందా, లేదా అనే ఆలోచన చేయాలి. కేవలం రైతుల ఖాతాల వివరాలు మాత్రమే ఉంచి, మిగతావి తొలగిస్తే సరళంగా ఉంటుంది. భూ వివాదాలకు సంబంధించి కూడా ఇన్ని కోర్టులు అవసరం లేదు. కలెక్టర్ కోర్టు ఒక్కటే ఉండాలి. మిగతావి రద్దు చేయాలి, పట్టాదారు పాసు పుస్తకాలు, పహాణిల్లో వాడే భాష సరళంగా ఉండాలి.

బాలల అక్రమ రవాణాపై వార్

(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. ప్రధాన యాత్ర సెప్టెంబర్ 21న హైదరాబాద్ చేరుకుంటుందన్నారు. ఇందుకోసం యువ, విద్యార్థి, పౌర తదితర గ్రూపులను దేశవ్యాప్తంగా నిర్మాణం చేయనున్నట్టు ఆయన తెలిపారు. ప్రధాన యాత్ర కొనసాగుతున్న కాలంలోనే దేశంలోని ఇతర ప్రాంతాల నుండి ఆరు యాత్రలు బయలుదేరి ప్రధాన యాత్రలో వివిధ ప్రాంతాల్లో చేరుతాయన్నారు. ప్రధాన యాత్రలో మొదటి నుండి చివరి వరకు 150 మంది పాల్గొంటారని, వివిధ రాష్ట్రాలు, జిల్లాల్లో స్థానికులు యాత్రలో భాగస్వాములౌతారని తెలిపారు. యాత్రలో కోటి మంది వరకు పాల్గొంటారని ఆయన అంచనా వేశారు. ఈ ఉద్యమం పెద్ద ఆందోళనగా మారనుందన్నారు. ఈ యాత్రలో భాగస్వాములు కావాలని రాష్ట్రపతిని, కేంద్ర మంత్రులను, అన్ని రాజకీయ పార్టీల ఎం.పిలను, ప్రజా ప్రతినిధులను, మతాల పెద్దలు, కార్పొరేట్ వర్గాలతో మాట్లాడగా వారంతా సానుకూలంగా స్పందించారని అన్నారు. సురక్షిత బాల్యం సాధ్యమైననాడే రక్షిత భారతదేశం ఆవిష్కృతమౌతుందన్నారు. పిల్లలను భయం నుండి స్వేచ్ఛ వైపు నడిపించేందుకు ఈ యాత్ర చేపట్టామన్నారు. భయం, సుస్థిరాభివృద్ధి రెండు సమకాలంలో నెరవేరన్నారు. పిల్లలకు ఇళ్లు, పాఠశాలలు సురక్షితంగా లేకపోవడం దేశానికే సిగ్గుకరమని ఆయన అన్నారు. మాట రాని చిన్నారుల కోసం సమాజం మాటగా మారాలని సమయం వచ్చిందన్నారు. (సొసైటీ షుడ్ బికమ్ వాయిస్ ఫర్ వాయిస్‌లెస్ చిల్డ్రన్). పిల్లలపై జరుగుతున్న అత్యాచారాలను కనీసం తల్లిదండ్రులకు చెప్పుకోలేని దౌర్భాగ్య పరిస్థితులు నెలకొన్నాయన్నారు. అత్యాచారాలకు, లైంగిక వేధింపులకు గురైన పిల్లలకు సంబంధించి దేశవ్యాప్తంగా చోటు చేసుకున్న పలు సంఘటనలను ఉదహరించిన సత్యార్థి, బాధిత కుటుంబాలను పలు ప్రశ్నలను అడుగుతున్నాయని చెప్పారు. వీటికి ప్రభుత్వాలు, సమాజం సమాధానం చెప్పాలన్నారు. పిల్లలపై అత్యాచారాల కేసుల్లో కేవలం 4 శాతం మందికి శిక్షలు పడ్డాయని, మొత్తం కేసులు పరిష్కారం కావడానికి మరో 40 సంవత్సరాలు పట్టేలా ఉందని విమర్శించారు. ప్రతి 8 నిమిషాలకు ఒక బాలిక లేదా బాలుడు అపహరణకు గురౌతున్నారన్నారు. అత్యాచార బాధిత చిన్నారులకు చికిత్స అందించేందుకు సరైన సౌకర్యాలు లేవన్నారు. బాధితుల్లో ఒక్కరికి కూడా మానసిక చికిత్స (కౌన్సిలింగ్) ఇవ్వలేదని ఆయన తూర్పారపట్టారు. బాధిత చిన్నారులకు అనువైన న్యాయస్థానాలు, న్యాయమూర్తులు అవసరమన్నారు. పిల్లల పోర్నోగ్రఫీ నిషేధానికి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలకు గాను కైలాష్ కృతజ్ఞతలు తెలిపారు. అయితే పెద్దల పోర్నోగ్రఫీ సైట్లను పిల్లలు చూడకుండా నిరోధక చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పిల్లల అక్రమ రవాణాకు వ్యతిరేకంగా బలమైన చట్టాలు తేవాల్సిన అవసరముందన్నారు. బాలలకు కేటాయించే బడ్జెట్‌ను పెంచాలని డిమాండ్ చేశారు. మతాలకతీతంగా బాధిత చిన్నారులు వచ్చేలా అన్ని మతాల ప్రార్థనా మందిరాల తలుపులు తెరిచి ఉంచాలని కోరారు. రాతలకే పరిమితం కాకుండా జర్నలిస్టులు బాలల స్వేచ్ఛ కోసం సాగే ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. బాధిత చిన్నారుల కుటుంబాలు నోరు విప్పకపోవడం, పిల్లల తల్లిదండ్రులు తమ పిల్లల పరిస్థితులపై అవగాహన లేకపోవడమే ఇలాంటి సంఘటనలు జరగడానికి కారణమౌతుందన్నారు. ఈ పరిస్థితుల్లో మార్పు తెచ్చేందుకు ప్రారంభించిన యుద్ధంలో ప్రతి తల్లిదండ్రులు పాల్గొనాలని కైలాష్ సత్యార్థి కోరారు.

డిగ్రీ చదువుకు చెదలు

(మొదటిపేజీ తరువాయి)

ఇ–సేవ, ఇంటర్నెట్ కేంద్రాలపై ఆధారపడుతుంటారు. ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకున్నా, సరైన అవగాహన లేక తక్కువ కళాశాలలను ఎంపిక చేసుకోవడంతో కొన్ని కళాశాలల్లో మాత్రమే సీట్లు భర్తీ అవుతున్నాయి. ఈ ఏడాది వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకుని, సీట్లు లభించని విద్యార్థులు 6,000 మంది ఉండగా, సీట్లు లభించి కళాశాలల్లో ప్రవేశాలు పొందని విద్యార్థులు 44,000 మంది ఉన్నారు.

మారుతున్న విధానాల వల్లనే తగ్గాయా..? : ఉన్నత విద్యలో ప్రమాణాలు పెంచాలనే ఉద్దేశంతో రాష్ట్రంలో గత విద్యాసంవత్సరం నుంచి సిబిసిఎస్(క్రెడిట్ బేస్డ్ ఛాయిస్ సిస్టమ్) అమలు చేస్తుండగా, ఈ ఏడాది నుంచి డిటెన్షన్ విధానం కూడా అమలవుతోంది. దాంతోపాటు కళాశాలల్లో హాజరు పెంచేందుకు చర్యలు చేపడుతున్నారు. ఈ కొత్త విధానాలు అమలు చేయడం వల్లనే డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు తగ్గినట్లు తెలుస్తోంది. సిబిసిఎస్ విధానంలో విద్యార్థులు ప్రతి ఆరు నెలలకు ఒకసారి సెమిస్టర్ పరీక్షలు రాయాల్సి ఉంటుంది. సెమిస్టర్ మధ్యలో ఇంటర్నల్ పరీక్షలు కూడా ఉంటాయి. విద్యార్థులు రెగ్యులర్‌గా కళాశాలకు వెళితే తప్ప పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించే అవకాశం ఉండదు. డిగ్రీ కోర్సుల్లో కూడా వృత్తి విద్యా కోర్సుల తరహాలోనే సెమిస్టర్ విధానం అమలవుతుండడంతో ప్రవేశాలు తగ్గుతున్నట్లు తెలుస్తోంది. గతంలో ఇంటర్మీడియెట్ విద్యార్థులు ఇంజనీరింగ్, మెడిసిన్, ఫార్మసీ వంటి వృత్తి విద్యా కోర్సుల్లో అడ్మిషన్లు పొందేందుకు వివిధ ప్రవేశ పరీక్షలు రాసి, మెరుగైన ర్యాంకులు రాక ఎక్కడా సీటు లభించకపోతే, డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్ తీసుకునేవారు. కళాశాలలకు వెళ్లకపోయినా డిగ్రీ చేయొచ్చు అనే ధీమా ఉండేది. కానీ మారిన విధానాలతో తప్పనిసరిగా కళాశాలలకు వెళ్లాల్సిన పరిస్థితి తలెత్తింది. దాంతో సీరియస్‌గా డిగ్రీ చేయాలనుకునే విద్యార్థులే ప్రవేశాలు పొందుతున్నారు.

మంచిర్యాల – చంద్రాపూర్

(మొదటిపేజీ తరువాయి)

గల రాష్ట్ర రహదారిని, ఆదిలాబాద్‌బేలా, మిర్యాలగూడ, పిడుగురాళ్ల మీదుగా నర్సరావుపేట వరకు 43 కిలోమీటర్ల రహదారి, జహిరాబాద్ నుంచి బీదర్ మీదుగా కర్ణాటకలోని దెగ్లూర్ రహదారి, నిజాంపేట నుంచి నారాయణఖేడ్ మీదుగా బీదర్ వరకు గల 25 కిలోమీటర్ల రహదారి, భద్రాచలం నుంచి జీలుగుమిల్లి మీదుగా దేవరపల్లి వరకు 68 కిలోమీటర్ల పొడువు గల రహదారి, ముద్దనూర్ నుంచి బోధన్ మీదుగా నిజామాబాద్ వరకు 76 కిలోమీటర్ల పొడవు గల రహదారిని జాతీయ రహదారిగా మార్చారు. తాండూర్ నుంచి కొడంగల్ మీదుగా మహబూబ్‌నగర్ వరకు 96 కిలోమీటర్ల పొడవు గల రహదారి, వరంగల్ నుంచి ఖమ్మం వరకు 120 కిలోమీటర్ల పొడవున గల రహదారి, హైదరాబాద్ నుంచి మోయినాబాద్ కర్ణాటక సరిహద్దు వరకు 135 కిలోమీటర్ల పొడవున గల రహదారి, మెదక్ నుంచి సిద్దిపేట మీదుగా ఎల్కతుర్తి వరకు 133 కిలోమీటర్ల పొడవున గల రహదారి, కరీంనగర్ నుంచి సిరిసిల్ల మీదుగా పిట్లం వరకు 165 కిలోమీటర్ల పొడవున గల రహదారి, సంగారెడ్డి నుంచి చౌటుప్పల్ వరకు 152 కిలోమీటర్ల రహదారి సూర్యాపేట నుంచి రాజమండ్రి వరకు 177 కిలోమీటర్ల రహదారి, సిరిసిల్ల నుంచి సిద్దిపేట మీదుగా సూర్యపేట వరకు 184 కిలోమీటర్ల రహదారి, కోదాడ నుంచి జడ్‌చర్ల వరకు 211 కిలోమీటర్ల రహదారితో పాటు మొత్తం 21 మార్గాల్లోని రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా మారుస్తూ కేంద్రం ఉత్తర్యులు జారీ చేసింది. ఇదిలా ఉండగా మంచిర్యాల నుంచి చంద్రాపూర్ వరకు ఫోర్‌లేన్ హైవే రోడ్డు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ. 1500 కోట్లు కేటాయించడంతో సర్వే పనులు ప్రారంభమయ్యాయి. ఈ మార్గంలో ట్రాఫిక్ సమస్య తీవ్రరూపం దాల్చడంతో ఈమార్గాన్ని ఫోర్‌లేన్ రోడ్డుగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం ఎట్టకేలకు అంగీకరించింది. మంచిర్యాల నుండి మహరాష్ట్రలోని చంద్రపూర్ వరకు 94.5 కిలోమీటర్ల పొడువున పనులు ప్రారంభమయ్యాయి. అంతే కాకుండా రహదారి నిర్మాణంలో భాగంగా 268.21 ఎకరాల భూములు అవసరం కాగా పలు చోట్ల అధికారులు సర్వేచేసి, పెగ్‌మార్కింగ్ ఇచ్చారు.

ఆధార్ కేసుపై విచారణ

(మొదటిపేజీ తరువాయి)

(సిజెఐ) దీపక్ మిశ్రా, న్యాయమూర్తులు పిసి పంత్, డివై చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనానికి రమేష్ తరపు న్యాయవాది విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో గోప్యత ప్రాథమిక హక్కంటూ రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును తొలుత పూర్తిగా అర్థం చేసుకున్నాకే దీనిపై విచారణ చేపడుతామని ధర్మాసనం స్పష్టం చేసింది. అప్పీలుపై శుక్రవారం (సెప్టెంబరు 1) విచారణ చేపట్టాలని కోరారు. కానీ, గోప్యతపై తీర్పును తాము అధ్యయనం చేయాల్సి ఉందని సిజెఐ పిటిషనర్‌కి తెలిపారు. ఈ అంశం ముఖ్యమైనది, తీవ్రమైనదయినందున దీనిపై తొందరపాటు నిర్ణయం తీసుకోలేమని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ కేసు విషయమై సన్నద్ధం కావడానికి కేంద్రం లేవనెత్తిన అన్ని అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుంటామని పేర్కొంది. ఆధార్ చట్ట సవరణ బిల్లు విషయంలో లోక్‌సభ స్పీకర్ నిర్ణయాన్ని సవాలు చేసేందుకు జైరాం రమేష్ ఎంచుకున్న కారణాలు సహేతుకమైన రీతిలో విశ్వసనీయంగా లేవనే అభిప్రాయాన్ని ఈ ఏడాది ఫిబ్రవరిలో సుప్రీంకోర్టు వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. రాజ్యసభ పరిశీలన నుండి తప్పించడానికే ఆధార్ (ఆర్థిక, ఇతర రాయితీలు, ప్రయోజనాలు, సేవల లక్షిత నిర్వహణ) బిల్లు, 2016ని ద్రవ్య బిల్లుగా ధ్రువీకరించారంటూ జైరాం రమేష్ గతంలో సుప్రీంకోర్టుకు తెలిపారు. గతేడాది మార్చి 11న ఈ బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందగా, అదే నెల 16న రాజ్యసభలో దీనికి పలు సవరణలు చేశారు.

54.84 శాతం మందికి

ఎంఆర్ వ్యాక్సినేషన్

మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలో 54.84 శాతం మందికి ఎంఆర్ వ్యాక్సినేషన్ వేశారు. మొత్తం 90,01,117 మందికి వ్యాక్సిన వేయాలని లక్ష్యంగా పెట్టుకోగా గత 9 రోజుల్లో 49,36,172 మందికి వ్యాక్సిన్ వేయడం పూర్తయింది. ఎంఆర్ వ్యాక్సినేషన్ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా 77.54 శాతం వ్యాక్సినేషన్‌తో మొదటి స్థానంలో నిలవగా, మేడ్చల్ మల్కాజ్‌గిరి 37.13 శాతం మంది, హైదరాబాద్ జిల్లా 36.26 శాతం మందితో వెనుకబడ్డాయి. కామారెడ్డిలో 2,46,550 మందికి వ్యాక్సినేషన్ వేసేందుకు లక్ష్యంగా పెట్టుకోగా 1,91,175 మందికి వ్యాక్సినేషన్ చేశారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో మొత్తం 7,75,852 మందికి వ్యాక్సినేషన్ లక్ష్యం కాగా అందులో కేవలం 2,57,022 మందికి వ్యాక్సినేషన్ వేశారు. హైదరాబాద్‌లో 9,49,605 మంది లక్ష్యం కాగా 3,44,354 మందికి మాత్రమే వ్యాక్సినేషన్ వేయడం పూర్తయింది.



రైతుల పట్ల కాంగ్రెస్ మొసలి కన్నీరు : వేణుగోపాలచారి

మన తెలంగాణ/న్యూఢిల్లీ : తెలంగాణ కాంగ్రెస్ నేతలు జెఎసి ఛైర్మన్ కోదండరాంని కరివేపాకులా వాడుకుంటున్నారని, ఈ విషయాన్ని కోదండరాం గుర్తించాలని ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి వేణుగోపాల చారి సూచించారు. మంగళవారం ఢిల్లీలో మీడియా సమావేశాన్ని నిర్వహించిన ఆయన కోదండరాం పై పలు వ్యాఖ్యలు చేశారు.కోదండరాంని జెఎసి ఛైర్మన్‌గా బలపరిచింది టిఆర్‌ఎస్ పార్టీయేనని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తెలంగాణ ప్రభుత్వం నిజంగా కోదండరాం పర్యటనలపైన ఆంక్షలు విధించాలనుకుంటే, ఆయన హైదరాబాద్ దాటి, ఢిల్లీలాంటి చోటుకు వచ్చి జంతర్ మంతర్ లో ఏవిధంగా ధర్నాలు చేసేవారని వేణుగోపాల చారి ప్రశ్నించారు. సమావేశాల్లో, ర్యాలీల్లో కొందదరాం ఉంటేనే ప్రజలు వస్తారన్న భ్రమలో తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఉన్నారని ఎద్దేవా చేశారు. రైతుల పక్షాన నిలుస్తున్న సిఎం కెసిఆర్ కు గ్లోబల్ అగ్రికల్చర్ అవార్డు వస్తే కాంగ్రెస్ నేతలు ఓర్వలేకపోతున్నారంటూ విమర్శలు గుప్పించారు. అభివృద్ధిని అడ్డుకునేందుకే కాళేశ్వరం ప్రాజెక్ట్ పైన 32 కేసులు వేశారని ఆరోపించారు. వ్యవసాయ శాఖను సిఎం ప్రక్షాళన చేశారు కాని, రైతుల పట్ల కాంగ్రెస్ మొసలి కన్నీరు కారుస్తోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏ పథకాన్ని చేపట్టినా ఆ పథకానికి నిధులు కేంద్ర మే ఇస్తుందంటూ అమిత్ షా ప్రజలను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

ఇద్దరు మావోయిస్టుల లొంగుబాటు



మన తెలంగాణ / భూపాలపల్లి ప్రతినిధి : ఏటూర్‌నాగారం ఎఎస్పీ ఎదుట ఇద్దరు మావోయిస్టులు మంగళవారం లొంగిపోయారు. సింగన్‌పల్లికి చెందిన పోడియం లక్కు ఊసూర్ ప్రభుత్వ హైస్కూల్‌లో చదువుతూ మావోయిస్టు సిద్ధాంతాల పట ఆకర్షితులై 2011లో ఊసూర్ కమాండర్ సోముడు ఆధ్వర్యంలో సిపిఐ మావోయిస్టులో మిలిషియా సభ్యుడిగా చేరాడు. 2014లో మిలిషియా ప్లాటూన్ సెక్షన్ కమాండర్‌గా ప్రమోషన్ ఇచ్చారు. 2016నుండి ఊసూర్ ఎల్ఒసి కమాండర్ రమేష్ ఆధ్వర్యంలో పనిచేస్తున్నాడు. సింగూన్‌పల్లికి చెందిన సోడి లక్ష్మీ ఊసూర్ ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని దళ కమాండర్ రమేష్ ఆధ్వర్యంలో సిపిఐ మావోయిస్టు పార్టీలో మిలిషియా సభ్యురాలిగా చేరి 2016 సెప్టెంబర్ లో తుమ్మిరెల్ వద్ద పోలీసులతో జరిగిన ఎదురు కాల్పుల్లో, బీజాపూర్‌లో ఇన్‌ఫార్మర్ పేరుతో ఒకరిని చంపిన ఘటనలో నిందితుడు. మంగళవారం వీరు లొంగిపోయారు.

స్వదేశానికి చేరిన వలస కార్మికులు

- మూతపడిన 'పెట్రోస్ గల్ఫ్'
- రోడ్డున పడ్డ కార్మికులు
- ఎంబసీ సాయంతో భారత్‌కు

మన తెలంగాణ/శంషాబాద్ : బతుకుదెరువు కోసం పొట్ట చేతపట్టుకొని దేశం కాని దేశం వెళ్ళి రోడ్డున పడ్డ తెలుగు వలస కార్మికులు మంగళవారం ఉదయం శంషాబాద్ ఎయిర్ పోర్టుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా గల్ఫ్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి వెల్లడించిన వివరాలు ఇలా వున్నాయి. ఒమన్ దేశంలోని సోహర్ నగరంలో పెట్రోస్ గల్ఫ్ అనే కంపెనీ యాజమాన్యం మోసానికి దాదాపు 900మంది భారతీయ కార్మికులు రోడ్డున పడ్డారు. కంపెనీ మూతపడటంతో కార్మికులు గత నాలుగు నెలలుగా జీతాలు రాక, తిండి లేక అలమటిస్తున్నారు. వీరిలో 30 మంది తెలంగాణ, 170మంది ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు ఉన్నారు. గత పదేళ్లుగా ఈ కంపెనీలో పని చేస్తున్న వీరికి నాలుగు నెలల నుండి జీతం ఇవ్వడం లేదు. అయితే వీరికి జీతంతో పాటు గ్రాట్యూటీ కలిపి ఒక్కొక్కరికి రూ3 నుండి 4లక్షల రూపాయల బకాయిలు రావాల్సి ఉంది. కార్మికులు తమకు రావాల్సిన బకాయిలు రాబట్టుకోవడానికి లేబర్ కోర్టులో కేసు వేసి పోరాడాటానికి మస్కట్ లోని ఇండియాన్ ఎంబసీ పేరిట పవర్ ఆఫ్ అటార్నీ అధికారం ఇచ్చినట్లు దేవేందర్‌రెడ్డి తెలిపారు. ఒమన్ దేశ రాజధాని మస్కట్‌లోని ఇండియన్ ఎంబసీ వీరందరికీ ఉచిత విమానా టికెట్లు సమకూర్చిందన్నారు. దీంతో మస్కట్ నుంచి విమానంలో శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు ఇద్దరు, విశాఖపట్నం ఎయిర్ పోర్టుకు 20 మంది వలస కార్మికులు ఈ రోజు వచ్చినట్లు తెలిపారు. మస్కట్ చిరు మెగా యూత్ ఫోర్స్ ప్రతినిధులు చందక రాందాస్, ఫోల్సాని లింగయ్యలు 79 మంది తెలుగు కార్మికులకు చేతి ఖర్చులకు ఒక్కొక్కరికి రూ.1000లు అందించినట్లు తెలిపారు.



వలస కార్మికులకు స్వాగతం పలుకుతున్న గల్ఫ్ అసోసియేషన్ నాయకులు

శంషాబాద్ నుంచి తమ స్వగ్రామాలకు చేరుకోవడానికి ఎన్నారై విభాగం అధికారి చిట్టిబాబు బస్‌ఛార్జీలు అందించినట్లు తెలిపారు. తెలంగాణ రాష్టంలోని జగిత్యాల జిల్లా కొడిమ్యాలకు చెందిన వెంకటేశ్వర్లు, నిజామాబాద్‌కు జిల్లా డిచ్‌పల్లికి చెందిన సంగెమ్ చిన్నయ్య, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంకు చెందిన 20మంది వలస కార్మికులు తమ స్వగ్రామాలకు చేరుకున్నట్లు ఆయన తెలిపారు.

ఆస్ట్రేలియాలో కెటిఆర్

ఆస్ట్రేలియాలోని న్యూ సౌత్‌వేల్స్‌లో జరిగిన 'ది మైనింగ్ 2017 రిసోర్స్ కన్వెన్షన్ సదస్సు'లో మంత్రి కెటిఆర్, టిఎస్ ఎండిసి ఛైర్మన్ శేరి సుభాష్‌రెడ్డి, పిఎస్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

గోదావరి జలాలతో భూములు సస్యశ్యామలం



- 9 మండలాలకు జలాల తరలింపునకు ప్రతిపాదనలు
- అధికారులను ఆదేశించిన మంత్రి హరీశ్‌రావు

మన తెలంగాణ/భూపాలపల్లి ప్రతినిధి : గోదావరి జలాలతో ములుగు నియోజక వర్గంలోని వ్యవసాయ భూములను సస్యశ్యామలంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి టి హరీశ్‌రావు ప్రకటించారు. గోదావరి జలాలను నియోజకవర్గంలోని 9 మండలాలకు తరలించేందుకు అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. దీనికై మార్కెట్ చైర్మన్ అజ్మీరా ప్రహ్లాద్, లోక్‌సభ సభ్యుడు సీతారాం నాయక్, వందలాది రైతులతో మంగళవారం ఉదయం మంత్రి హరీష్‌రావును తన నివాసంలో కలిసి వినతి పత్రాలను అందించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ గోదావరి జలాలు ప్రక్కనే ప్రవహిస్తున్న ఇన్ని ఏండ్లు వాడుకోలేకపోయామని, తెలంగాణ ప్రభుత్వ హయంలోనే రైతాంగానికి గోదావరి జలాలను అందిస్తానని భరోసా ఇచ్చారు. ములుగు నియోజకవర్గమంతా మరో కోనసీమగా మారుతుందని పేర్కొన్నారు. గిరిబిడ్డల భీడు భూములను సస్యశ్యామలం చేస్తూ పచ్చని పైర్లకు ప్రాణం తీసుకువస్తానని హామీ ఇచ్చారు. ప్రత్యేక నైసర్గిక స్వరూపమున్న ములుగు నియోజకవర్గంలో అవసరమైతే ఎత్తిపోతల ప్రాజెక్ట్‌ల ద్వారానైనా వ్యవసాయ భూములకు గోదావరి జలాలను అందిస్తామని తెలిపారు. దేవాదుల ప్రాజెక్టు ద్వారా ఏయే చెరువులను నింపితే అధిక ప్రయోజనం ఉంటుందో రైతులే తేల్చి చెప్పాలని అన్నారు. వినతి పత్రంలోని హామీలపై త్వరలోనే క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తామని, రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సర్కార్ చేపడుతున్న సాగునీటి ప్రాజెక్టలను సకాలంలో పూర్తైయ్యే విధంగా ప్రయత్నిస్తున్నామని మంత్రి తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో టిఆర్ఎస్ ములుగు మండల అధ్యక్షులు గట్టు మహేందర్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సూరి కృష్ణరెడ్డి, ములుగు నియోజకవర్గంలోని వివిధ మండలాల అధ్యక్షులు,జెడ్పిటిసి సభ్యులు ఉన్నారు.

ప్రభుత్వ కళాశాలలపై విద్యార్థుల మక్కువ

- మంత్రి కడియం శ్రీహరి

మన తెలంగాణ/నిర్మల్ అర్బన్ : తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత విద్యారంగానికి కెసిఆర్ అత్యధిక ప్రాధాన్యం కల్పిస్తున్నారని ఉప ముఖ్యమంత్రి, విద్యా శాఖ మంత్రి కడియం శ్రీ హరి పేర్కొన్నారు. నిర్మల్ లో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ బాలిక, బాలుర జూనియర్ కళాశాలలను ప్రారంభించారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన అనంతరం ప్రసంగించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని తెలంగాణ ప్రాంతంలో విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారన్నారు. ప్రైవేట్‌కు ధీటుగా తెలంగాణలో ప్రభుత్వ కళాశాలను బలోపేతం చేస్తున్నామన్నారు. ప్రతీ పాఠశాలలో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. రెండేళ్లలో ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్యగణనీయంగా పెరిగిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 413 జూనియర్ కళాశాలు ఉంటే వీటిలో 17 కళాశాలకే పక్కాభవనాలు లేవన్నారు. కళాశాలలో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరణ చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని,అయితే కాంగ్రెస్ నాయకులు అడ్డకోవడంతో జాప్యం జరుగుతుందన్నారు. ఎస్,ఎస్‌టి మైనార్టీ తేడా లేకుండా ప్రభు త్వం పెద్ద సంఖ్యలో గురుకులాలను ఏర్పాటు చేస్తుందన్నారు. కార్యక్రమంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి,కలెక్టర్ ఇలంబరిది, ఎస్‌పి విష్ణు ఎస్ వారియర్, జాయింట్ కలెక్టర్ శివలింగయ్య,మున్సిపల్ చైర్మ న్ అప్పాల గణేష్ చక్రవర్తి,డిఇఒ ప్రణిత, టిఆర్ఎస్ కార్యదర్శి సత్యనారాయణగౌడ్, ఎఫ్ఎస్‌సిస్ చైర్మన్ రాంకిషన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎఇ ఆత్మహత్య కారకులపై చర్యలు తీసుకోవాలి

మన తెలంగాణ/ఆదిలాబాద్ : ఉన్నతాధికారుల వేధింపుల కారణంగా ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన పిఆర్ ఎఇదేవి శ్రీకాంత్ ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆదిలాబాద్ జిల్లా ఇంజినీర్ల సంఘం నాయకులు ధ్వజమెత్తారు. ఆత్మహత్యకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం పంచాయతీరాజ్ ఎస్ఇ కార్యాలయం ఆవరణలో నిరసన కార్యక్రమానికి అన్ని విభాగాల ఇంజనీరింగ్ అధికారులు హాజరై ఎఇ ఆత్మహత్యకు కారకులైన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని ముక్తకంఠంతో నినదించారు. నల్లబ్యాడ్జీలను ధరించి నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకుముందు రెండు నిమిషాల పాటు మౌనం పాటించి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. పిఆర్ డిఇ అసోసియేషన్ అధ్యక్షులు కె జగదీశ్వర్, ఇరిగేషన్ ఎఇ మురళీకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ డిఇఇలు రమణ, చంద్రమోహన్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిఇ సయ్యద్ రఫతుల్లా పాల్గొన్నారు. కాగా, శ్రీకాంత్ ఆత్మహత్యకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతూ మంత్రి జోగురామన్నకు జిల్లా ఇంజనీర్ల సంఘం, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగుల సంఘం నాయకులు వినతి పత్రాన్ని అందచేశారు.

పంటలు పండక...అప్పుల బాధతో అన్నదాత మృతి

మన తెలంగాణ/ఎంజిఎం : అప్పుల బాధతో తీవ్ర మనస్థాపం చెంది పురుగుల మందు సేవించి రైతు మృతిచెందిన సంఘటన నర్మెట్ట మండలంలోని బొమ్మకూర్ సమీపంలోని రాళ్లబాయితండాలో చోటు చేసుకుంది. బంధువులు, పోలీసుల కథనం ప్రకారం.. జనగాం జిల్లాలోని నర్మెట్ట మండలం రాళ్లబాయి తండాకు చెందిన నునావత్ లక్ష్మ ణ్ (30) రెండు సంవత్సరాల నుంచి ఉన్న భూమిలో పంట వేస్తే నీరు లేక పంట పండకపోవడంతో, అప్పులు తీర్చే మార్గం లేక మనస్థాపంతో పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు జనగాం ఏరియా ఆస్పత్రికి చికిత్స కోసం తరలించగా, అక్కడి వైద్యులు చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం ఎంజిఎంకు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్లు డాక్టర్ మధుసూదన్ తెలిపారు.

జనం కోరుకున్న సామాజిక తెలంగాణ రాలేదు

- ప్రజా యుద్ధనౌక గద్దర్

మన తెలంగాణ/ యాదాద్రి భువనగిరి : సామాజిక న్యాయం , సమానత్వం వర్తించే విధంగా సామాజిక తెలంగాణ రాలేదని ప్రజాయుద్ధనౌక గద్దర్ ఉద్ఘాటించారు. పట్టణంలోని ఏఆర్ గార్డెన్‌లో తెలంగాణ సామాజిక ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆద్వర్యంలో మంగళవారం జరిగిన టి–మాస్ ఆవిర్భావ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతున్న కుటుంబ పాలన , కుల అహంకారానికి వ్యతిరేకంగా సబ్బండ వర్గాలు మరో పోరాటానికి సంసిద్ధం కావల్సిన సమయం ఆసన్నమైందన్నారు. సామాజిక ప్రజా సంఘాలు ఐక్యతతో కొనసాగాలని తెలిపారు. గ్రామాలలో అమాయకపు ప్రజలు మోసపోతున్నారని, ప్రజలను చైతన్యం చేసేందుకు గ్రామాలలోకి కదలాలని సామాజిక కార్యకర్తలకు ఆయన పిలుపు నిచ్చారు. అందుకు కవులు, కళాకారులు, మేదావులు అన్ని రంగాలవారు బాసటగా ఉన్నారని, చివరికి పోరాటమార్గమే ఏకైక శరణ్యమని ఆయన వివరించారు. సమగ్రాభివృద్ది , సామాజిక న్యాయం సాధించినప్పుడే జన తెలంగాణ వస్తుందన్నారు. మాజీ ఎంపి తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో



కెసి ఆర్ కులఅహంకార మూడేండ్ల పాలనలో తెలంగాణ రాష్ట్రం భ్రష్టు పట్టిందని విమర్శించారు. దళితులు, వెనకుకబడిన తరగతుల వారు హత్యలకు గురౌతున్నారని, అందుకు యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు మండలం పల్లెర్ల గ్రామానికి చెందిన అంబోజు నరేష్, స్వాతి హత్యలే ప్రత్యేక నిదర్శమని ఆయన వివరించారు. స్టీరింగ్ కమిటి రాష్ట్ర కన్వీనర్ జాన్ వెస్లీ, స్టీరింగ్ కమిటి సభ్యులు జెబి రాజు, రేష్మ, పైళ్ల ఆశయ్య, యంసాయిబాబా, రాం నాయక్, కన్నగట్ల స్వామి, ఎఎల్ మల్లయ్య,యండి జహంగీర్, కొత్త నరసింహ టంటం వీరేశం, న్యాయవాది యంఎ రహీమ్, సురుపంగ శివలింగం తదితరులు ప్రసంగించారు.

త్రివిక్రమ్ నెక్స్ట మూవీలో కూడా...

ప్రస్తుతం టాలీవుడ్‌లో ఇతర భాషల సంగీత దర్శకులు సందడి చేస్తున్నారు. కోలీవుడ్, బాలీవుడ్‌కు చెందిన యంగ్ మ్యూజిక్ డైరెక్టర్లు కొందరు టాలీవుడ్‌లో సత్తాచాటాలని తహతహలాడుతున్నారు. ఒకప్పుడు ఇదే తరహాలో పలువురు వచ్చినా ఎవరు ఇళయరాజా వంటి వారి స్థాయిలో మెప్పించలేక పోయారు. రెండు, మూడు సినిమాల్లో కనిపించి మళ్లీ వారి ఇండస్ట్రీకి వెళ్లిపోయారు. అయితే ఇప్పుడు కోలీవుడ్ యువ సంగీత దర్శకుడు అనిరుధ్ తెలుగు సినిమాలకు ఓకే చేస్తూ టాలీవుడ్‌లో సత్తా చాటాలని అనుకుంటున్నాడు. ఇప్పటికే త్రివిక్రమ్‌పవన్‌కళ్యాణ్ ప్రాజెక్ట్‌లో అతను వర్క్ చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఇప్పుడు మరో సినిమాకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశాడు ఈ యంగ్ మ్యూజిక్ డైరెక్టర్. పవన్‌కళ్యాణ్ 25వ చిత్రానికి అతను ఇచ్చిన బాణీలకు ఫిదా అయిపోయిన త్రివిక్రమ్ తను తీయబోయే నెక్స్ట సినిమాకు కూడా అనిరుధ్‌నే తీసుకుంటున్నాడట. పవన్‌తో సినిమా అయిపోగానే ఎన్టీఆర్‌తో త్రివిక్రమ్ సినిమా చేయబోతున్నాడు. ఈ సినిమా కోసం ఎన్టీఆర్ కూడా సిద్ధమవుతున్నాడు. మరి ఈ యువ సంగీత దర్శకుడిలో త్రివిక్రమ్‌కు ఏం నచ్చిందో ఏమో కానీ వరుసగా రెండు సినిమాలకు అతడిని తీసుకోవడం విశేషం.



అనిరుధ్


ప్రభాస్

స్కూబా డైవింగ్‌లో శిక్షణ


'బాహుబలి' తర్వాత ప్రభాస్ చేస్తున్న సినిమా కావడంతో 'సాహో'పై అభిమానులు, ప్రేక్షకుల్లో భారీ అంచనాలున్నాయి. ఆ అంచనాలను అందుకోవాలని సినిమా టీమ్ ఎంతో కష్టపడుతోంది. సుమారు రూ.150 కోట్ల బడ్జెట్‌తో రూపొందిస్తున్న ఈ సినిమాను విఎఫ్‌ఎక్స్ సాయంతో విజువల్ వండర్‌గా తీర్చిదిద్దబోతున్నారు. అంతేగాకుండా ప్రేక్షకులు థ్రిల్లయ్యేలా హెవీ యాక్షన్ ఎపిసోడ్‌లను కూడా తెరకెక్కించ బోతున్నారు. హాలీవుడ్ స్టంట్ కొరియో గ్రాఫర్ ఈ యాక్షన్ ఎపిసోడ్ లను రూపొందిస్తున్నాడు. ఇక ప్రభాస్ అయితే యాక్షన్ సీన్‌ల కోసం ప్రత్యేకంగా శిక్షణ పొందుతున్నాడని తెలిసింది. ఈ సినిమాలో అండర్ వాటర్‌లో జరిగే ఒక ఫైటింగ్ సీక్వెన్స్ ఉంటుందట. దానికోసం ప్రభాస్ అండర్ వాటర్ డైవింగ్ అయిన స్కూబా డైవింగ్‌ను నేర్చుకుంటున్నాడట. సుజిత్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో బాలీవుడ్ బ్యూటీ శ్రద్ధాకపూర్ హీరోయిన్‌గా చేస్తోంది.

రామ్‌చరణ్-బోయపాటి కాంబినేషన్‌లో...


రామ్‌చరణ్

స్టార్ డైరెక్టర్ బోయపాటి శ్రీను చిత్రం 'జయ జానకి నాయక' ఇండిపెండెన్స్ డే సందర్భంగా విడుదలై సూపర్ హిట్‌గా నిలిచింది. యంగ్ హీరో బెల్లంకొండ శ్రీనివాస్‌తో తెరకెక్కిన ఈ చిత్రం భారీ వసూళ్లను సాధించింది. ఈ సినిమా రూ.25 కోట్లకు పైగా కలెక్షన్లను సాధించడంతో బోయపాటి స్టామినా ఏంటో అర్థమైంది. అయితే ఈ డైరెక్టర్ తన నెక్స్ట మూవీని ఓ స్టార్ హీరోతో తెరకెక్కించబోతున్నాడు. బోయపాటి ఎంచుకున్న హీరో ఎవరో కాదు... రామ్‌చరణ్ కావడం విశేషం. చరణ్‌తో బోయపాటి సినిమాపై త్వరలోనే ఓ అధికారిక ప్రకటన కూడా రావచ్చని అంటున్నారు. వీరిద్దరి కాంబినేషన్‌లో రూపొందే తొలి చిత్రం కావడంతో ఇండస్ట్రీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. మరోవైపు ఈ చిత్రాన్ని గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై అల్లు అరవింద్ నిర్మించనుండడం విశేషం. గతంలో ఈ బ్యానర్‌పై 'సరైనోడు' చిత్రం నిర్మించి మంచి హిట్‌ను అందించాడు బోయపాటి. ఇండస్ట్రీ హిట్స్‌లో ఒకటిగా నిలిచిన ఈ చిత్రం తర్వాత మరొక ప్రాజెక్ట్‌కు కూడా కలిసి పనిచేయాలని బోయపాటి శ్రీను, అల్లు అరవింద్ ఓ ఒప్పందానికి వచ్చారు. ఇప్పుడు ఆ ప్రాజెక్ట్ సాకారం కాబోతోంది. సుకుమార్ దర్శకత్వంలో ప్రస్తుతం 'రంగస్థలం 1985' సినిమా షూటింగ్‌లో ఉన్న రామ్‌చరణ్ అది పూర్తికాగానే బోయపాటి ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించే పనిలో పడతాడట.

జపమాలతో సీరియస్ లుక్


నాగార్జున

టాలీవుడ్ సీనియర్ స్టార్ నాగార్జున బర్త్‌డేను పురస్కరించుకొని మంగళవారం 'రాజుగారి గది2' ఫస్ట్‌లుక్ మోషన్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ స్టార్ హీరో మెంటలిస్ట్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి ఓంకార్ దర్శకుడు. అయితే రజనీకాంత్ నటించిన 'చంద్రముఖి' తరహాలో ఈ సినిమాలో నాగార్జున పాత్ర ఉండబోతుందని తెలిసింది. అయితే ఫస్ట్‌లుక్ మోషన్ పోస్టర్‌లో ఈ స్టార్ హీరో చేతిలో జపమాలతో కనిపించడం విశేషం. చేతికి పెద్ద ఉంగరంతో కనిపించిన నాగార్జున సీరియస్ లుక్‌తో అభిమానులు, ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాడు.

సాయి దన్సిక 'వాలు జడ'



'కబాలి'లో రజనీకాంత్ కూతురిగా నటించి ఆకట్టుకున్న సాయి దన్సిక లీడ్ రోల్‌లో నటిస్తున్న ద్విభాషా చిత్రం 'వాలుజడ'. ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను కాజల్ అగర్వాల్ విడుదల చేసింది. యదార్థ సంఘటనల ఆధారంగా రూపొందుతున్న ఈ మూవీ 50 శాతం షూటింగ్‌ను పూర్తిచేసుకుంది. సెప్టెంబర్ నుండి మరో భారీ షెడ్యూల్ జరుగనుంది. రమణ మల్లం 'వాలు జడ'తో దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. దన్సిక ఇందులో డిఫరెంట్ రోల్ చేస్తోంది. నవీన్ సంజయ్ హీరోగా చేస్తున్న ఈ చిత్రంలో బాలీవుడ్ సీనియర్ నటుడు నానా పాటేకర్ నటిస్తుండడం విశేషం. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీః సిద్ధార్థ రామస్వామి, మ్యూజిక్ః రాధన్, ఎడిటర్ః ప్రవీణ్ కె.ఎల్, స్టంట్స్ః అన్బు, అరియు.

ఫోన్ నుంచి ఫోన్‌కు వెళ్లే దెయ్యం!

సి.వి. ఫిలింస్ పతాకంపై కిరణ్, దివ్య జంటగా నటించిన చిత్రం 'మళ్లీ వచ్చిందా'. కె.నరేంద్రబాబు దర్శకత్వంలో వెంకటేష్.సి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. చిత్రీకరణ, నిర్మాణానంతర కార్యక్రమాలు పూర్తయ్యాయి. హైదరాబాద్‌లోని ఫిల్మ్ ఛాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రసన్నకుమార్ ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ''సస్పెన్స్ థ్రిల్లర్ సినిమాలకు ఎప్పుడూ క్రేజ్ ఉంటుంది. ఈమధ్యకాలంలో గంగా, రాజుగారి గది, ఆనందో బ్రహ్మ చిత్రాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఇది కూడా ఆ తరహా కథే. ఈ చిత్రం తప్పకుండా ప్రేక్షకాదరణ పొందుతుంది''అని అన్నారు. దర్శకుడు నరేంద్ర బాబు మాట్లాడుతూ ''దెయ్యానికి పగలు, రాత్రి అని ఏమీ ఉండదు. మనిషి నుంచి మనిషికి వెళ్లగలదు. ఇప్పటివరకు ఇలాంటి కథలు చాలా చూశాం. అయితే ఓ దెయ్యం ఫోన్ నుంచి ఫోన్‌కు కూడా వెళ్లి మనుషుల్ని భయపెట్టగలదని తెలిపే సినిమా ఇది. ఆద్యంతం ఉత్కంఠభరితంగా కొనసాగుతుంది. కథ వినగానే నిర్మాతలకు నచ్చి షూటింగ్ మొదలుపెట్టారు. హైదరాబాద్, బెంగుళూర్, మున్నార్ వంటి ప్రాంతాల్లో చిత్రీకరణ చేశాం. అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చే చిత్రమిది''అని తెలిపారు. నిర్మాత వెంకటేష్.సి మాట్లాడుతూ ''హార్రర్ కథకు సరిపోయే టైటిల్ 'మళ్లీ వచ్చిందా'. పూర్ణ.కె కెమెరా పనితనం సినిమాకు ప్లస్ అవుతుంది. గిరిధర్ దివాన అద్భుతమైన పాటలను అందించారు. సెన్సార్ పూర్తయింది. త్వరలో పాటలను విడుదల చేసి సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం''అని చెప్పారు. ఈ కార్యక్రమంలో పూర్ణ, హీరోహీరోయిన్‌లు కిరణ్, దివ్యారావు తదితరులు పాల్గొన్నారు.


దివ్య, కిరణ్

ఆ షోతో అదరగొట్టింది


జరీన్‌ఖాన్

బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్‌ఖాన్ సినిమాలో హీరోయిన్‌గా ఛాన్స్ దొరికిందంటే చాలు ఇక ఆమె స్టార్ హీరోయిన్ కావాల్సిందే. ఒకవేళ సల్మాన్‌తో నటించిన సినిమా నిరాశపరిస్తే తర్వాత ఏదో విధంగా ఛాన్సులు వస్తాయి. బాలీవుడ్‌లో ఈ సూపర్‌స్టార్ ఎంత చెబితే అంత అనే టాక్ ఉంది. అయితే సల్మాన్ 'వీర్' సినిమాలో హీరోయిన్‌గా నటించి అపజయాన్ని మూటగట్టుకున్న జరీన్‌ఖాన్ ఆతర్వాత ఈ స్టార్ హీరో సినిమా 'రెడీ'లో స్పెషల్ సాంగ్ చేసి ఆతర్వాత రెండు, మూడు సినిమాలు చేసినా ఆమెకు సరైన స్టార్‌డమ్ దక్కలేదు. దీంతో ఆతర్వాత ట్రయాంగిల్ లవ్ స్టోరీ అయిన 'హేట్ స్టోరీ 3'లో హాట్ హాట్‌గా నటించి మంచి విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. ఈ సినిమాలో ఇద్దరు హీరోలతో రొమాన్స్ చేసి బాక్సాఫీస్‌ను షేక్ చేసింది. అప్పటినుంచి గ్లామర్ గర్ల్‌గా మంచి పేరు తెచ్చుకొని ఆ తరహా క్యారెక్టర్స్‌లోనే నటిస్తోంది జరీన్. ఇక హిందీలో వీరప్పన్ సినిమాలో కూడా ఈ అమ్మడు ఓ స్పెషల్ సాంగ్‌కు చిందులేసింది. మళ్లీ చాలా రోజుల తర్వాత మరో ట్రయాంగిల్ లవ్ స్టోరీతో రాబోతోంది. అక్సర్ 2 సినిమాలో ఈసారి కూడా ఇద్దరు యంగ్ హీరోలతో రొమాన్స్ చేస్తూ బాక్సాఫీస్ హిట్‌పై కన్నేసింది. ఇటీవల విడుదలైన ఈ సినిమా ట్రైలర్ అమ్మడు సినిమాలో ఎలా ఉండబోతోందో చూపించేసింది. స్కిన్ షోలో ఏమాత్రం తగ్గకుండా ట్రైలర్‌లో అదరగొట్టింది జరీన్‌ఖాన్ . అనంత్ నారాయణన్ తెరకెక్కించిన ఈ సినిమా సెప్టెంబర్ 6న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.

నా టాలెంట్ మూలంగానే అవకాశాలు


తరుణ్ అరోరా

ఈ రోజుల్లో హీరోలు ఏ స్థాయిలో పాపులర్ అవుతున్నారో అదే స్థాయిలో విలన్‌లు కూడా పాపులర్ అవుతున్నారు. హీరోలకు ధీటుగా వారు ఆకట్టుకుంటున్నారు. అయితే టాలీవుడ్‌లో హీరోయిన్స్‌లాగే విలన్‌లు కూడా ఇతర భాషా నటులు కావడం ఇప్పుడు నడుస్తున్న ట్రెండ్. ఇదేవిధంగా టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన బాలీవుడ్ విలన్ తరుణ్ అరోరా. మెగాస్టార్ చిరంజీవి 151 సినిమాతో టాలీవుడ్‌లోకి ప్రవేశించి ప్రతినాయకుడిగా పాపులర్ అయ్యాడు. ఆతర్వాత పవన్‌కళ్యాణ్ 'కాటమరాయుడు' చిత్రంలో కనిపించి తనదైన శైలిలో ఆకట్టుకున్నాడు. బాలీవుడ్, కోలీవుడ్‌లో బిజీగా ఉన్న ఈ స్టార్ విలన్ గురించి ఓ వార్త హల్ చల్ చేస్తోంది. టాలీవుడ్‌లో 'ప్రేమించుకుందాం రా' సినిమాతో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చి ఆతర్వాత తెలుగులో మంచి క్రేజ్ తెచ్చుకున్న అంజలా జవేరీని పెళ్లి చేసుకున్న తర్వాతే తరుణ్ అరోరాకు కోలీవుడ్‌లో అవకాశాలు పెరిగాయని టాక్ వచ్చింది. దీనిపై అతను స్పందిస్తూ... ''నా భార్య అంజలాకు చాలా మంది సినీ ప్రముఖులతో పరిచయాలు ఉన్న విషయం వాస్తవమే. కానీ ఆమె రికమండేషన్ వల్లే నాకు అవకాశాలు వస్తున్నాయనడం పూర్తి అవాస్తవం. నా టాలెంట్ మూలంగానే నాకు సినీ ఆఫర్లు వస్తున్నాయి''అని

అందాలొలికించిన రాయ్‌లక్ష్మీ



చాలా సంవత్సరాల నుండి సౌత్‌లో పెద్ద హిట్లు కొట్టాలని చూసిన నార్త్ భామ లక్ష్మీ రాయ్ మంచి బ్రేక్‌ను మాత్రం తెచ్చుకోలేకపోయింది. చివరకు రాయ్‌లక్ష్మి అని పేరు మార్చుకొని సినిమాలు చేస్తోంది. మెగాస్టార్ చిరంజీవి కమ్‌బ్యాక్ మూవీ 'ఖైదీ నంబర్ 150'లో మెరిసింది ఈ అమ్మడు. కోలీవుడ్‌లో సందడి చేస్తున్న ఈ భామ ఇప్పుడు బాలీవుడ్‌లో అడుగుపెట్టి 'జూలీ2' సినిమా చేస్తోంది. ఇందులో పూర్తి స్థాయి రోల్ చేస్తున్న రాయ్‌లక్ష్మి ఈ సినిమాపై భారీ ఆశలే పెట్టుకుంది. ఈమధ్య కాలంలో బాలీవుడ్‌లో జరీన్‌ఖాన్, సనాఖాన్, డైసీ షా... ఇలా చాలా మంది భామలు మంచి హిట్‌ల కోసం సినిమాల్లో బోల్డ్ లుక్‌లలో దర్శనమిస్తూ అందాలను ఆరబోస్తున్నారు. చాలా క్రితం వచ్చిన 'జూలీ' సినిమాకు సీక్వెల్‌గా వస్తున్న 'జూలీ2' లో ఇప్పుడు రాయ్‌లక్ష్మి కూడా అలాగే కనిపిస్తోంది. తాజాగా విడుదలైన ఈ సినిమా టీజర్‌లో ఈ అమ్మడు హద్దుమీరి అందాలొలికించింది. టీజర్ అంతా ఆమె అందాలతోనే నింపేశాడు దర్శకనిర్మాత దీపక్ శివదాసాని. అండర్ వరల్డ్‌లోని నగ్న సత్యాలను చూపిస్తానంటూ రాయ్‌లక్ష్మి ని హాట్‌హాట్‌గా చూపించే ప్రయత్నం చేశాడు ఈ ఫిల్మ్‌మేకర్. ఈ భామ అందాలు తప్ప ఈ టీజర్‌లో పెద్దగా కంటెంట్ అయితే కనిపించట్లేదు. మరి ట్రైలర్‌లోనైనా రాయ్‌లక్ష్మి అందాలు కాకుండా సినిమా కథేమన్నా చెబుతారేమో చూడాలి.



ఇన్ఫోసిస్ ఫౌండేషన్ నుంచి వైదొలిగిన వందన సిక్కా

న్యూఢిల్లీ: ఇన్ఫోసిస్ మాజీ సిఇఒ విశాల్ సిక్కా భార్య వందన సిక్కా ఇన్ఫీ ఫౌండేషన్ యుఎస్ఎ చైర్‌పర్సన్ పదవి నుంచి వైదొలిగారు. దీంతో కంపెనీలో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఇటీవల కంపెనీలో సిక్కాతో సహా అనేక మంది రాజీనామా చేశారు. అనూహ్యంగా సిక్కా భార్య వందన సిక్కా ఐటీ సేవల దాతృత్వ సంస్థ ఇన్ఫోసిస్ ఫౌండేషన్ గుడ్‌బై చెప్పడం ప్రాధాన్యతను సంతరించుకుంది. కంపెనీకి చెందిన ఇ–మెయిల్ ద్వారా ఈ సమాచారం అందించారు. ఇన్ఫోసిస్ ఫౌండేషన్ యుఎస్ఎ ఛైర్ పర్సన్ పదవి నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నా నని తెలిపారు. అలాగే తన రాజీనామా విషయాన్ని తన బ్లాగ్‌లో, ట్విట్టర్‌లోనూ ప్రకటించారు. కంపెనీ సిఎండిగా విశాల్ సిక్కా రాజీనామాచేయడంతో ఆయన భార్య కూడా ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. రెండున్నర సంవత్సరాలు ఇన్ఫోసిస్ ఫౌండేషన్‌కు ఆమె పనిచేశారు. వందనా సిక్కా కంప్యూటర్ సైన్స్‌లో మాస్టర్స్ డిగ్రీ చేశారు. ఇన్ఫోసిస్ ఫౌండేషన్‌లో చేరకముందు ఒక స్టార్టప్ కంపెనీని ప్రారంభించాలని యోచించారు. కాగా ఇన్ఫోసిస్ కొత్త చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన నందన్ నిలేకనీ సంస్థలో కొత్త సిఇఒ నియామకం, ఇతర అంశాలపై దృష్టి పెట్టారు. ఆయన రాకతో కంపెనీ షేరు లాభాల్లో పయనించగా, పరిస్థితులు నిలకడగా మారాయి.

మార్కెట్లోకి ఇంటెక్స్ ఆక్వా స్టైల్ 3



న్యూఢిల్లీ: ఇంటెక్స్ టెక్నాలజీస్ మంగళవారం కొత్త స్మార్ట్‌ఫోన్‌ను మార్కెట్లోకి విడుదల చేసింది. 'ఆక్వా స్టైల్ 3' పేరుతో మార్కెట్లోకి తీసుకొచ్చిన ఈ ఫోన్ ధరను రూ.4,299గా కంపెనీ నిర్ణయించింది. 4జి విఒఎల్‌టిఇ సదుపాయం కలిగిన ఈ స్మార్ట్‌ఫోన్‌లో ఆండ్రాయిడ్ 7.0 నోగట్ ఓఎస్‌ను అందిస్తుండడం విశేషం. అమెజాన్ ఇండియా వెబ్‌సైట్‌లో ఎక్స్‌క్లూజివ్‌గా దీన్ని విక్రయించనున్నట్టు కంపెనీ వెల్లడించింది. ఈ ఫోన్‌లో ఫీచర్లు.. 5 అంగుళాల టచ్‌స్క్రీన్, ఆండ్రాయిడ్ 7.0 నోగట్ ఒఎస్, 1.3 గిగాహెడ్జ్ క్వాడ్ కోర్ ప్రాసెసర్, 5 ఎంపి బ్యాక్ కెమెరా, 5 ఎంపి ఫ్రంట్ కెమెరా, 2,500 ఎంఎహెచ్ బ్యాటరీ, 1 జిబి ర్యామ్, 16 జిబి ఇంటర్నల్ స్టోరేజీ (64 జిబి వరకు ఎక్స్‌పాండబుల్) ఉన్నాయి.

దీపావళికి రెనాల్ట్ కాప్చర్ కారు

ముంబయి: ఫ్రెంచ్ ఆటో దిగ్గజం రెనాల్ట్ కాప్చర్ కారును దీపావళికి విడుదలచేసే అవకాశం ఉంది. దేశవ్యాప్తంగా కొత్త కారును విడుదల చేయడం ద్వారా మార్కెట్ పరిధిని మరింత విస్తరించుకోవాలని కంపెనీ భావిస్తోంది. ఈ కారును భారత విపణిలోకి డిసెంబరు త్రైమాసికంలో విడుదల చేస్తామని రెనో కంపెనీ భారత యాజమాన్య సిఇఒ, మేనేజింగ్ డైరెక్టర్ సుమిత్ సానే తెలిపారు. అయితే ఎప్పుడు విడుదల చేస్తారనే విషయంపై ఆయన స్పష్టత ఇవ్వలేదు. ఈ కారులో ఐదు సీట్ల సామర్థ్యం, క్రాస్ ఓవర్ డిఎన్ఎ, ఫ్రెంచ్ నమూనా, ప్రొజెక్టర్ హెడ్‌ల్యాంప్స్ వంటి ఫీచర్లు ఉన్నాయని సానే వెల్లడించారు. విశ్లేషకుల అంచనా ప్రకారం,ఈ కారు 1.6 లీటర్ పెట్రోల్, 2 లీటర్ల డీజిల్ వంటి రెండు రకాల ఇంజిన్లలోనూ లభ్యం కానుంది. దీని ధర సుమారు రూ.12లక్షలుగా ఉండనుంది. ఈ కారు హ్యూందాయ్ క్రెటా, మహీంద్రా ఎక్స్‌యువి 500, టాటా హెక్సా, నిస్సాన్ కిక్స్ వంటి కార్లకు దీటుగా రానున్నట్లు నిపుణులు భావిస్తున్నారు.





స్టాక్ మార్కెట్


ఈరోజు మార్కెట్	ముగింపు	మార్పు	%
సెన్సెక్స్	31750.82	154.76	0.49%
నిఫ్టీ	9912.80	55.75	0.57%

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	64.4700
యూరో	70.4270
బ్రిటిష్ పౌండ్	83.4957
ఆస్ట్రేలియన్ డాలర్	47.4050
కెనడియన్ డాలర్	47.0500
ఎమిరైట్ దిర్హామ్	17.5040
స్విస్ ఫ్రాంక్	64.5500
చైనీస్ యువాన్	9.3344
మలేషియన్ రింగిట్	14.8460
న్యూజిలాండ్ డాలర్	44.4990
హాంగ్‌కాంగ్ డాలర్	8.2824
జపనీస్ యెన్	0.5688
కువైట్ దినార్	212.0888
సౌతాఫ్రికన్ రాండ్	4.7209

బులియన్






బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22క్యారట్	24క్యారట్	మార్పు(%)
చెన్నై	28490	30470.59	1.93%
ముంబై	28680	30673.80	0.81%
ఢిల్లీ	28000	29946.52	0%
కోల్‌కతా	28660	30652.41	0%
కేరళ	27550	29465.24	1.66%
బెంగళూరు	27500	29411.76	0%
హైదరాబాద్	28310	30278.07	1.29%
గల్ఫ్	1375.15	1470.75	0.03%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	మంగళవారం	సోమవారం	మార్పు (%)
చెన్నై	42000.00	41900.00	0.24
ముంబై	42000.00	41900.00	0.24
ఢిల్లీ	42000.00	41900.00	0.24
కోల్‌కత్తా	42000.00	41900.00	0.24
హైదరాబాద్	42000.00	41900.00	0.24




కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	355	విశాఖపట్నం	362
వరంగల్	357	చిత్తూరు	390
విజయవాడ	359	చెన్నై	397
గోదావరి	359	బెంగళూరు	382

జిఎస్‌టి వసూళ్లు 92,283 కోట్లు

జులైలో అంచనాలను మించాయి: కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ



న్యూఢిల్లీ: తొలి నెలలో జిఎస్‌టి(వస్తు, సేవల పన్ను) వసూళ్లు అంచనాలను మించాయని కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ పేర్కొన్నారు. జులై నెలలో రూ. 92,283 కోట్ల మేరకు జిఎస్‌టి పన్నులు వచ్చాయని తెలిపారు. జిఎస్‌టి కింద నమోదు చేసుకున్న 59.57 లక్షల మంది పన్ను చెల్లింపుదారులకు గాను 64.4 శాతం నుంచి వసూళ్లు వచ్చాయి. అంటే 38.4 లక్షల మంది రిటర్న్‌లను దాఖలు చేశారని జైట్లీ పేర్కొన్నారు. రూ.92,283 కోట్ల జిఎస్‌టి వసూళ్లలో రూ.14,894 కోట్లు కేంద్ర జిఎస్‌టి నుంచి వచ్చాయి. మిగతా రూ.22,722 కోట్లు రాష్ట్ర జిఎస్‌టి నుంచి, రూ. రూ.47,469 కోట్లు జిఎస్‌టి ఇంటిగ్రేటెడ్ జిఎస్‌టి నుంచి వచ్చాయి. మరో రూ.7,198 కోట్లు నష్టపరిహార సుంకం నుంచి వచ్చాయి.

జిఎస్‌టి వసూళ్లలో కీలక అంశాలు...

- జులై జిఎస్‌టి రిటర్న్‌ల నుంచి మొత్తం వచ్చినవి రూ.92,283 కోట్లు .. వీటిలో ఐ–జిఎస్‌టి రూ.47,469 కోట్లు, నష్టపరిహారం సుంకం నుంచి రూ.7,198 కోట్లు ఉన్నాయి.
- కేంద్ర జిఎస్‌టి రెవెన్యూ రూ.14,894 కోట్లు, రాష్ట్ర జిఎస్‌టి రెవెన్యూ రూ.22,722 కోట్లు ఉన్నాయి.
- 7.23 మిలియన్ల మంది పన్ను చెల్లింపుదారులు ఇప్పటికే జిఎస్‌టి పరిధిలోకి బదిలీ అయ్యారు. జిఎస్‌టి చెల్లింపుదారుల నుంచి ఆలస్య ఫైలింగ్ పెనాల్టీ వసూలు చేశారు.
- ఆలస్యంగా ఫైలింగ్‌కు గాను జరిమానా కింద కేంద్ర జిఎస్‌టి, రాష్ట్ర జిఎస్‌టిలకు రోజుకు రూ.100 పన్ను వేశారు.
- 59.57 లక్షల మంది పన్ను చెల్లింపుదారులకు గాను 38.4 లక్షల మంది రిటర్న్‌లను దాఖలు చేశారు.

1000 నోటును తీసుకొచ్చే ప్రతిపాదన లేదు

రూ.200 కొత్త నోటును చలామణిలోకి తీసుకొచ్చిన ప్రభుత్వం త్వరలో కొత్త రూ.1000 నోటును కూడా తీసుకొస్తున్న వార్తలు వచ్చాయి. అయితే అలాంటి ప్రతిపాదనేమీ లేదని ఆర్థిక మంత్రిత్వశాఖ ప్రకటించింది. గత ఏడాది నవంబర్ నెలలో రూ.1000 నోటును రద్దు చేసి, కొత్తగా రూ.2 వేలు, రూ.500 నోట్లను విడుదల చేశారు. కానీ వెయ్యి నోటు గురించి ఎలాంటి ప్రకటన చేయలేదు. రూ.1000 నోటును కూడా మళ్లీ చలామణిలోకి తీసుకురానున్నట్టు, డిసెంబర్ నాటికి వాటిని విడుదల చేసే అవకాశాలున్నాయని ఇటీవల కొన్ని మీడియా సంస్థలు పేర్కొన్నాయి. ఈ అంశంపై ఆర్థికశాఖ స్పష్టతనిచ్చింది. రూ.వెయ్యి నోటును మళ్లీ తీసుకొచ్చే ప్రతిపాదనేదీ లేదని ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి ఎస్‌సి గార్గ్ వెల్లడించారు. నోట్ల రద్దు అనంతరం ఏర్పడిన చిల్లర కష్టాలు తీర్చేందుకు రూ.200 నోటును ఆర్‌బిఐ ప్రవేశపెట్టింది. ఈ నేపథ్యంలో రూ.వెయ్యి నోటును కూడా మళ్లీ తీసుకొస్తారనే ఊహాగానాలు వినిపించాయి. కొత్త టెక్నాలజీ, భద్రతాపరమైన ఫీచర్లతో ఈ నోటును ఆర్‌బిఐ తీసుకురానున్నట్టు వచ్చిన వార్తలపై ఆర్థిక మంత్రిత్వశాఖ స్పష్టతనిచ్చింది. కాగా తక్కువ విలువ కలిగిన కరెన్సీలు లేకపోవడంతో ఆర్‌బిఐ కొత్త రూ.200, రూ 50నోట్లను విడుదల చేసింది. రూ.100, రూ.500 మధ్య మరో కరెన్సీ నోటు ఇప్పటి వరకూ లేదు. దీంతో రూ.200 నోటు మంచి ఆదరణ పొందుతుందని ఆర్‌బిఐ అంచనా వేస్తోంది. నోట్ల రద్దు తర్వాత పెద్ద నోట్లు రావడంతో ఎదురవుతున్న చిల్లర సమస్యలను ఈ నోటు పరిష్కరిస్తుందని భావిస్తున్నారు. తొలుత ఆర్‌బిఐ కార్యాలయాలు, కొన్ని బ్యాంకుల్లో మాత్రమే ఈ రూ.200 నోటును జారీ చేయనున్నట్టు ప్రకటించింది.



వొడాఫోన్‌పై రూ.7900 కోట్ల ఐటి జరిమానా



న్యూఢిల్లీ: ఆదాయం పన్ను శాఖ తాజాగా వొడాఫోన్‌పై రూ.7900 కోట్ల జరిమానా విధించింది. వొడాఫోన్ గ్రూప్‌కు భారత్‌లో మొబైల్ ఫోన్ వ్యాపారం విక్రయానికి సంబంధించి హచిసన్ హోల్డింగ్స్‌పై ఐటి జరిమానా విధించింది. రూ.7900 కోట్ల పన్ను డిమాండ్‌కు అంతేమొత్తంలో జరిమానా విధించింది. బిలీనియర్ లీ కాసింగ్‌కు చెందిన హచిసన్ హోల్డింగ్స్ లిమిటెడ్‌కు ఆదాయపు పన్ను శాఖ జరిమానా విధించింది. పన్ను, వడ్డీ, జరిమానాలు మొత్తం కలిపి రూ.32,320 కోట్లు చెల్లించాలని హచిసన్‌ను ఐటి శాఖ ఆదేశించింది. భారత్‌లో తమ మొబైల్ వ్యాపారాలను 11 బిలియన్ డాలర్లకు 2007లో బ్రిటన్‌కు చెందిన వొడాఫోన్ గ్రూప్‌కు విక్రయించారు. ఈ డీల్‌లో హచిసన్ టెలికాం భారీగా లబ్ధి పొందిందని, అయితే పన్నులు సరిగ్గా చెల్లించలేదని ఐటి పేర్కొంది. ఈ నోటీసుల్లో పన్ను రూ.7900 కోట్లు కాగ, రూ.16,430 కోట్లు వడ్డీ, రూ.7900 కోట్లు జరిమానా కింద తమకు చెల్లించాలని ఆదాయపు పన్ను శాఖ నోటీసులు జారీచేసినట్టు హచిసన్ పేర్కొంది. హచిసన్ నుంచి భారత్‌లో ఆస్తులు కొనుగోలు చేస్తే ఎలాంటి పన్ను చెల్లించాల్సినవసరం లేదని కంపెనీ వాదిస్తోంది. కోర్టు ఆదేశాల కు విరుద్ధంగా పన్ను నోటీసులున్నాయని పేర్కొంది.


బోర్డు అధ్వాన్న పాలన ఆందోళన కలిగించింది



న్యూఢిల్లీ: గత ఇన్ఫోసిస్ బోర్డు అధ్వాన్నమైన పాలనే తనను తీవ్ర ఆందోళనకు గురి చేసిందని కంపెనీ వ్యవస్థాపకుడు ఎన్ఆర్ నారాయణ మూర్తి పేర్కొన్నారు. తనపై వచ్చిన ఆరోపణలపై మూర్తి స్పందించారు. లోపాలను గుర్తించకుండా ఇన్ఫోసిస్ మాజీ బోర్డు సభ్యులు తనపై వ్యక్తిగత దాడికి దిగారని, అవి చాలా బాధ కలిగించాయని అన్నారు. విశాల్ సిక్కా రాజీనామా అనంతరం తలెత్తిన పరిస్థితులపై తొలిసారి పెట్టుబడిదారులతో మూర్తి సమావేశమయ్యారు. త్రైమాసిక ఫలితాలను, గైడెన్స్‌ను రిపోర్టు చేసిన తొలి కంపెనీ ఇన్ఫోసిస్‌నేని, గట్టి కార్పొరేట్ పాలనతో తాము ఇలాంటి ప్రమాణాలను ఆర్జించామని మూర్తి చెప్పారు. పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసమే తాను పోరాటం చేస్తున్నానని, అంతర్జాతీయ కంపెనీ స్థాయిని ఇన్ఫీ తిరిగి పొందడానికే ప్రయత్నిస్తున్నామని తెలిపారు. సిక్కా రాజీనామా అనంతరం బోర్డు సభ్యులు మూర్తిపై విమర్శలు గుప్పించిన విషయం తెలిసిందే. ఈ ఆరోపణలపై సరియైన వేదికపై సరియైన సమయంలో స్పందిస్తానని మూర్తి గట్టి జవాబిచ్చిన సంగతి తెలిసిందే. కంపెనీ మాజీ చైర్మన్ ఆర్ శేషసాయి, మాజీ సిఎఫ్ఒ రాజీవ్ బన్సాల్‌కు అధిక మొత్తంలో సెవరెన్స్ ప్యాకేజీ ఇచ్చారని మూర్తి ఆరోపించారు. రాజీవ్ బన్సాల్‌కు ఎక్కువ సెవరెన్స్ ప్యాకేజీ చెల్లించడాన్ని బోర్డు అంగీకరించిందని శేషసాయి తనకు చెప్పారని, కానీ వార్షిక సాధారణ సమావేశంలో శేషసాయి అబద్ధం ఆడినట్టు మూర్తి చెప్పారు. రాజీవ్ బన్సాల్‌పై మరింత విచారణ చేపట్టినప్పుడు శేషసాయి ఏం మాట్లాడలేకపోయారని తెలిపారు. సెవరెన్స్ పే విషయంపై జరిగిన సమావేశ మినిట్స్‌ను కూడా బోర్డు రికార్డు చేయలేదన్నారు. పైగా బన్సాల్ ఒప్పందాన్ని బహిర్గతం చేయలేమని జేఫ్ లేమన్ చెప్పినట్టు మూర్తి పేర్కొన్నారు. బోర్డు పారదర్శకంగా లేదని, తప్పుదోవ పట్టించే విధంగా ఉందన్నారు. బలహీనమైన పాలన పద్ధతులు కంపెనీలో ఉండటమే తన ముఖ్యమైన ఆందోళన అని చెప్పారు. నిలేకని నేతృత్వంలో మేనేజ్‌మెంట్ టీమ్ ర్యాలీ జరుపుతుందని తనకు విశ్వాసం ఉందని, ఇన్ఫోసిస్‌కు మళ్లీ ఆ కీర్తిని తీసుకొస్తుందని మూర్తి ధీమా వ్యక్తంచేశారు. నందన్ ఎంతో విలువలతో కూడిన వ్యక్తి అని, 15 ఏళ్లుగా తనకు నిలేకని తెలుసని మూర్తి చెప్పారు. కొత్త చైర్మన్‌గా నందన్ నిలేకనీని నియమించడంతో ఈక్విటీ మార్కెట్లలో ఇన్ఫోసిస్ షేరు ఉత్సాహంగా కనిపిస్తోంది. కంపెనీ షేర్లు లాభాల బాట పట్టాయి. విశాల్ సిక్కా ఇన్ఫీ సిఇఒ పదవి నుంచి అనూహ్యంగా రాజీనామా చేయడంతో ఇటీవల కంపెనీ షేర్లు భారీగా కుదేలైన విషయం తెలిసిందే. రెండు రోజుల్లోనే 15శాతం దాకా నష్టాలను చవిచూశాయి. కంపెనీ మార్కెట్ విలువ రూ.35వేల కోట్లకు పైగా క్షీణించింది. ఈ నేపథ్యంలో ఇన్ఫీ సహవ్యవస్థాపకుడు నందన్ నీలేకని పునరాగమనం చేశారు. ఇన్ఫీ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు.

అంతర్జాతీయ ఆందోళనలతో నష్టాలు

- సెన్సెక్స్ భారీగా 362 పాయింట్లు నష్టపోయింది
- మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసిన డెరివేటివ్ గడువు



న్యూఢిల్లీ: భౌగోళిక రాజకీయాల ఆందోళనలు స్టాక్‌మార్కెట్‌ను దెబ్బతీశాయి. జపాన్‌పై ఉత్తర కొరియా క్షిపణి ప్రయోగంతో ఇన్వెస్టర్లలో ఆందోళన నెలకొన్నాయి. అదే సమయంలో మదుపరులు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో సూచీలు భారీ నష్టాలను మూటగట్టుకున్నాయి. మంగళవారం సెన్సెక్స్ భారీగా 362 పాయింట్లు మేరకు నష్టపోయింది. దీంతో ఈ సూచీ 31,388 పాయింట్ల దిగువకు పడిపోయి.. వారం కనిష్టానికి చేరుకుంది. మరోవైపు నిఫ్టీ కూడా 116 పాయింట్ల నష్టంతో 9800 పాయింట్లు దిగువకు చేరింది. ఉదయం నుంచే స్టాక్‌మార్కెట్లు నష్టాలతో ప్రారంభమయ్యాయి. జపాన్ మీదుగా ఉత్తరకొరియా బాలిస్టిక్ క్షిపణి ప్రయోగం చేయడం అంతర్జాతీయ మార్కెట్లపై ప్రభావం చూపింది. దీంతో దేశీయ మార్కెట్లు కూడా ఒత్తిడికి గురయ్యాయి. దీంతోపాటు ఆగస్టు డెరివేటివ్ కాంట్రాక్టుల గడువు గురువారంతో ముగియనుండం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి టెక్ మహీంద్రా, ఎం అండ్ ఎం, జి ఎంటర్‌టైన్, విప్రో వంటి షేర్లు లాభాలను నమోదు చేశాయి. మరోవైపు బ్యాంక్ ఆఫ్ బరోడా, ఎన్‌టిపిసి, హిందాల్కో, ఐడియా సెల్యులార్, టాటాపవర్ మొదలైన షేర్లు నష్టాలతో ముగిశాయి.

రూ.30వేలు దాటిన బంగారం ధర

బంగారం ధర మళ్లీ రూ.30వేల మార్కును చేరుకుంది. మంగళవారం పది గ్రాముల బంగారం ధర రూ.550 పెరిగి రూ.30,450కి చేరుకుంది. ఈ ఏడాదిలో ఇదే గరిష్ఠ పెరుగుదలగా ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. జపాన్ మీదుగా ఉత్తరకొరియా బాలిస్టిక్ క్షిపణి ప్రయోగం చేయడం, అమెరికా, ప్యాంగ్యాంగ్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడం వంటి ఆందోళనలు అంతర్జాతీయ మార్కెట్లపై ప్రభావం చూపాయి. అంతర్జాతీయంగా బంగారం 0.90శాతం పెరగడంతో ఔన్సు ధర 1,322.41 డాలర్లకు చేరింది. బంగారం బాటలోనే వెండి పయనించింది. కిలో వెండి రూ.900 పెరిగి రూ.41వేల మార్కును చేరుకుంది. ప్రస్తుతం వెండి ధర రూ.41,100గా ఉంది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి డిమాండ్ రావడంతో వెండి ధర పెరిగినట్లు మార్కెట్ వర్గాలు వెల్లడించాయి.



ఎగవేతదారుల రెండో జాబితా సిద్ధం

మరో 30–40 కంపెనీలపై చర్యలు చేపట్టనున్న రిజర్వు బ్యాంక్



న్యూఢిల్లీ: పన్ను ఎగవేతదారుల భరతం పట్టేందుకు ఆర్‌బిఐ(భారతీయ రిజర్వు బ్యాంక్) వేగవంతమైన చర్యలు చేపట్టింది. మొండి బకాయిల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ఇప్పటికే 12 కంపెనీలను ఎన్‌సిఎల్‌టి(నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్)కి పంపిన ఆర్‌బిఐ.. తాజాగా మరో 30–40 కంపెనీలపై చర్యలకు సిద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా 40కిపైగా కంపెనీల పేర్లతో ఒక జాబితాను తయారు చేసినట్టు సమాచారం. కొత్త జాబితాలో వీడియోకాన్, కాస్టెక్స్ టెక్నాలజీస్, విసా స్టీల్, జెఎస్‌పిఎల్ తదితర కంపెనీలు ఉండొచ్చని ఎకనమిక్ టైమ్స్ నివేదిక పేర్కొంది. ఈ జాబితాలో అధిక శాతం కంపెనీలు ఇన్‌ఫ్రా, విద్యుత్ రంగాలకు చెందినవి ఉండడం గమనార్హం. సెప్టెంబర్‌లో ఈ జాబితాను విడుదల చేయవచ్చని అధికార వర్గాల సమాచారం. ఈ వార్తల నేపథ్యంలో జాబితాలో ఉండొచ్చని అనుమానం ఉన్న కంపెనీల షేర్లు నష్టాల్లో ట్రేడవుతున్నాయి. విసా స్టీల్ 1.24 శాతం, వీడియోకాన్ 3 శాతం, ఉత్తమ్‌గాల్వా అర శాతం, జెఎస్‌పిఎల్ 2.5 శాతం మేర నష్టాల్లో ఉన్నాయి. జాబితా తయారీ అనంతరం ఆయా కంపెనీలపై చర్యలకోసం ఎన్‌సిఎల్‌టిని సంప్రదించాలని అప్పులిచ్చిన బ్యాంకులకు ఆర్‌బిఐ ఆదేశాలివ్వనుంది. ఇప్పటికే ఇలాంటి ఎగవేత కంపెనీలతో ఆర్‌బిఐ ఒక జాబితా విడుదల చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం పేర్కొంటున్న కంపెనీలన్నీ కలిపి సుమారు 1.75 లక్షల కోట్ల రూపాయల మేర బ్యాంకులకు బకాయి ఉండవచ్చని అంచనా ఉంది. ఎకానమిక్స్ టైమ్స్ నివేదిక ప్రకారం రిజర్వ్ బ్యాంక్ రెండవ జాబితాలో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, పవర్ సెక్టార్ కంపెనీలు ఉండనున్నాయని తెలుస్తోంది. ఉత్తమ్ గాల్వా, వీడియోకాన్, విసా స్టీల్, కాస్టెక్స్ టెక్నాలజీస్ , జెఎస్‌పిఎల్ తదితర కంపెనీలు ఇందులో ఉండనున్నాయని సమాచారం. అయితే ఈ వార్తాలపై ఆయా కంపెనీల నుంచి ఎలాంటి స్పందన రాలేదు. రానున్న రోజుల్లో పలు కంపెనీల షేర్లు నష్టాల దిశగా వెళ్లనున్నాయి. దీంతో మార్కెట్లో వాటి పరిస్థితి మరింత అధ్వాన్నంగా మారే అవకాశం కనిపిస్తోంది.

పిఎస్‌బి షేర్లు నేల చూపులు

ఆర్థిక పరిస్థితి బాగాలేని కొన్ని ప్రభుత్వ రంగ బ్యాంకులపై ఆర్‌బిఐ పరిమితులు విధించిన నేపథ్యంలో పలు పిఎస్‌బిల షేర్లు నష్టాల దిశగా పయనిస్తున్నాయి. బ్యాంకుల డిపాజిట్ వృద్ధి రేటు పడిపోవడం ఆయా బ్యాంకులపై కస్టమర్లకు సడలుతున్న విశ్వాసాన్ని చూపుతోంది. దీంతో సదరు ఆరు పిఎస్‌బిలపై ఆర్‌బిఐ తాజాగా పిసిఎ(ప్రాంప్ట్ కరెక్టివ్ యాక్షన్)ను సంధించింది. పిసిఎ విధించిన అనంతరం ఆయా బ్యాంకులు తమతమ వ్యాపార విస్తరణ కార్యకలపాలను పరిమితం చేయాల్సి ఉంటుంది. మొండిపద్దులు మితిమీరినప్పుడు, వరుసగా రెండేళ్లు నష్టాలే నమోదు చేస్తున్నప్పుడు పిసిఎ కొరడాను ఆర్‌బిఐ ఝుళిపిస్తుంది. ప్రస్తుతం ఆర్‌బిఐ పిసిఎ సంధించిన బ్యాంకుల జాబితాలో దేనాబ్యాంక్, సెంట్రల్‌బ్యాంక్, ఐడిబిఐ బ్యాంక్, ఐఒబి, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, యుకో బ్యాంక్ ఉన్నాయి. ఈ బ్యాంకుల డిపాజిట్ల వృద్ధి ఇటీవల కాలంలో గణనీయంగా పడిపోయిన సంగతి తెలిసిందే. బ్యాంకుల్లో మొండి బకాయిలు నెల నెలా పెరిగిపోతున్నాయి. దీంతో రిజర్వు బ్యాంక్ మరింతగా కఠిన చర్యలు చేపడుతూ ప్రభుత్వ బ్యాంకులకు చుక్కలు చూపిస్తోంది.

మా నిర్ణయాలు సాహసోపేతం : ప్రధాని మోడీ

ఉదయ్‌పూర్ (రాజస్థాన్): తమ ప్రభుత్వం వివిధ నిర్ణయాలను సాహసంతో, వివేకంతో ఆచితూచి తీసుకుంటున్నదని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అన్నారు. గత ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాల వల్ల వ్యవస్థ మొత్తం గందరగోళంగా మారిపోయిందని విమర్శించారు. ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారం చేపట్టిన సమయంలో వ్యవస్థ మొత్తం అస్తవ్యస్తంగా ఉందని అన్నారు. రాజస్థాన్‌లో రూ.15 వేల కోట్లకు పైగా వ్యయంతో చేపట్టే అనేక హైవే ప్రాజెక్టులను ప్రారంభించి, శంకుస్థాపనలు చేయడానికి మోడీ ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా మంగళవారం ఖెల్గాన్‌లో నిర్వహించిన భారీ ర్యాలీలో ప్రధాని ప్రసంగించారు. తాము భిన్నమైన నేపథ్యం నుంచి వచ్చామని, సవాళ్లను స్వీకరించి తగిన పరిష్కారాలు చూపుతామని, అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. తాము చేపట్టిన అభివృద్ధి పనులను పూర్తి చేయడానికి శ్రమిస్తామని, సాహసంతో కూడిన నిర్ణయాలు తీసుకుంటామని, వాటిని వివేకంతో సమీక్షించుకుంటామని చెప్పారు. ప్రస్తుతం చేపడుతున్న మౌలిక వసతుల కల్పన ప్రాజెక్టులు రాజస్థాన్ రూపురేఖలను మార్చి వేస్తాయని అన్నారు. తాము ఇప్పటి వరకు మొత్తం 873 కిలోమీటర్ల పొడవైన 11 జాతీయ రహదారుల ప్రాజెక్టులను పూర్తి చేసి జాతికి అంకితం చేశామని అన్నారు.



పట్టాలు తప్పిన దురంతో

పది రోజుల్లో ఇది నాలుగో రైలు ప్రమాదం

ఆసాన్‌గావ్: కొండచరియ విరిగిపడటంతో నాగ్‌పూర్–ముంబై మధ్య ప్రయాణించే దురంతో ఎక్స్‌ప్రెస్ మహారాష్ట్రలో మంగళవారం తెల్లవారు జామున పట్టాలుతప్పింది. ఇంజిను, మరో తొమ్మిది బోగీలు వాసింద్–ఆసాన్‌గావ్ స్టేషన్ల మధ్య ఉదయం 6.30 గంటల ప్రాంతంలో పట్టాలు తప్పాయని రైల్వే శాఖ సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. రైలులో మొత్తం 18 బోగీలున్నాయి. ప్రయాణికులు గాయపడినట్లు ఇప్పటివరకు తమకు సమాచారం అందలేదని మధ్య రైల్వే (సెంట్రల్ రైల్వే) చీఫ్ పిఆర్ఓ సునీల్ ఉదాసి తెలిపారు. 'భారీ వర్షాల వల్ల ఉన్నట్లుండి ఒక కొండ చరియ విరిగిపడటంతో రైలు పట్టాలు తప్పింది. అయితే డ్రైవరు సమయ స్ఫూర్తితో అత్యవసర బ్రేకులు వేయడంతో భారీ ప్రమాదం తప్పింది. ప్రమాద సహాయక రైలుతో పాటు మా సహాయక బృందం, ఇంజినీరింగ్ సిబ్బంది ఘటనాస్థలికి హుటాహుటిన చేరుకున్నారు' అని ఆయన చెప్పారు. మరో అధికారి మాత్రం ఈ ఘటనకు అసలైన కారణం తెలియరాలేదన్నారు. 'కొద్దిరోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల కాసర ఘాట్స్ సెక్షన్‌లో రైలు పట్టాలు కొంతవరకు దెబ్బతిన్నాయనే అనుమానం మాకు కల్గుతోంది' అని ఆయన చెప్పారు. మరోవైపు ప్రయాణికుల సౌకర్యార్థం సిఎస్‌ఎంటి, థానే, కల్యాణ్, దాదర్, నాగ్‌పూర్ స్టేషన్ల వద్ద హెల్ప్‌లైన్ సదుపాయాన్ని ఏర్పాటు చేశామని ఆయన అన్నారు. ఇంజినుతో పాటు కనీసం ఆరు బోగీలు పట్టాలు తప్పాయని ప్రయాణికుల్లో ఒకరైన పిటిఐ ప్రతినిధి జస్టిన్ రావ్ చెప్పారు. తానున్న ఎ2 బోగీ కూడా పట్టాలు తప్పిందని ఆయన చెప్పారు. ఈ ఘటన జరిగినపుడు చాలా మంది ప్రయాణికులు నిద్రిస్తున్నారని ఆయన అన్నారు. రైలు పట్టాలు తప్పడంతో కొందరు ప్రయాణికులు తమ బెర్త్‌లపై నుండి కింద పడిపోయారని, వాష్‌రూమ్‌లలో ఇరుక్కుపోయిన మరికొంతమందిని సురక్షితంగా బయటకు తీశామని రావ్ చెప్పారు. ఘటనాస్థలికి సెంట్రల్ రైల్వేకి చెందిన సహాయక బృందం చేరుకున్నాక పరిస్థితి చక్కబడిందని ఆయన అన్నారు. వైద్యులు, సీనియర్ అధికారుల బృందం కూడా అక్కడకు చేరుకుందని ఆయన చెప్పారు. కాగా, గడచిన పది రోజుల్లో దేశంలో సంభవించిన రైలు ప్రమాదాల్లో ఇది నాలుగోది కావడం గమనార్హం. యుపిలో ఐదు రోజుల వ్యవధిలో ఉత్కళ్, కైఫియత్ ఎక్స్‌ప్రెస్‌లు పట్టాలు తప్పాయి. ఉత్కళ్ రైలు ప్రమాదంలో 23 మంది ప్రాణాలు కోల్పోగా, 60 మందికి పైగా గాయపడగా, కైఫియత్ రైలు ఘటనలో దాదాపు వంద మందికి పైగా గాయపడ్డారు. ఈ నెల 25న ముంబైలో అంధేరి వెళ్లే లోకల్ రైలుకు చెందిన ఆరు బోగీలు పట్టాలు తప్పాయి. ఈ ఘటనలో ఆరుగురు ప్రయాణికులు గాయపడ్డారు.



ముంబయి జలదిగ్బంధం




- జనజీవనం అస్తవ్యస్తం
- నిలిచిపోయిన బస్సులు, రైళ్లు, విమాన సర్వీసులు
- 3 గంటల్లోనే రికార్డు స్థాయిలో 65 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు!

ముంబయి: దేశ ఆర్థిక రాజధాని ముంబయి నగరాన్ని మంగళవారం భారీ వర్షాలు ముంచెత్తాయి. ఎడతెరిపి లేని వర్షాలకు తోడు బలమైన ఈదురుగాలులతో నగరవాసులు చిగురుటాకుల్లా వణికిపోయారు. రహదారులు జలాశయాలను తలపించాయి. రహదారితో పాటు రైలు రాకపోకలు కూడా స్తంభించిపోయాయి. విమానసేవలకూ తీవ్ర అంతరాయమేర్పడింది. భారీ వృక్షాలు నేలకొరిగాయి. లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. పర్యవసానంగా జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. మూడు గంటల్లోనే నగరంలో 65 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. లోయర్ పారెల్, దాదర్, కుర్లా, అంధేరి, ఖర్ వెస్ట్, ఘట్‌కోపర్, సియోన్, హింద్‌మాతా ప్రాంతాల్లోని సుందర రహదారుల్లో వేలాదిగా వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఈస్టర్న్ అండ్ వెస్టర్న్ ఎక్స్‌ప్రెస్ హైవే, సియోన్–పన్‌వెల్ హైవే, ఎల్‌బిఎస్ మార్గ్ సహా ముఖ్యమైన రహదారులపై ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఆయా రోడ్లపై కొన్ని గంటల పాటు మోకాలి నుండి నడుం లోతు వరకు నీళ్లు నిలిచిపోవడంతో వాహనదారులు నానా తిప్పలు పడ్డారు. మరోవైపు పలు ప్రాంతాల్లో రైలు పట్టాలు నీట మునగడంతో సెంట్రల్, నార్త్, హార్బర్ మార్గాల్లో రైళ్లు ఆలస్యంగా ప్రయాణించడం లేదా నిలిచిపోయాయని అధికారులు తెలిపారు. గంటల తరబడి నిరీక్షణ అనంతరం నీటి మట్టం తగ్గాక ప్రయాణికులు రైళ్ల నుండి బయటకు దూకి పట్టాల వెంట ఈదుకుంటూ గమ్యస్థానాలను చేరుకున్నారు. భారీ వర్షాలకు నగరంలోని పలు ప్రాంతాల్లో రహదారులపై చెట్లు విరిగిపడటం, ఇంటి గోడలు, పైకప్పులు కూలినప్పటికీ, ఎవరూ మరణించడం లేదా గాయపడటం లాంటివి జరగలేదని ముంబై మహానగర పాలక సంస్థ వర్గాలు తెలిపాయి. సోమవారం రాత్రి నుండి ముంబై నగరంలో భారీ వర్షం కురుస్తోంది. మంగళవారం ఉదయం 8.30–మధ్యాహ్నం 12 గంటల మధ్య 65 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని డిప్యూటీ మున్సిపల్ కమీషనర్ సుధీర్ నాయక్ పిటిఐ వార్తా సంస్థకు తెలిపారు. రానున్న మరో 48 గంటల్లో ముంబై, దక్షిణ గుజరాత్, కొంకణ్, గోవా, పశ్చిమ విదర్భ లాంటి ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని పుణెలోని వాతావరణ శాఖ అధిపతి (పర్యావరణ పర్యవేక్షణ, విశ్లేషణ విభాగం) ఎకె శ్రీవాత్సవ్ చెప్పారు.

ముఖ్యమంత్రి ఫడ్నవీస్ సమీక్ష

భారీ వర్షాల వల్ల ముంబై నగరం సంద్రాన్ని తలపించడంతో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ పరిస్థితిని సమీక్షించారు. రాష్ట్ర విపత్తు నిర్వహణ నియంత్రణ (ఎస్‌డిఎంసి) కేంద్రానికి వెళ్లి అక్కడ అధికారులను కలిశారు. మంత్రాలయలోని రాష్ట్ర సచివాలయ ఉద్యోగులు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులు త్వరగా ఇంటికి చేరుకోవాలని ఆదేశించినట్లు ఆయన చెప్పారు. ఉద్యోగులను త్వరగా ఇళ్లకు పంపాలంటూ ప్రైవేటు సంస్థలకు కూడా సూచించానని ఆయన అన్నా రు. పరిస్థితిని ఎప్పటికప్పుడు నిశితంగా పరిశీలిస్తున్నామని, అవసరమైన మేరకు తగు చర్యలు తీసుకునే విధం గా సంబంధిత యంత్రాంగాలను అప్రమత్తం చేశామని ఆయన చెప్పారు.



ముంబయిలో మంగళవారంనాడు కురిసిన కుండపోత వర్షానికి నిదర్శనం ఈ చిత్రం. తొలుత వాన నెమ్మదిగా మొదలైనప్పుడు కనిపిస్తున్న ఈ చిత్రంలో భవనాలు వర్షం ఉధృతి పెరగడంతో క్రమంగా కనుమరుగైన దృశ్యం.





'సుప్రీం'లో ఆరుకు చేరిన ఖాళీలు

న్యూఢిల్లీ : భారత అత్యున్నత న్యాయస్థానంలో న్యాయమూర్తుల ఖాళీల సంఖ్య ఆరుకు చేరింది. మంగళవారం జస్టిస్ ప్రఫుల్లా చంద్రపంత్ పదవీ విరమణ పొందడంతో సుప్రీంకోర్టులో న్యాయమూర్తులు 31 నుంచి 25కు తగ్గారు. దీంతో తాజాగా ఏర్పడిన ఈ ఖాళీలను భర్తీ చేయడం కొత్త ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రాకు తొలి ప్రాధాన్యంగా మారింది. ప్రధాన న్యాయమూర్తితో కలిపి 'సుప్రీం'లో గరిష్టంగా 31 మంది న్యాయమూర్తులు ఉండాలి. ఈ కోర్టులో న్యాయమూర్తి పదవీ విరమణ వయస్సు 65 సంవత్సరాలు. ఈ ఖాళీలను భర్తీ చేసేందుకు సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సుల కోసం కేంద్ర ప్రభుత్వం వేచి చూడాల్సి వస్తోందని సీనియర్ ప్రభుత్వ అధికారి ఒకరు తెలిపారు. ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ కెఎస్ ఖేహర్ ఆదివారం పదవీ విమరణ పొందగా, జస్టిస్ పంత్ మంగళవారం రిటైరయ్యారు. కాగా, ఈ ఏడాదిలో పదవీ విరమణ పొందేవారు లేరు. గతేడాది మేలో నలుగురు న్యాయమూర్తులు నియమితులయ్యారు. ఎఎం ఖన్విల్కర్, డివై చంద్రాచూడ్, అశోక్ భూషణ్, ఎల్.నాగేశ్వరరావులు వీరిలో ఉన్నారు.

రబ్రీ, తేజస్విలను ప్రశ్నించిన ఐటి

పాట్నా: రాష్ట్రీయ జనతాదళ్ అధినేత లాలూప్రసాద్ యాదవ్ భార్య రబ్రీ దేవీ, కుమారుడు తేజస్వీ యాదవ్‌ను మంగళవారం ఆదాయపు పన్ను శాఖ ప్రశ్నించింది. వారు రూ. 1000 కోట్ల విలువ చేసే బినామీ ఆస్తులు, భూముల కొనుగోలు చేసిన దర్యాప్తులో భాగంగానే ప్రశ్నించారు. వారిద్దరిని ఇక్కడి ఆదాయపు పన్ను శాఖ కార్యాలయానికి పిలిపించి వారి వాగ్మూలాలను రికార్డు చేశారు. దర్యాప్తు అధికారికి సహకరించేందుకుగాను ఢిల్లీ నుంచి ప్రత్యేక ఆదాయపు పన్ను శాఖ బృందం బీహార్ రాజధాని పాట్నాకు చేరుకుందని ఐటి అధికారులు తెలిపారు. దీనికి ముందు లాలూ కూతురు మీసా భారతి, ఆమె భర్త శైలేష్ కుమార్‌ను కూడా ఐటి శాఖ ప్రశ్నించింది. ఇక్కడ గమనించాల్సిన విషయమేమిటంటే లాలూ, రబ్రీ, తేజస్వి, చందా, రాగిణి యాదవ భారతి, శైలేష్ కుమార్‌లకు జూన్‌లోనే ఆస్తుల జప్తు నోటీసలను ఐటి శాఖ జారీ చేసింది. ఢిల్లీ, బీహార్లలో అనేక ప్లాట్లు, భవనాలకు ఇప్పటికే జప్తు కూడా చేసింది. బినామీ ఆస్తుల డీడ్ విలువ రూ. 9.32 కోట్లు ఉంటుందని ఆదాయపు పన్ను శాఖ ఆరోపించింది. కానీ వాటి మార్కెట్ విలువ రూ. 170– 180 కోట్ల మేరకు ఉండొచ్చని పన్ను అధికారులు భావిస్తున్నారు. అయితే ఈ కేసులు తన కుటుంబంపై రాజకీయ కక్షతో చేస్తున్నవేనని లాలూ ప్రసాద్ విమర్శించారు. లాలూ ప్రసాద్ యాదవ్ కుటుంబ సభ్యుల ఈ బినామీ కేసులను సంబంధిత కోర్టులో దాఖలు చేయనున్నట్లు కూడా ఆ శాఖ పేర్కొంది.

నీట్ అర్హులకు సుప్రీంలో ఊరట

న్యూఢిల్లీ: డీమ్డ్ యూనివర్సిటీలలో 2017–18 విద్యాసంవత్సరం ఎంబిబిఎస్, బిడిఎస్ ప్రవేశాలకు కౌన్సెలింగ్ తేదీని సుప్రీంకోర్టు సెప్టెంబర్ 7 వరకు పొడిగించింది. దీంతో నీట్ పరీక్షల్లో అర్హత సాధించిన విద్యార్థులకు ఊరట లభించింది. అయితే ఈ పొడిగింపు కేవలం డీమ్డ్ యూనివర్సిటీలకేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దీని తర్వాత మళ్లీ పొడిగింపు తేదీ ఏది ఉండబోదని కూడా తెలిపింది. వివిధ రాష్ట్రాలలోని నీట్ సీట్ల కౌన్సెలింగ్ చివరి చర్య అయిన మాపప్ రౌండ్ ఆగస్టు 31కే ముగిసింది. జాబితాను వెబ్‌సైట్లో ఉంచాలని, అలాగే అన్ని డీమ్డ్ యూనివర్సిటీలకు ఇ–మెయిల్స్ పంపాలని ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా, న్యాయమూర్తులు ఎ.ఎం.ఖాన్విల్కర్, డి.వై.చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. మాపప్ రౌండ్ కౌన్సెలింగ్‌ను తాజాగా 2017 సెప్టెంబర్ 7 వరకు పొడిగించారు. అయితే ఈ పొడిగింపు కేవలం డీమ్డ్ వర్సిటీలకే వర్తిస్తుందని ధర్మాసనం పేర్కొంది. ఇప్పటికీ డీమ్డ్ వర్సిటీలలో 5500కు పైగా సీట్లు ఖాళీగా ఉన్నాయని కౌన్సెలింగ్ నిర్వహించే డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్(డిజిహెచ్‌ఎస్) కోర్టుకు తెలిపింది, దాంతో 5500 సీట్లకు 55000 విద్యార్థుల చొప్పున అంటే 1:10 నిష్పత్తిలో పిలవాలని కోర్టు ఆదేశించింది.

హూస్టన్ అతలాకుతలం

అమెరికాలో హార్వే బీభత్సానికి 9 మంది మృతి, 30 వేల ఇళ్లు ఖాళీ

హూస్టన్: టెక్సాస్ ఆగ్నేయ భాగాన్ని హార్వే తుఫాన్ ఇంకా అతలా కుతలం చేస్తూనే ఉంది. భారీ వర్షాలు, వరదలు ముంచెత్తుతుండడంతో 9 మంది మరణించారు. హైవేలు మునిగిపోయాయి. అమెరికాలో నాలుగవ అతిపెద్ద నగరమైన టెక్సాస్‌లో చాలా ఇళ్లు నీటమునిగాయి. ఈ ప్రాంతంలో 30,000ఇళ్లనుంచి జనాన్ని తరలించవలసి వస్తుందని అధికారులు తెలిపారు. బోట్ల లో బాధితులను సహాయకులు తరలిస్తున్నారు. వరదలను దాటే ప్రయత్నంలో సిక్సిస్‌కు చెందిన కుటుంబం ఒకటి కుతోసహామునిగి పోయినట్లు తెలిసింది. పారిపోయేవీలు లేక నలుగురు పిల్లలతో సహా వారంతా చనిపోయారు. సోమవారం విడవ కుండా కురిసిన వర్షం వరదలకు దారితీసింది. దాన్తో హూస్టన్ నగరం తీవ్రంగా దెబ్బ తింది. హూస్టన్ నుంచి న్యూ ఆరీన్స్ దాకా కోటీ 30 లక్షల మందిని వరద ప్రమదంలో ఉన్నారు. హార్వీ ప్రభావంతో ఆగ్నేయ టెక్సాస్ ఒక నీటి మ డుగుగా మారింది. మరి 24 సెంటిమీటర్ల వాన కురిసే అవకాశంఉందని హెచ్చరికలు జారీ అ య్యాయి. రేపటికి వర్షపాతం 50 అంగుళాలను చేరుకొంటుందని కూడా భయపడుతున్నారు.

భారతీయ విద్యార్థులు క్షేమం

హూస్టన్‌లో నీట చిక్కిన వందలాది మంది భారతీయులను వారి ఇళ్లవద్దకు వెళ్లి సహాయకులు రక్షించారు. వారు తినడానికి ఏమీ లేకుండా కష్టాలు పడ్డారు. హూస్టన్ యూనివర్శిటీలో 200 మంది భారతీయ విద్యార్థులు చిక్కడిపోయి ఉన్నారు. వారిని సురక్షిత ప్రింతాలకు తరలిస్తున్నారు. బైరన్ సరస్సులో ఇద్దరు భారతీయ విద్యార్థులు దాదాపుగా మునిగి పోయారు. ప్రస్తుతం వారు ఆసుపత్రిలో ప్రమాదకర పరిస్థితిలో ఉన్నారు. వారు 20ఏళ్ల నిఖిల్ భాటియా, షాలినిగా గుర్తించారు. వారు టెక్సాస్‌లోని ఎ అండ్ ఎం వర్శిటీ విద్యార్థులు. ఈత కోసం వారు శనివారం బైరాన్ లేక్‌కు వెళ్లి మునిగిపోబోగా సహాయకులు రక్షించారు. వారిని ఇక్కడి సెయింట్ జోసఫ్ ఆసుపత్రిలో చేర్చారు.



బాబా రాంపాల్ నిర్దోషి



హిసార్: రెండు క్రిమినల్ కేసుల్లో సరైన సాక్ష్యాధారాలు లేవని పేర్కొంటూ రాంపాల్ బాబాను ఇక్కడి కోర్టు ఒకటి మంగళవారం నిర్దోషిగా ప్రకటించింది. ఈ కేసులో ఆయనతో పాటు ఆయన అనుచరులకు కూడా విముక్తిని ప్రసాదిస్తూ జుడీషియల్ మెజిస్ట్రేట్ (హిసార్) ముకేశ్ కుమార్ తీర్పునిచ్చారు. 'రెండు క్రిమినల్ కేసుల్లో రాంపాల్‌ను కోర్టు నిర్దోషిగా ప్రకటించింది. అయితే దేశద్రోహం లాంటి ఇతర అభియోగాలను కూడా ఎదుర్కొంటున్నందు వల్ల ఆయన జైలులోనే ఉండనున్నారు' అని ఆయన తరపు న్యాయవాది ఎపి సింగ్ ఇక్కడ విలేకరులకు తెలిపారు. రాంపాల్ బర్వాలాలోని సత్యలోక్ ఆశ్రమాన్ని నడిపిస్తున్నారు. కాగా, డేరా సచ్చా సౌధా చీఫ్ గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ కేసు విచారణ నేపథ్యంలో హర్యానా, పంజాబ్ రాష్ట్రాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో రాంపాల్ కేసు విచారణను ఈ నెల 29కి మెజిస్ట్రేట్ వాయిదా వేశారు. నవంబరు 17, 2014న రాంపాల్ ఆయన అనుచరులపై ఐపిసిలోని సెక్షన్ 186 (విధులు నిర్వర్తించకుండా ప్రభుత్వోద్యోగిని అడ్డుకోవడం), సెక్షన్ 332 (ప్రభుత్వోద్యోగి తన విధులు నిర్వర్తించకుండా ఉద్దేశపూర్వకంగా హాని కల్గించడం), సెక్షన్ 353 (ప్రభుత్వోద్యోగి తన విధులు నిర్వర్తించకుండా దాడి చేయడం లేదా నేరపూరిత శక్తులను వినియోగించడం) కింద ఒక కేసు నమోదైంది.

అవిభక్త కవలల తొలి దశ సర్జరీ సక్సెస్

న్యూఢిల్లీ: ఒడిశాకి చెందిన రెండేళ్ల అవిభక్త కవలల విడదీతకు సంబంధించి ఇక్కడ ఎయిమ్స్‌లో చేపట్టిన శస్త్రచికిత్స తొలి దశ సర్జరీ విజయవంతంగా పూర్తయిందని వైద్యులు తెలిపారు. చిన్నారుల తలలు పరస్పరం అతుక్కుపోయినందు వల్ల వాటిని విడదీయడం కోసం చేపట్టిన ఈ సర్జరీకి దాదాపు 20 గంటల సమయం పట్టింది. 'సోమవారం ఉదయం సుమారు 9 గంటల ప్రాంతంలో మొదలైన ఈ సర్జరీ మంగళవారం తెల్లవారుజామున 5 గంటల వరకు కొనసాగింది. పిల్లలు ప్రస్తుతం పరిశీలనలో ఉన్నారు' అని ఎయిమ్స్ సీనియర్ వైద్యుడొకరు తెలిపారు. ఒడిశాలోని కంధమాల్ జిల్లాకి చెందిన అవిభక్త కవలలు జగన్నాథ్, బలరామ్‌లది చాలా అరుదైన కేసుల్లో ఒకటని ఆయన చెప్పారు. ఈ సర్జరీలో ఒక జపాన్ స్పెషలిస్ట్‌తో పాటు న్యూరోసర్జరీ, న్యూరోఎనస్తీషియా ఇన్‌స్టిట్యూట్‌లు, ప్లాస్టిక్ సర్జరీ డిపార్ట్‌మెంట్‌కు చెందిన దాదాపు 20 మంది స్పెషలిస్టుల బృందం పాల్గొంది. సర్జరీ సాధ్యత కోసం కవలల తలల్లోని నరాలు ఏ మేరకు కలిసిపోయి ఉన్నాయో తెలుసుకునేందుకు వైద్యులు పలు మార్లు ఎంఆర్ఐ, సిటి స్కానింగ్‌లు, ఆంజియోగ్రామ్ పరీక్షలను చేపట్టారు. కాగా, జులై 13న వారిని ఎయిమ్స్‌లో చేర్పించారు.



అమెరికాతో ద్వైపాక్షిక చర్చలు, పర్యటనలు బంద్ : పాక్

ఇస్లామాబాద్: టెర్రరిస్టులకు ఆశ్రయం ఇస్తున్న దేశంగా తమను నిందించిన అమెరికా చర్యకు నిరసనగా ఆ దేశంలో అధికారిక పక్యటనలను, ద్వైపాక్షిక చర్చలను పాకిస్థాన్ నిలిపివేసింది. టెర్రరిస్టుల స్వర్గధామంగా పాక్ మారిందని కఠిన పదజాలంతో ట్రంప్ ఇటీవల ప్రకటన చేశారు. అందుకు నిరసనగా పాక్ మంగళవారం ఈ ఉత్తర్వు జారీ చేసింది. విదేశాంగ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ ఈ విషయం సెనెట్‌కు తెలిపారు. పాక్‌ను అస్థిర పరచడానికి అఫ్ఘాన్ భూభాగాలను భారత్ వాడుకోవడాన్ని సాగనివ్వ బోమని సెనెట్ సమావేశంలో పాక్ ప్రకటించింది. అమెరికాతో దిగజారుతున్న సంబంధాలను ఆ శాఖ ఒక ప్రత్యేక సెనెట్ సమావేశంలో చర్చించింది. ద్వైపాక్షిక పర్యటనలను, చర్చలను నిలిపివేసినట్లు ఆయన ప్రకటించారు. ఇటీవల ట్రంప్ అఫ్ఘానిస్థాన్ పట్ల ప్రకటించిన విధానంలో భారత్‌కు ఎటువంటి జైనిక బాధ్యతలను ఇవ్వలేదని ఆయన అన్నారు. మధ్య ఆసియాకు అమెరికా విదేశాంగ మంత్రి అలైస్ వెల్స్ మంగళవారం ఇక్కడకు రావలసి ఉంది. ఆ పర్యటన గురించి వివరాలు తెలియలేదు. గత వారం పాక్ విదేశాం గమంత్రి స్వయంగా అమెరికా వెళ్లారు.దక్షిణాసియా పట్ల అమెరికా కొత్త విధానాన్ని ప్రకటించిన నేపథ్యంలో సెప్టెంబర్ 5 నుంచి 7 దాకా పాక్ దౌత్యవేత్తల సమావేశం ఏర్పాటైనట్లు విదేశాంగ కార్యదర్శి ప్రకటించారు.

జపాన్‌ను గురిపెట్టి క్షిపణి పరీక్ష



సియోల్: ఉత్తర కొరియా జపాన్‌ను గురిపెట్టి తన రాజధాని పోంగ్యాంగ్ నుంచి ఖండాంతర క్షిపణిని ప్రయోగించింది. అది జపాన్ మీదుగా వెళ్లి ఉత్తర పసిఫిక్ మహాసముద్రంలో కూలింది. అమెరికా సన్నిహిత మిత్ర దేశం భూబాగాన్ని గురిపెట్టి జరిపిన దురాక్రమణ పూరిత క్షిపణి పాటవ పరీక్ష ఇది. పక్కనే దక్షిణకొరియా, అమెరికా కలిసి విన్యాసాలు జరుపుతుండడంతో హెచ్చరికగా ఉత్తర కొరియా ఈ పరీక్ష జరిపింది. క్షిపణి 2700 కి.మీ దూరం ప్రయాణించిందని, గరిష్ఠంగా 550 కిలోమీటర్ల ఎత్తును అందుకొందనీ ఉత్తర కొరియా అధి కారులు చెప్పారు. జపాన్ ఉత్తర దీవి హొక్కైడో మీదుగా అది ఎగిరింది. జపాన్‌ను ఉత్తర కొరియా క్షిపణి దాటివెళ్లడం ఇదే ప్రథమమని భావిస్తున్నారు. ఇంతకు ముందు అంతరిక్షంలో ఉపగ్రహాలను ఉంచే రాకెట్లు అలా ఆ దేశం మీదుగా ప్రయాణించాయి. ఉత్తర కొరియా ఇంత దూరం వెళ్లే క్షిపణి పరీక్ష జరపడం కూడా ఇదే ప్రథమం. ఈ పరీక్ష వార్తను దక్షిణ కొఠరియా ఇంకా ధృవీకరించలేదు. అణ్వాయుధ నిక్షేపాన్ని కలిగి ఉండాలన్న పోంగ్యాంగ్ లక్ష్యాన్ని ప్రతి పాటవ పరీక్ష చేరువ చేస్తోంది.అమెరికా మంగళవారం తాజా క్షిపణి పరీక్ష విషయమై ఉత్తర కొరియాను తీవ్రంగా హెచ్చరించింది. ఆ దేశానికి బుద్ధి చెప్పే మార్గాలన్నీ పరిశీలనలో ఉన్నట్లు అధ్యక్షుడు ట్రంప్ వార్నింగ్ ఇచ్చారు.

కిమ్ దంపతులకు మూడో సంతానం



సియోల్: ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్ వున్ మూడో బిడ్డకు తండ్రయ్యారు. ఆయన సతీమణి రి సోల్ జు మూడో సంతానానికి జన్మనిచ్చింది. ఈ మేరకు దక్షిణకొరియాకు చెందిన 'యోహాప్' వార్తా సంస్థ వెల్లడించింది. 2009లో కిమ్, సోల్ జుల వివాహం జరిగింది. వీరికి ఇప్పటికే ఇద్దరు పిల్లలున్నారు. అయితే గత కొంత కాలంగా రి సోల్ జు అజ్ఞాతంలోకి వెళ్లిపోయింది. ఉత్తరకొరియాను పాలించిన వంశీయుల్లో కిమ్ మూడో తరానికి చెందిన వ్యక్తి. సాధారణంగా ఉత్తరకొరియా అధ్యక్షులు కుటంబ వివరాలు చాలా రహస్యంగా ఉంచుతారు. కిమ్‌కు ముందు పాలించిన అధ్యక్షులు తమ కుటుంబాన్ని బయటికి తేలేదు. కిమ్ మాత్రం ఆ సంప్రదాయానికి భిన్నంగా తన భార్యతో కన్పించారు. అదీ అప్పుడప్పుడు మాత్రమే. రి సోల్ జు మాత్రం సాధారణ కుటుంబం నుంచే వచ్చారని దక్షిణకొరియా నిఘా నివేదికల ద్వారా తెలిసింది. ఆమె తండ్రి విద్యావేత్తకాగా, తల్లి డాక్టరు. ఉత్తరకొరియా క్రీడాకారులు 2005లో ఆసియన్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్‌లో పోటీ పడేందుకు వచ్చినప్పుడు ఆమె తన దేశ ఛీర్‌లీడర్‌గా దక్షిణకొరియా సందర్శించారు.

కాకినాడలో ప్రశాంతంగా పోలింగ్

కాకినాడ: ఎపిలోని కాకినాడ నగర పాలక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ స్వల్ప ఉద్రిక్తతలు మినహా ప్రశాంతంగా ముగిసింది. ఈ ఎన్నికల్లో మొత్తం 241 మంది అభ్యర్థులు బరిలో నిలవగా, కాకినాడలో నగర కార్పొరేషన్ పరిధిలో 196 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 48 డివిజన్లకు గానూ అధికార తెలుగుదేశం పార్టీ 39, భారతీయ జనతా పార్టీ 9 డివిజన్లలో పోటీ చేసింది. అలాగే వైసిపి 48 డివిజన్లలో పోటీ చేసింది. నగరంలో కొంత మందకొడిగా ఓటింగ్ జరిగినప్పటికీ శివారు ప్రాంతాల్లోని ప్రజలు ఓటు వేసేందుకు ఆసక్తి ప్రదర్శించారు. ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు వారిని కదిలించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశారు. సాయంత్రం 5 గంటల సమయానికి పోలింగ్ 65 శాతంగా నమోదైంది. సెప్టెంబర్ 1న ఎన్నికల లెక్కింపు చేపట్టనున్నారు. కాకినాడ పురపాలక పరిధిలో మొత్తం 2,29,373 మంది ఓటర్లు ఉన్నారు. కాకినాడ నగరపాలక ఎన్నికల్లో తొలిసారి 2005లో 67 శాతం పోలింగ్ నమోదు కాగా, 2014లో 67 శాతం నమోదైంది. ఈ సారి కూడా ఆ స్థాయి వరకు జరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అనారోగ్య పీడితులు, వయో వృద్ధులను పోలింగ్ కేంద్రాలకు ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు తరలించారు. అనుకూలంగా ఓటు వేయించేందుకు ఇంటింటికీ వెళ్లి తమ ప్రయత్నాలను కొనసాగించారు.

న్యాయం చేయకుంటే పోరాడుతా



హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ ఎజి బిఎస్‌సి విద్యార్థులకు ప్రభుత్వం న్యాయం చేయకపోతే పోరాటం చేస్తామని సినీ హీరో, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అన్నారు. ఎపికి చెందిన ఎజి బిఎస్‌సి విద్యార్థులు మంగళవారం హైదరాబాద్ చేరుకుని పవన్‌కల్యాణ్‌ను కలిశారు. జిఒ 64ను నిలిపివేయాలని, జిఒ 16ను కొనసాగించాలని విద్యార్థులు డిమాండ్ చేస్తూ గత 25 రోజులుగా ఆందోళన చేస్తున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. దీంతో తమ ఆందోళనకు మద్దతు కోరుతూ విద్యార్థులు పవన్ కల్యాణ్‌ను కలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల నుంచి అన్ని వివరాలు తెలుసుకున్న పవన్ కల్యాణ్ మాట్లాడుతూ విద్యార్థుల డిమాండ్‌లో వాస్తవం ఉందని, సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. ఒకవేళ విద్యార్థులకు న్యాయం చేయకపోతే పోరాటం చేస్తామని ప్రకటించారు.

నేడు ఇండోర్‌లో ప్రతిపక్షాల సమావేశం

న్యూఢిల్లీ: బిజెపి పాలిత రాష్ట్రాలలో 'సమ్మిళిత సంస్కృతి కాపాడాలని' జెడి(యు) తిరుగుబాటు నాయకుడు శరద్ యాదవ్ బుధవారం మధ్య ప్రదేశ్‌లోని ఇండోర్‌లో ప్రతిపక్ష పార్టీల సమావేశం నిర్వహిస్తున్నారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ నేతలు దిగ్విజయ్‌సింగ్, ఆనంద్ శర్మ, సిపిఎం నేత సీతారాం ఏచూరి, ఎన్‌సిపి నేత తారీఖ్ అన్వర్‌తోపాటు పలు పార్టీల ప్రతినిధులు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. ఇటీవల మాండసోర్‌లో రైతులు హింసాత్మక నిరసనలు తెలిపారు. దీంతో రాష్ట్రంలో 14 సంవత్సరాలుగా అధికారంలో కొనసాగుతున్న కాషాయ పార్టీకి వ్యతిరేకంగా ప్రతిపక్ష పార్టీలు ప్రచారం నిర్వహించనున్నాయి. వచ్చే ఏడాది చివరి నాటికి ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, మరో రెండు బిజెపి పాలిత రాష్ట్రాలతోపాటు మధ్యప్రదేశ్ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. సమ్మిళిత సంస్కృతిని కాపాడాలని గుజరాత్‌తోపాటు ఇతర రాష్ట్రాలకు వెళ్లి ప్రచారం చేస్తానని శరద్‌యాదవ్ విలేకరులకు తెలిపారు. ఇటీవల జెడి(యు) అధినేత నితీశ్‌కుమార్ బిజెపి కూటమిలో చేరడం పట్ల ఆయన తన నిరసనను వ్యక్తం చేశారు. ఎన్‌డిఎ పాలనలో దేశంలో లౌకికత్వం, బహుళత్వం దాడికి గురవుతోందని పేర్కొన్నారు.మిశ్రమ సంస్కృతిని కాపాడాలని ఆగస్టు 17న ప్రతిపక్ష పార్టీల జాతీయ సమావేశాన్ని ఆయన నిర్వహించారు.

డోక్లామ్ నుంచి పాఠం నేర్చుకోండి!



భారత్‌కు చైనా హితవు

బీజింగ్/న్యూఢిల్లీ: సిక్కిం సరిహద్దులోని డోక్లామ్ ప్రతిష్టంభనకు తెరపడినప్పటికీ చైనా తన హెచ్చరికల తీరు మార్చుకోలేదు. డోక్లామ్ నుంచి బలగాల ఉపసంహరణ జరిగిన మరునాడే భారత్ పాఠాలు నేర్చుకోవాలని చైనా సైన్యం హెచ్చరిక చేసింది. ఈ మేరకు పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ(పిఎల్‌ఎ)కు చెందిన సీనియర్ కల్నల్ వూ క్విన్ తాజాగా ఓ ప్రకటన చేశారు. 'భారత్-చైనా మధ్య డోక్లామ్ వివాదం నుంచి భారత్ పాఠాలు నేర్చుకోవాలని మేము కోరుకుంటున్నాం. అంతర్జాతీయ చట్టాలకు సంబంధించిన ప్రాథమిక నియమాలు, ఒప్పందాలకు కట్టుబడి ఉండాలి. సరిహద్దు వెంట శాంతిని, స్థిరత్వాన్ని కాపాడుకునేందుకు భారత్ మా సైన్యంతో కలిసి పనిచేయాలి. అలా చేయడం వల్ల రెండు దేశాల సైన్యాల మధ్య ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుంది' అని క్విన్ తన ప్రకటనలో పేర్కొన్నారు. రెండు దేశాల నడుమ గత కొన్ని రోజులుగా జరుగుతున్న దౌత్యపరమైన చర్చల కారణంగా 75 ఏళ్ల డోక్లామ్ వివాదానికి తెరపడింది. రెండు దేశాలు అక్కడి నుంచి బలగాలను ఉపసంహరించుకోడానికి రాజీ పడ్డాయి. అయితే 'భారత్-చైనా మధ్య డోక్లామ్ వివాదం ముగిసినప్పటికీ మా దేశ సార్వభౌమత్వాన్ని, జాతీయ భద్రతను పరిరక్షించడంలో మేము అప్రమత్తంగానే ఉంటాం. డోక్లామ్ వివాదం నుంచి భారత్ పాఠాలు నేర్చుకోవాలి' అంటూ కల్నల్ క్విన్ హెచ్చరించారు. ఇంకా ఆయన 'భారత్-చైనా సరిహద్దులో శాంతి, స్థిరత్వాన్ని, ఇరుదేశాల ప్రయోజనాలను కాంక్షిస్తున్నాం' అన్నారు.

ఇప్పటికీ కట్టుబడని చైనా


డోక్లామ్‌లో 73 రోజుల ప్రతిష్టంభనకు తెరపడినప్పటికీ అక్కడ రోడ్డు నిర్మాణం ఆపబోమని చైనా అంటోంది. 'సరిహద్దు రక్షణావసరాలు, ప్రజల జీవన ప్రమాణాల మెరుగుకు, చైనా మౌలికవసతుల కల్పన, రోడ్ల నిర్మాణం ఆపబోదు' అని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి హువా చునీయింగ్ అన్నారు. డోక్లామ్ నుంచి భారత్,చైనా తమ బలగాలను సోమవారం ఉపసంహరించుకున్నాయి. బ్రిక్స్ దేశాల సదస్సుకు హాజరయ్యేందుకు ప్రధాని నరేంద్ర మోడీ త్వరలో చైనా వెళ్లనున్నారు. ఈ నేపథ్యంలో 'డోక్లామ్ ప్రాంతంలో చైనా రోడ్డు నిర్మాణం కొనసాగిస్తుందా?' అని విలేకరులు అడిగిన ప్రశ్నకు చునీయింగ్ ప్రతిస్పందిస్తూ 'అక్కడి పరిస్థితుల ఆధారంగా నిర్ణయం తీసుకుం టాం' అన్నారు. డోక్లామ్ ప్రాంతంలో చైనా సైనికులు ఉండి గస్తీ తిరుగుతారని కూడా స్పష్టం చేశారు. ఇది లా ఉండగా ' పది వారాల డోక్లామ్ ప్రతిష్టంభన పరిష్కారాన్ని స్వాగతిస్తున్నాం' అని ఢిల్లీలోని చైనా రాయబారి రాంగ్ చెప్పారు.

భూటాన్ హర్షం

భారత్-చైనాల మధ్య 73 రోజుల ప్రతిష్టంభన సమసిపోవడంపై భూటాన్ మంగళవారం హర్షాన్ని ప్రకటించింది. ట్రైజంక్షన్ ప్రాంతంలో శాంతిసామరస్యాలు నెలకొలగలవన్న ఆశాభావాన్ని కూడా వ్యక్తం చేసింది. జూన్ 16న చైనా చేపట్టిన రోడ్డు నిర్మాణాన్ని భారత్ దళాలు అడ్డుకోవడంతో డోక్లామ్‌లో ప్రతిష్టంభన కొనసాగింది. భారత్ ఆ ప్రాంతంలో 350 మంది సైనికులను మోహరించింది. డోక్లామ్ విషయంలో భూటాన్, చైనాల మధ్య వివాదం కూడా ఉంది.

చైనాలో బ్రిక్స్ సదస్సుకు మోడీ

సెప్టెంబరులో పర్యటన



న్యూఢిల్లీ : సెప్టెంబరు 3-5 తేదీల మధ్య చైనాలోని జియామెన్‌లో జరగనున్న బ్రిక్స్ దేశాల సదస్సుకు ప్రధాని నరేంద్ర మోడీ హాజరుకానున్నారని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ మంగళవారం వెల్లడించింది. ఇరు దేశాలు తమ దళాలను వెనక్కి తీసుకోవడం ద్వారా భారత్-చైనాల మధ్య డోక్లామ్ వద్ద గత 73 రోజులుగా నెలకొన్న సైనిక ప్ర తిష్టంభన తొలగిన మరుసటి రోజే మోడీ చైనా పర్యటనకు సంబంధించి ఒక ప్రకటన వెలువడటం గమనార్హం. 'చైనా అధ్యక్షుడి ఆహ్వానం మేరకు ప్రధాని మోడీ సెప్టెంబరు 3-5 తేదీల మధ్య జరగనున్న బ్రిక్స్ దేశాల సదస్సులో పాల్గొనేందుకు చైనాలోని ఫుజియాన్‌లో ఉన్న జియామెన్ వెళ్లనున్నారు' అని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలి పింది. మోడీ చైనాలో బ్రిక్స్ సదస్సును ముగించుకున్నాక అటు నుండి మయన్మార్ అధ్యక్షుడు యు హెచ్ క్యావ్ ఆహ్వానం మేరకు సెప్టెంబరు 5-7 తేదీల మధ్య ఆ దేశంలో పర్యటి స్తారు. మయన్మార్‌లో ఆయనకిది మొట్టమొదటి ద్వైపాక్షిక పర్యటన కావడం గమనార్హం. మయన్మార్ పర్యటన సందర్భంగా ప్రధాని మోడీ ఆ దేశ కౌన్సెలర్ డా ఆంగ్ శాన్ సూ కితో ఇరు దేశాల పరస్పర ప్రయోజనాలకు సంబంధించిన పలు అంశాలపై చర్చిస్తారు. పనిలోప నిగా అధ్యక్షుడు యు హెచ్ క్యావ్‌తోనూ ఆయన భేటీ అవుతారు. రాజధాని నగరం నేపితావ్‌లో తన కార్యక్రమాలను ముగించుకున్న తర్వాత మోడీ యాంగాన్, బాగన్‌ని కూడా సందర్శిస్తారు. కాగా, నవంబరు, 2014లో నిర్వహించిన ఏసియన్ సదస్సు సందర్భంగా మయన్మార్ రాజధాని నగరాన్ని మోడీ సందర్శించిన సంగతి తెలిసిందే.

బ్రిక్స్ దేశాల సహకారంపై చైనా ఆశాభావం

తాము ఆతిథ్యమిస్తున్న బ్రిక్స్ సదస్సు విజయవంతానికి కూటమిలోని సభ్యదేశాలు తమ వంతు సహకారాన్ని అందిస్తాయనే ఆశాభావాన్ని చైనా వ్యక్తం చేసింది. డోక్లామ్ సంక్షోభం ముగింపుకు తమ సైన్యాలను వెనక్కి తీసుకునేందుకు భారత్-చైనాలు పరస్పరం అంగీకరించిన మరుసటి రోజు చైనా ఈ మేరకు ప్రకటన చేయడం గమనార్హం. బ్రిక్స్ దేశాల (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా) సదస్సుకు కొద్ది రోజుల ముందుగా డోక్లామ్ ప్రతిష్టంభనకు తెరపడటం దౌత్యపరమైన విజయంగా అభివర్ణించవచ్చు.

పాక్ శిశువుకు మెడికల్ వీసా



న్యూఢిల్లీ: గుండె జబ్బులతో బాధపడుతున్న పాకిస్థాన్ నవజాత శిశువుకు మెడికల్ వీసా మంజూరు చేయనున్నట్లు విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ తెలిపారు. నవ జాత శిశువు రోహన్ తల్లి దండ్రులు విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్‌ను కలిసి జోక్యం చేసుకోవాలని కోరడంతో ఈ మేరకు ఆమె హామీ ఇచ్చారు. అనంతరం గుండె జబ్బుతో బాధపడుతున్న నవజాత శిశువుకు వీసా ఇవ్వనున్నట్లు ఆమె ట్వీట్ చేశారు. నవజాత శిశువు వైద్య వీసా మంజూరు చేయాలని ఇటీవల పలువురు పాకిస్థానీ పౌరులు భారత్‌ను అభ్యర్థిస్తూ ట్వీట్ చేశారు. రోహన్‌ను హత్తుకున్నప్పుడు నవ్వుతాడని, తన ఒడిలో ఉన్నంత వరకు సురక్షితంగా ఉంటాడని తనకు తెలుసని ఆయన తల్లి మెహవీశ్ ముఖ్తార్ తెలిపారు. భారత్, పాకిస్థాన్‌ల మధ్య సత్సంబంధాలు లేనప్పటికీ, గత కొన్ని నెలలుగా వైద్య వీసా కోసం పలువురు పాకిస్థాన్ పౌరులు అభ్యర్థించడంతో భారత్ వీసాలు మంజూరు చేసింది. నిజంగా వ్యాధులతో బాధపడుతున్న పాకిస్థాన్ జాతీయులకు మెడికల్ వీసాలు మంజూర్ చేస్తామని ఆగస్టు 15న సుష్మా స్వరాజ్ తెలిపారు. దరఖాస్తులను పాకిస్థాన్ ప్రధానమంత్రి విదేశాంగ సలహాదారు సిఫారసు చేసినట్లైతే మెడికల్ వీసాలు మంజూరు చేస్తామని గత మే నెలలో సుష్మాస్వరాజ్ తెలిపారు.

ఐసిడిఎస్ అధికారుల జోక్యంతో తల్లి ఒడికి చేరిన బిడ్డ



మనతెలంగాణ/చేగుంట : చెట్ల తిమ్మాయిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని పులిగుట్ట తండాకు చెందిన పద్మ తన భర్త బన్సీతో కలసి తన మూడు నెలల కూతురిని జూన్ నెల 2వ తేదిన అమ్ముకున్నారని చేగుంట పోలీస్ స్టేషన్‌లో ఐసిడిఎస్ అధికారులు ఫిర్యాదు చేసారు. ఫిర్యాదుతో చేగుంట ఎస్ఐ సత్యనారాయణ బన్సీ విక్రయించిన రామాయపల్లి గ్రామానికి చెందిన లత,కృష్ణలను పట్టుకుని స్టేషన్‌కు తీసుకువచ్చి ఐసిడిఎస్, సిడబ్లుసి, ఐసిపిఎస్ అధికారులకు అప్పగించారు. పద్మ, బన్సీలకు ముగ్గురు ఆడపిల్లలు కావడంతో చిన్న కూతురును మనోహరాబాద్ మండలం రామాయపల్లి గ్రామానికి చెందిన లత, కృష్ణలకు మధ్యవర్తి సుష్మా హాస్పిటల్‌లో అటెండర్ శేఖర్ ద్వారా 15 వేలకు అమ్ముకున్నారు. పద్మ, బన్సీల మధ్య గొడవలు రావడంతో పద్మ ఐసిడిఎస్ అధికారులకు ఫిర్యాదు చేసింది. చేగుంట పోలీస్ స్టేషన్‌లో పద్మ చిన్న కూతురును ఐసిడిఎస్, సిడబ్లుసి, ఐసిపిఎస్ అధికారులకు అప్పగించారు. పాపను పది రోజుల వరకు తల్లి వద్దనే ఉంచుకోవాలని పాపను తల్లి పద్మకు అధికారులు విఠల్, కైలాస్ వంగరి, లక్ష్మి నర్సమ్మలు అందజేసారు. అనంతరం పాపను శిశువదన్‌కు తరలించడం జరుగుతుందని తెలిపారు. అమ్ముకున్న వారిపై, కొన్న వారిపై, మధ్యవర్తిపై కేసు నమోదు చేసినట్లు ఐసిపిఎస్ (బాలల సంరక్షణ సమితి అధికారి) కైలాస్ వంగరి తెలిపారు.

కాబూల్‌లో పేలుడు

కాబూల్: అఫ్ఘానిస్థాన్ రాజధాని కాబూల్‌లోని బ్యాంకు బయట మంగళవారం ఉదయం పేలుడు సంభవించింది. ఈ ఆత్మాహుతి బాంబు పేలుడు ఘటనలో ఓ గార్డ్ సహా ఐదుగురు మరణించారు. ఎనిమిది మంది పౌరులకు గాయాలయ్యాయని అఫ్ఘాన్ హోం శాఖ ప్రతినిధి నజీబ్ డానిష్ తెలిపారు. సాధారణంగా ఆ కాబూల్ బ్యాంకులో భద్రతా బలగాలు సిబ్బంది, ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు చెల్లిస్తుంటారు. ఈ వారంలో రానున్న ఈద్ అల్ అధా పర్వదినాన్ని పురస్కరించుకుని చాలా మంది అధికారులు ఆ బ్యాంకు నుంచి జీతాన్ని తీసుకునేందుకు వచ్చినప్పుడు ఈ పేలుడు సంభవించింది. ఈ ఆత్మాహుతి పేలుడుకు తమదే బాధ్యత అని తాలిబన్లు తర్వాత సామాజిక మాధ్యం ద్వారా ప్రకటించారు. పేలుడు సంభవించిన ప్రాంతంలో అనేక విదేశీ రాయబార కార్యాలయాలు కూడా ఉన్నాయి. మూడు నెలల విరామం తర్వాత ఈ ప్రాణాంతక బాంబు దాడి జరిగింది. గతంలో ఇదే ప్రాంతంలో జరిగిన ట్రక్ బాంబు పేలుడులో దాదాపు 150 మంది చనిపోయారు. తాలిబన్లను ఎదుర్కొనేందుకు అఫ్ఘానిస్థాన్‌కు మరింత అమెరికా బలగాలను పంపుతానని ఇటీవల ట్రంప్ చేసిన ప్రకటనపై అఫ్ఘాన్ అధికారులు హర్షం వ్యక్తం చేశారు.

మదర్సాల్లో పాఠ్యాంశంగా తలాక్



బరేలి : తలాక్‌పై సుప్రీంకోర్టు తీర్పు అనంతరం ముస్లింలకు అవగాహన కల్పించేందుకు ఈ అంశాన్ని మదర్సాల్లో పాఠ్యాంశంగా చేర్చాలని ప్రసిద్ధ సున్నీ దర్గా నిర్ణయించింది. తలాక్ (విడాకులు)కు సంబంధించి షరియత్ పరంగా అనేక భద్రతాపరమైన అంశాలున్నాయని, కాని మెజారిటీ కేసుల్లో ఈ అంశాలను పట్టించు కోవడంలేదని, దీంతో ప్రజలు అవగాహనరా హిత్యం తో మిగిలిపోతున్నారని, కాని ఇప్పుడు సున్నత్ ప్రకారం తలాక్ సరైన కోణంలో వినియోగించేందుకు మదర్సాల్లో విద్యార్థులకు బోధించాల్సివుందని దర్గా అలా హజ్రత్ దారుల్ ఇఫ్తా మంజారే ఇస్లాం అధినేత ముఫ్తీ సయీద్ కఫీల్ హాష్మీ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతి

రాట్లాం: మధ్యప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రాట్లాం జిల్లాలోని తాల్ లాసుడియా రోడ్డులో ట్రాక్టర్ ట్రాలీ అదుపు తప్పి బోల్తా పడటంతో ఐదుగురు మృతి చెందారు. 17 మం దికి గాయలయ్యాయి. మృతుల్లో ఐదుగురు మహి ళలు ఉన్నారు. మంగళవారం తెల్లవారు జామున ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. రాజ స్థాన్‌లోని నింబహెడ సమీపంలోని గర్గోటాలో దై వ దర్శనం అనంతరం ఇంటికి తిరిగి వస్తుండగా ఘటన చోటు చేసుకుంది. బాధితులు శారదా సిం గ్(22), అందర్‌భాయి గుర్జార్ (50), రామ్‌కున్వర్‌సింగ్ (35), భూరి సింగ్ (14), సోహన్ భాయి (55)గా గుర్తించారు. బాధితులు తాల్ తహసిల్ పరిధిలోని పలు గ్రామాలకు చెందిన వారని అధికారులు తెలిపారు. గాయపడ్డవారిని స్థానిక ఆస్పత్రిలో చేర్చారు. ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండటంలో వారిని జిల్లా ఆస్పత్రికి తరలించారు.

సెప్టెంబర్ 17న జాతీయ లోక్ అదాలత్

గ్రేటర్ నోయిడా: సెప్టెంబర్ 17న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నటు మంగళవారం నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ అధికారులు తెలిపారు. జిల్లా కోర్టులు, రెవెన్యూ కోర్టులు, తహసీల్‌లలో లోక్ అదాలత్ నిర్వహించనున్నారు. సెప్టెంబర్ 9న జరగాల్సిన లోక్ అదాలత్‌ను వాయిదా వేసి సెప్టెంబర్ 17న జిల్లా, తహసీల్ కోర్టులలో నిర్వహిస్తామని జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి నీలు మాలివాల్ తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ గురించి తమ క్లయింట్లకు క్లుప్తంగా వివరించాలని న్యాయవాదులందరికి విజ్ఞప్తి చేసినట్లు ఆమె తెలిపారు. ప్రత్యామ్నాయ విధానంలో వివాదాలను పరిష్కరించడం ద్వారా కోర్టులపై భారం తగ్గిపోతుందని పేర్కొన్నారు. లీగల్ సర్వీసెస్ అథారిటీ చట్టం కింద ఈ సేవలను అందించనున్నట్లు తెలిపారు. లోక్ అదాలత్‌కు దాఖలు చేసిన వివాదానికి సంబంధించి ఎటువంటి కోర్టు ఫీజు చెల్లించనవసరం లేదన్నారు. లోక్ అదాలత్‌లో పరిష్కరించబడిన కేసులకు చట్టబద్ధత ఉంటుందన్నారు. కోర్టు బయట వివాదాల పరిష్కారానికి ఒక నిర్ణయానికి రావాలని ఇరు పార్టీలను ఒప్పించే ప్రయత్నం మాత్రమే చేస్తామన్నారు. నేషనల్ లోక్ అదాలత్‌లను విజయవంతం చేయాలని న్యాయవాదులకు విపున్ కుమార్ భాటి ఆదేశించారు.

వృత్తి విద్యా ప్రవేశాలలో ఏటా జాప్యమే

ఇంకా ఖరారు కాని లాసెట్, ఎడ్‌సెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్



మనతెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలో వృత్తి విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే కౌన్సెలింగ్‌లో ఏటా జాప్యమే జరుగుతోంది. ఎంసెట్, ఇసెట్, ఐసెట్, ఎడ్‌సెట్, లాసెట్ వంటి ప్రవేశ పరీక్షలు సకాలంలో జరుగుతున్నా సకాలంలో కళాశాలలు, కోర్సులకు అఫిలియేషన్లు లభించకపోవడంతో ప్రవేశాలు గందరగోళంగా మారుతున్నాయి. ప్రతి సంవత్సరం జూన్‌లో విద్యాసంవత్సరం ప్రారంభమవుతుండగా, ఆగస్టు వరకు కౌన్సెలింగ్ ప్రక్రియ ఆగస్టు వరకు పూర్తయి, తరగతులు ప్రారంభం కావాలి. కానీ ఈ ఏడాది కూడా ఇప్పటివరకూ కొన్ని కోర్సులకు కౌన్సెలింగ్ షెడ్యూల్ కూడా విడుదల కాలేదు. ప్రతి సంవత్సరం అక్టోబర్ వరకు ప్రవేశాలు కొనసాగుతుండటంతో, లక్షల మంది విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు.

ఎందుకీ జాప్యం..? : వృత్తి విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు ముందుగా ఎంసెట్, ఇసెట్, ఐసెట్, ఎడ్‌సెట్, లాసెల్, డిఇఇసెట్ వంటి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. ఈ పరీక్షల ఫలితాలు వెల్లడించిన తర్వాత విద్యార్థులకు మార్కులతోపాటు ర్యాంకులు వెల్లడిస్తారు. అయితే వివిధ వృత్తి కోర్సుల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్ నిర్వహించాలంటే కళాశాలలు, కోర్సులకు ప్రతి ఏటా సంబంధిత యూనివర్సిటీ అఫిలియేషన్ ఇవ్వాలి. ఆ కోర్సులకు ఫీజులు నిర్ధారించాలి. అఫిలియేషన్ ప్రక్రియ ముగిసి, ఫీజుల నిర్ధారణ పూర్తయిన తర్వాత ఏ కోర్సుకు ఎన్ని సీట్లు అందుబాటులో ఉన్నాయి..? ఆ కోర్సుల ఎంత ఫీజు అనే విషయంపై స్పష్టత వస్తుంది. అప్పుడే సంబంధిత సెట్ ప్రవేశాల కమిటీ సమావేశమై కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల చేస్తుంది. అయితే వృత్తి విద్యా కోర్సుల్లో ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి తెలంగాణ ప్రవేశాలు, ఫీజుల నియంత్రణ కమిటి(టిఎఎఫ్‌ఆర్‌సి) ఫీజులు నిర్ణయిస్తుంది. ఈ సమస్య ప్రతి సంవత్సరం ఉండదు. అఫిలియేషన్ల విషయంలో మాత్రం ప్రతి ఏటా ఆలస్యం జరుగుతూనే ఉంది. ముందుగా ఎఐసిటిఇ,ఎన్‌సిటిఇ,బిసిఐ వంటి 11 జాతీయ సంస్థలు ఆయా రాష్ట్రాలలోని కళాశాలలు, కోర్సులకు అనుమతి ఇస్తుంది. ఆ తర్వాత సంబంధిత యూనివర్సిటీ కళాశాలల్లో తనిఖీలు నిర్వహించి అఫిలియేషన్లు జారీ చేయాలి. కొన్ని కోర్సులకు జాతీయ సంస్థలే ఆలస్యంగా అఫిలియేషన్లు ఇస్తుండగా, మరి కొన్ని కోర్సులకు రాష్ట్ర యూనివర్సిటీలు ఆలస్యంగా అఫిలియేషన్లు ఇస్తున్నాయి. దాంతో వృత్తి విద్యా కోర్సుల్లో ప్రవేశాలలో ఏటా జాప్యమే జరుగుతూ వస్తోంది.

ఇంకా ఖరారు కాని లాసెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్ : న్యాయవిద్యలో ప్రవేశాలకు నిర్వహించే లాసెట్ ప్రవేశ పరీక్ష మే 27న నిర్వహించి, జూన్ 10న ఫలితాలు కూడా విడుదల చేశారు. ఫలితాలు విడుదలై రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు లాసెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల కాలేదు. రాష్ట్రంలో న్యాయ కళాశాలలకు బార్ కౌన్సెల్ ఆఫ్ ఇండియా(బిసిఐ) నుంచి ఈ విద్యాసంవత్సరానికి అనుమతులు రాలేదని, అందుకే కౌన్సెలింగ్ నిర్వహణలో కొంత ఆలస్యం జరుగుతుందని ఉన్నత విద్యామండలి ఛైర్మన్ టి.పాపిరెడ్డి తెలిపారు. సెప్టెంబర్‌లో లాసెట్ కౌన్సెలింగ్ నిర్వహించే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.

నాల్గో వన్డేలో కపుగెదెర ఆడటం కష్టమే!

కొలంబో: శ్రీలంక క్రికెట్ జట్టు తాత్కాలిక కెప్టెన్ చమార కపుగెదెర భారత్‌తో జరగబోయే నాల్గో వన్డేలో ఆడటం కష్టంగానే కనిపిస్తోంది. గత మ్యాచ్‌లో గాయం కావడంతో ఆదివారం జరిగే మ్యాచ్‌కు దూరమయ్యే అవకాశాలు ఉన్నాయి. మూడో వన్డేలో గాయమైనప్పటికీ లంక కెప్టెన్ కపుగెదెర బ్యాటింగ్, ఫీల్డింగ్‌లో పాల్గొన్నాడు. గాయం తీవ్రత ఎక్కువగా ఉండటంతో రానున్న 24 గంటల్లో నాల్గో వన్డేలో ఆడేది లేనిది తుది నిర్ణయాన్ని వెల్లడి కానుంది. ఈ నేపథ్యంలో కపుగెదెర క్రికెట్ మేనేజర్ అసంక గురుసిన్హా మాట్లాడుతూ.. 'ఫిజియోతో కపుగెదెర ఫిట్‌నెస్ పరిస్థితిపై మాట్లాడుతున్నాను. సాధ్యమైనంత వరకు నాల్గో వన్డేలో కొనసాగేలా ప్రయత్నించాలి. ప్రస్తుతం చికిత్స తీసుకుంటున్నాడు. ఐదు, లేక ఆరుగురు సభ్యులు మాత్రమే శిక్షణ తీసుకుంటున్నారు. ఏదిఏమైనాప్పటికీ కపుగెదెరకు విశ్రాంతి ఇవ్వాలనుకుంటున్నాం. బుధవారం ఫిట్‌నెస్ శిక్షణలో అతడు పాల్గొనలేకపోవచ్చు. కపుగెదెర ఆడేది లేదని ఏ విషయం నిర్ణయాన్ని వెల్లడిస్తాం. గాయానికి ఇంకా స్కానింగ్ పరీక్ష నిర్వహించలేదు. వైద్యులు పరీక్షిస్తున్నారు. గాయమైన మ్యాచ్‌లో కొనసాగడమే గాయం తీవ్రత ఎక్కువ కావడానికి కారణమని అన్నాడు.



ప్రొకబడ్డీ మ్యాచ్‌లకు వరుణుడి దెబ్బ!

ముంబయిలో భారీ వర్షాలు.. రద్దు చేసిన నిర్వాహకులు



ముంబయి: ప్రొకబడ్డీ సీజన్ 5 లో భాగంగా మంగళవారం జరగాల్సిన రెండు మ్యాచ్‌లు రద్దయ్యాయి. షెడ్యూల్ ప్రకారం జోన్ ఎ విభాగం నుంచి యు = ముంబా జట్టుకు గుజరాత్ ఫార్చ్యూన్‌జెయింట్ జట్టుకు మధ్య మ్యాచ్ జరగాల్సి ఉంది. మరోవైపు జోన్ బి విభాగంలో బెంగళూరు బుల్స్ జట్టుకు యుపి యోధాకు మధ్య మ్యాచ్ జరగాల్సి ఉంది. ముంబయిలో వర్షాలు కురుస్తున్న కారణంగా ఈ రెండు మ్యాచ్‌లను నిర్వాహకులు రద్దు చేశారు. భారీ వర్షాలు కురుస్తుండటంతో ఇరుజట్ల ఆటగాళ్లు సకాలంలో స్టేడియానికి చేరులేకపోవడంతో మ్యాచ్‌ల్ని రద్దు చేయాల్సి వచ్చింది. ఇప్పటివరకూ ఆడిన మ్యాచ్‌ల్లో జోన్ ఎ జట్టులో గుజరాత్ పాయింట్ల పట్టికలో 41 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా, జోన్ బి విభాగంలో యుపి యోధా 30 పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది. మరో జట్టు యు ముంబా జోన్ ఎ విభాగంలో 19 పాయింట్లతో ఐదో స్థానంలో ఉండగా, జోన్ బి విభాగంలో బెంగళూరు బుల్స్ జట్టు 23 పాయింట్లతో నాల్గో స్థానంలో ఉంది. కాగా, ఈ నెల 30 న జోన్ ఎ విభాగం నుంచి యు ముంబయి జట్టుకు హర్యానా సీలర్స్ జట్టు తలపడనున్నాయి.



క్రీడారత్నాలు

- దేవేంద్ర, సర్దార్ సింగ్‌లకు ఖేల్‌రత్న , 17 మందికి అర్జున అవార్డులు
- రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా ప్రదానం
- జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి భవన్‌లో అవార్డుల ప్రదానోత్సవం



సర్దార్ సింగ్‌కు ఖేల్‌రత్న (హాకీ)

దేవేంద్రకు ఖేల్‌రత్న (పారాలింపియన్)

న్యూఢిల్లీ: 2017 సంవత్సరానికిగాను ప్రతిష్టాత్మకమైన రాజీవ్ గాంధీ ఖేల్ రత్న, అర్జున, ద్రోణాచార్య, ధ్యాన్‌చంద్ అవార్డులను రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ప్రదానం చేశారు. క్రీడారంగంలో అద్భుతమైన ప్రదర్శన కనబర్చే క్రీడాకారులను ప్రోత్సహించే దిశగా ప్రతి ఏటా ఇచ్చే అవార్డులను కేంద్ర క్రీడా మంత్రిత్వశాఖ ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో భారత హాకీ దిగ్గజం, మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం జాతీయ క్రీడా దినోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా రాష్ట్రపతి భవన్‌లో అవార్డుల ప్రదానోత్సవాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి కోవింద్ పారాలింపియన్ భారత స్టార్ దేవేంద్ర జజారియా, భారత హాకీ మాజీ కెప్టెన్ సర్దార్ సింగ్ ఇద్దరికి రాజీవ్ ఖేల్‌రత్న పురస్కారాలను అందజేశారు.

జిఎస్ఎస్‌వి ప్రసాద్‌కు ద్రోణాచార్య, భూపేందర్‌కు ధ్యాన్‌చంద్

బ్యాడ్మింటన్ కోచ్ జి.ఎస్.ఎస్.వి ప్రసాద్ (బ్యాడ్మింటన్–లైఫ్‌టైమ్) కు ద్రోణాచార్య అవార్డును రాష్ట్రపతి ప్రదానం చేశారు. డాక్టర్ ఆర్



జిఎస్ఎస్‌వి ప్రసాద్ ద్రోణాచార్య

గాంధీ (మరణానంతరం – అథ్లెటిక్స్), హీరానంద్ కటారియా (కబడ్డీ), బ్రిజ్ భూషన్ మహంతి (బాక్సింగ్–లైఫ్ టైమ్), పి.ఎ రాఫెల్ (హాకీ– లైఫ్ టైమ్), సంజయ్ చక్రవర్తి (షూటింగ్), రోషన్ లాల్ (రెజ్లింగ్–లైఫ్‌టైమ్) కోచ్‌లందరికి ఈ అవార్డులను రాష్ట్రపతి అందజేశారు. అదేవిధంగా ధ్యాన్‌చంద్ అవార్డులకు ఎంపికైన ముగ్గురిలో భూపేందర్ (అథ్లెట్), షాహిద్ హకిన్ (ఫుట్‌బాల్), సుమరై టెటె (హాకీ)లు కూడా ధ్యాన్‌చంద్ అవార్డులను అందుకున్నారు. రిలయన్స్ ఫౌండేషన్ యూత్ స్పోర్ట్స్ తరపున రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కార్‌ను నీతా అంబానీకి రాష్ట్రపతి అందజేశారు.



భూపేందర్‌కు ధ్యాన్‌చంద్

హర్మన్‌ప్రీత్, తెలుగు క్రీడాకారులకు అర్జున ప్రదానం

ఈ ఏడాది అర్జున అవార్డులకు ఎంపికైన 17 మందికి రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి కోవింద్ అవార్డులను అందజేశారు. క్రికెటర్ల నుంచి భారత మహిళా క్రికెటర్, ఆల్‌రౌండర్ హర్మన్‌ప్రీత్ కౌర్ అవార్డును అందుకోగా, భారత క్రికెటర్ చతేశ్వర పుజారా మాత్రం అవార్డుల ప్రదానోత్సవానికి దూరమయ్యాడు. ఇంగ్లాండ్‌లో నైటింగమ్‌షైర్ కౌంటీ క్రికెట్‌తో ఒప్పందం చేసుకోవడంతో మ్యాచ్‌లు ఆడేందుకు వెళ్లాడు. ఇద్దరు తెలుగు క్రీడాకారులు వి. జ్యోతి సురేఖ (విలువిద్య), సాకేత్ మైనేని (టెన్నిస్) అర్జునా అవార్డులు అందుకున్నారు. మిగతావారిలో కుష్బీర్ కౌర్ (అథ్లెటిక్స్), అరోకియా రాజీవ్ (అథ్లెటిక్స్), ప్రశాంతి సింగ్ (బాస్కెట్‌బాల్), లైశారాం దేవేందర్ సింగ్ (బాక్సింగ్), ఓయినమ్ బెంబెం దేవి (ఫుట్‌బాల్), ఎస్.ఎస్.పి చౌరాసియా (గోల్ఫ్), ఎస్‌వి సునీల్ (హాకీ), జస్వీర్ సింగ్ (కబడ్డీ), పిఎన్ ప్రకాశ్ (షూటింగ్), టేబుల్ టెన్నిస్ క్రీడాకారుడు అమల్‌రాజ్, సత్యవత్ కడియన్ (కబడ్డీ), పారా అథ్లెట్ మరియప్పన్, పారా అథ్లెట్ వరుణ్ సింగ్ భాటీలకు అర్జున అవార్డులను రాష్ట్రపతి కోవింద్ అందజేశారు.



హర్మన్‌ప్రీత్ కౌర్ (క్రికెట్)



వి. జ్యోతి సురేఖ (విలువిద్య)



సాకేత్ మైనేని (టెన్నిస్)

గ్రహీతలకు నగదు బహుమతి అందజేత

పురస్కారాలు, ప్రశంస పత్రాలు మాత్రమే కాకుండా రాజీవ్ ఖేల్‌రత్న పురస్కార గ్రహీతలకు రూ. 7.5 లక్షల నగదు బహుమతి అందజేశారు. అలాగే అర్జున, ధ్యాన్‌చంద్, ద్రోణాచార్య అవార్డుల గ్రహీతలకు విగ్రహాలు, సర్టిఫికేట్లతో పాటు ఒక్కొక్కరికి రూ. 5లక్షల చొప్పున నగదు బహుమతి అందించారు.



నీతా అంబానీకి రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కార్



పారా అథ్లెట్ మరియప్పన్



అమల్‌రాజ్ (టేబుల్ టెన్నిస్)



కుష్బీర్ కౌర్ (అథ్లెటిక్స్)



బెంబెం దేవి (ఫుట్‌బాల్)

నెంబర్‌వన్ ఛాంపియన్ అవ్వడమే లక్ష్యం

ప్రతి పాయింట్ పోరాటమే: సింధు

మన తెలంగాణ/ గచ్చిబౌలి: ప్రపంచంలో నెంబర్‌వన్ ఛాంపియన్ అవ్వడమే తన లక్ష్యమని ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్స్‌షిప్‌లో రజత పతకం సాధించిన భారత షట్లర్, తెలుగుతేజం పివి సింధు అన్నారు. శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న సింధుకు ఆమె కుటుంబ సభ్యులతో పాటు అభిమానులు ఘన స్వాగతం పలికారు. మంగళవారం గచ్చిబౌలిలోని కోచ్ పుల్లెల గోపిచంద్ అకాడమిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సింధు మాట్లాడుతూ.. 'రజత పతకం సాధించడం చాలా సంతోషంగా ఉంది. తుదిపోరులో పరాజయం బాధించింది. ఈసారికి పతకం రంగును మాత్రం మార్చగలిగాను. ఇదే స్ఫూర్తితో అత్యున్నత స్థాయి ప్రదర్శన చేసేందుకు ప్రయత్నిస్తా. భవిష్యత్తులో తుదిపోరులో బంగారు పతకం సాధించి తిరిగి వస్తా. రానురాను బ్యాడ్మింటన్ టోర్నమెంట్ పటిష్టంగా మారుతోంది. అంతర్జాతీయ మ్యాచ్‌లకు మరింత పోటీతత్వం పెరుగుతోంది. అందుకు మేమంతా మానసికంగా, భౌతికంగా సిద్ధమై పోటీలో అధిగమించేందుకు ప్రయత్నిస్తున్నాం. ప్రస్తుత రోజుల్లో బ్యాడ్మింటన్ పోటీతత్వ స్థాయిలో రాణించడం అంత సులభం కాదు. సులభమైన పాయింట్లు సాధించడం ఆశామాషీ విషయం కాదు. మహిళల సింగిల్స్, పురుషుల సింగిల్స్, డబుల్స్ ఏదిఏమైనా ప్రస్తుత మ్యాచ్‌లు సుదీర్ఘంగా కొనసాగుతున్నాయి. ఏ ఒక్కరూ అంత సులభంగా ఎక్కడా కూడా పాయింట్ దక్కించుకోలేరు. సులభమైన పాయింట్ కోసం కూడా పోరాడాల్సిన పరిస్థితి ఉంది. ప్రతిఒక్కరిలో ఆటశైలి భిన్నంగా ఉంటుంది.భవిష్యత్తులో ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో తుదిపోరులో సైనా నెహ్వాల్‌తో తలపడేందుకు అవకాశం ఉంది. ఈ ఏడాది తుదిపోరులో ఆల్ ఇండియన్‌గా ఉంటుందని ఊహించాం. కానీ, అది జరుగలేదు. ఏదో ఒక రోజు అది జరిగితిరుతుంది.' అని 22 ఏళ్ల బ్యాడ్మింటన్ స్టార్ అభిప్రాయపడింది. ఈ ఏడాది రజతం సాధించడంతో సింధు ఖాతాలో మూడు ప్రపంచ ఛాంపియన్‌షిప్ పతకాలు వచ్చి చేరాయి. దీంతో సోషల్ మీడియా వేదికగా ప్రముఖులు, అభిమానుల నుంచి ప్రశంసల వెల్లువెత్తాయి. ముఖ్యంగా ప్రధాని నరేంద్ర మోడీ అభినందించడం తనకెంతో గొప్ప అనుభూతిని కలిగించిందని సింధు పేర్కొంది. కోచ్ గోపిచంద్ మాట్లాడుతూ..



సింధు తుదిపోరులో అద్భుతంగా రాణించింది. బంగారు పతకం గెలుస్తుందని అనుకున్నాం. కానీ, రజత పతకం సాధించడం ప్రసంశనీయం. భవిష్యత్తులో సింధు బంగారు పతకం తప్పకుండా సాధిస్తుందని' అశాభావం వ్యక్తం చేశాడు. ఈ ఏడాది టోర్నమెంటులో భారత క్రీడాకారులంతా అద్భుతంగా రాణించారని గోపిచంద్ పేర్కొన్నాడు.

గవర్నర్ అభినందనలు

ఇంగ్లాండ్‌లోని గ్లాస్గోలో జరిగిన ప్రపంచ బాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో వెండి పతకం విజేత పి.వి.సింధు, కాంస్య పతకం విజేత సైనా నెహ్వాల్‌కు గవర్నర్ ఇ.ఎస్.ఎల్.నరసింహన్ అభినందనలు తెలిపారు. భవిష్యత్తుల్లో మరిన్ని విజయాలను సాధించాలని, పలు పతకాలను గెలుచుకోవాలని ఆయన ఒక ప్రకటనలో ఆకాంక్షను వెలిబుచ్చారు.

శ్రీలంక సెలెక్టర్ల బృందం రాజీనామా!

- భారత్‌తో టి20 తరువాత దిగిపోయే అవకాశం



కొలంబో: ఇటీవల టీమిండియాతో సిరీస్‌లో చెత్త ప్రదర్శనతో వరుస పరాజయాలు పాలవ్వడంపై విమర్శలు వెల్లువెత్తిన నేపథ్యంలో సనత్ జయసూర్య ఆధ్వర్యంలోని సెలక్షన్ కమిటీ దిగిపోయేందుకు రంగం సిద్ధమైంది. భారత్‌తో ఏకైక టి20 కోసం గత రెండు వన్డేల కోసం ఇప్పటికే జట్లను ఎంపికచేయగా, లంక క్రికెట్ పరిపాలనలో సమూల మార్పులు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో భారత్‌తో టి20 మ్యాచ్ ముగిసిన వెంటనే సెలక్టర్ల కమిటీ బృందం రాజీనామా చేయనున్నట్టు తెలుస్తోంది. శ్రీలంక క్రికెట్ చీఫ్ సెలెక్టర్ సనత్ జయసూర్య, కులు వితరణ, రంజిత్ ముదురసింఘే, ఎరిక్ ఉపషంత, అసంక గురుసిన్హాతో కూడిన సెలక్షన్ కమిటీ రాజీనామా చేస్తామని శ్రీలంక క్రీడాశాఖ మంత్రి దయశ్రీ జయశేఖర్‌కు లేఖ రాసింది. ఈ విషయాన్ని లంక క్రికెట్ క్రీడా మంత్రిత్వ శాఖ వెల్లడించింది. సెలక్షన్ కమిటీ పదవీకాలం వచ్చే నెల 7 తో ముగియనుంది. భారత్‌తో మూడో వన్డేలో లంక పరాజయం పాలైన రెండు రోజుల్లోనే ఈ ప్రకటన వెలువబడింది. మూడో వన్డేలో లంకపై భారత్ గెలవడంతో ఐదు వన్డేల సిరీస్‌ను 3=o తో కైవసం చేసుకుంది. ఇటీవల జరిగిన జింబాబ్వేతో సిరీస్‌లో కూడా లంక ఓటమిపాలైంది. బంగ్లాదేశ్‌తో టెస్టు, చాంపియన్ ట్రోఫీలో కూడా ఓటమి మూటగట్టుకుంది. గత ఏడాది టెస్టు సిరీస్ సమయంలో ఏప్రిల్‌లో జట్టులో శాన్స్ గురుసిన్హా చేరగా ఆ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా చేతిలో లంక వైట్ వాష్ అయింది. లంక తదుపరి మ్యాచ్‌లు ఆడేందుకు యుఎఇ, పాకిస్థాన్‌లో పర్యటించనుంది. సెప్టెంబర్ అఖరులో మ్యాచ్‌లు ప్రారంభంకానున్నాయి. కాగా, వచ్చే మూడో వారాల్లో కొత్త సెలక్షన్ కమిటీ పేరును ప్రతిపాదించే అవకాశం ఉంది.


ప్రపంచ ఎలెవన్ ఛారిటీ మ్యాచ్ వాయిదా!

వచ్చే నెల 8న కొలంబోలో ప్రపంచ ఎలెవన్ జట్టుకు శ్రీలంక ఎలెవన్ జట్టుకు మధ్య జరుగనున్న టి20 మ్యాచ్ వాయిదా పడింది. ఈ మేరకు మంగళవారం శ్రీలంక క్రికెట్ బోర్డు (సిఎల్‌సి) వెల్లడించింది. దేశంలో వరద ప్రభావంతో తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన చిన్నారుల కోసం, కరువు కారణంగా లంకలోని కొన్ని ప్రాంతాలు దీనస్థితికి లోనవ్వడంతో సహాయార్థం నిధులు సమకూర్చేందుకు ఈ మ్యాచ్‌ను ఆడనున్నట్టు ఇటీవల పల్లెకెలెలో భారత్‌తో మూడో టెస్టు సమయంలో సిఎల్‌సి ప్రకటించింది. అయితే టెక్నికల్ కమిటీ సిఫార్సు మేరకు ఈ మ్యాచ్‌ను వాయిదా వేస్తున్నట్టు మంగళవారం ఎస్ఎల్‌సి స్పష్టం చేసింది. లంక ఆటగాళ్లకు కొన్నినెలల పాటు విరామం ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని తమ టెక్నికల్ కమిటీ సిఫార్సు చేయడంతో ఈ దిశగా నిర్ణయం తీసుకున్నట్టు సిఇఒ ఆష్లే డి సిల్వా పేర్కొన్నారు. ఈ మ్యాచ్ సమయానికి లంక కీలక ఆటగాళ్లు మహేల జయవర్ధనే, కుమార సంగక్కరలు కూడా అందుబాటులో ఉండకపోవడం కూడా ఒక కారణమన్నారు. ప్రపంచ ఎలెవన్‌తో లంక ఎలెవన్ ఛారిటీ టి20 మ్యాచ్ ఎప్పుడూ జరిగేది కచ్చితంగా సాధ్యమైనంత త్వరలో వెల్లడిస్తామని ఆష్లే తెలిపారు.

వార్నర్ విజృంభణ.. గెలుపు దిశగా ఆసీస్

- తమీమ్ ఇక్బాల్ హాఫ్ సెంచరీ
- ఆరు వికెట్లు తీసిన నాథన్
- బంగ్లాదేశ్‌తో తొలిటెస్టు

ఢాకా: బంగ్లాదేశ్‌తో తొలి టెస్టులో భాగంగా 265 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్‌ను ఆరంభించిన ఆస్ట్రేలియా గెలుపు దిశగా పయనిస్తోంది. ఆసీస్ ఓపెనర్లు డేవిడ్ వార్నర్, మాత్ రెన్షా జట్టుకు మంచి శుభారంభాన్ని అందించారు. అయితే రెండో ఓపెనర్ రెన్షా 5 పరుగులకే తొలి వికెట్‌గా నిష్క్రమించగా, రెన్షా స్థానంలో వచ్చిన ఖ్వాజా (1) పరుగుకే చేతులేత్తేశాడు. వార్నర్ అద్భుతమైన ఇన్నింగ్స్‌తో 96 బంతుల్లో 11 ఫోర్లు, 1 సిక్స్ బాది 75 పరుగులతో హాఫ్ సెంచరీ చేశాడు. దీంతో మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా 30 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 109 పరుగులు చేయగా, కెప్టెన్ స్టీవ్ స్మిత్ (25) పరుగులతో, వార్నర్ (75) పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. బంగ్లా బౌలర్లలో మిరాజ్, షకీబ్ హసన్ తలో వికెట్ తీసుకున్నారు. ఆసీస్ విజయం సాధించాలంటే మరో 156 పరుగులు కావాల్సి ఉంది. అంతకముందు ఓవర్‌నైట్ స్కోరు 45/1 తో మూడో రోజు ఆట ఆరంభించిన బంగ్లా ఆటగాళ్లు తమిమ్ ఇక్బాల్ హాఫ్ సెంచరీతో ఆకట్టుకోగా, తాయిజుల్ ఇస్లాం 4 పరుగులకే చేతులేత్తేశాడు. అనంతరం బరిలోకి దిగిన ఇమ్రూల్ కెయిస్ కూడా పేలవ ప్రదర్శనతో రెండు పరుగులకే నిష్క్రమించాడు. అనంతరం కెప్టెన్ ముష్ఫికర్ రహీం దూకుడుగా ఆడి (114 బంతుల్లో 1 ఫోరు, 1 సిక్స్) 41 పరుగులు సాధించి లియోన్ బౌలింగ్‌లో రనౌట్ అయ్యాడు. మరో ఆటగాడు షకీబ్ అల్ హసన్ (5), షబ్బీర్ రహమన్ (22), హసన్ మీరజ్ (26), షఫీల్ ఇస్లాం (9) పరుగులకే వరుసగా పెవిలియన్‌కు వరుస కట్టారు. సహచర జట్టు సభ్యులు పేలవ ప్రదర్శనతో మైదానం వీడినప్పటికీ తమిమ్ తనదైన శైలిలో ఆసీస్ బౌలర్ల బంతులను సమర్థవంతంగా తిప్పికొట్టాడు. తన బ్యాటింగ్ శైలితో ఆకట్టుకుంటూ 155 బంతుల్లో 8 ఫోర్లు బాది 78 పరుగులు హాఫ్ సెంచరీ నమోదు చేశాడు. ఈ క్రమంలో కమిన్స్ బౌలింగ్‌లో వాడే కు క్యాచ్ ఇచ్చి తమిమ్ నిష్క్రమించాల్సి వచ్చింది. దీంతో 79.3 ఓవర్లలో 221 పరుగులు చేసి బంగ్లాదేశ్ ఆలౌట్ అయింది. దీంతో ఆస్ట్రేలియాకు బంగ్లాదేశ్ 265 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. ఆసీస్ బౌలర్లో కమిన్స్ ఒక వికెట్ తీసుకోగా, అగర్ రెండు వికెట్లు, నాథన్ లియాన్ ఏకంగా ఆరు వికెట్లను తన ఖాతాలో వేసుకుని బంగ్లా పతనాన్ని శాసించాడు. అంతకముందు బంగ్లాదేశ్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 260 పరుగులు చేసి ఆలౌట్ అయింది. ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 74.5 ఓవర్లలో 217 పరుగులకు ఆలౌట్ అయింది.



నాథన్(6/82)

స్కోరు బోర్డు

బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్: 260 ఆలౌట్
ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 217 ఆలౌట్
బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్: 221 ఆలౌట్
ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్ 109/2



Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.